ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

వరంగల్

: fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 91 పేజీలు: 8+16 వెల: 6.50



ఒడిలో నాలుగేళ్ల కొడుకుతో తల్లిమృతి
జబల్పూర్ పడవ ప్రమాదం
5లో



శుక్రవారం డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌ను అభినందిస్తున్న మహేష్ భగవత్ తదితరులు

## శాంతి భద్రతల పరిరక్షణలో
# రాజీలేదు

**నేర నియంత్రణలో అత్యంత కఠినం**

**తుది దశకు ఫోన్ ట్యాపింగ్ విచారణ**

**డిజిపిగా బాధ్యతలు చేపట్టిన సివి ఆనంద్**

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ విషయంలో రాజీపడేది లేదని, కఠినంగా వుంటామ ని నూతన డిజిపి సి.వి ఆనంద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ >>2

సమ్మె కాలం

# వేతనాలు చెల్లిస్తాం



శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్టీసి కార్మిక సంఘాల ప్రతినిధులు సిఎం రేవంత్ రెడ్డిని సన్మానించిన దృశ్యం

**కేసుల ఎత్తివేతకు సిఎం రేవంత్ రెడ్డి అంగీకారం**

**గుర్తింపు ఎన్నికలు, విలీనంపై సమగ్ర కార్యాచరణతో రండి**

**పిఆర్సీని పరిష్కరిస్తాం, ఎవరినీ తొలగించం**

**గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినల్స్**

**ఆర్టీసి కార్మిక సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే1:** ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్రకార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని సిఎం హామీ ఇచ్చారు. సిఎం ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూని యన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి, భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం అన్నారు. అనేక ఇబ్బందులున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి తాము పెద్దపీట వేస్తున్నామని సీఎం తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.700కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సిఎంగుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని. కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చిన్న చిన్న స్పర్థలతో సంస్థకు నష్టంవాటిల్లే పనులు చేయకూడదని, సంస్థ మనుగడ సాగిస్తేనే అందరికీ మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి >>2

## తుమ్మిడిహెట్టి వద్ద
# బ్యారేజ్ నిర్మాణం తథ్యం

**మహారాష్ట్రతో సంప్రదింపులకు ప్రణాళిక, ముంపు తగ్గింపునకు ప్రత్యామ్నాయ మార్గాలు**

**మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లకు మరమ్మతులు, రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ వెల్లడి**

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన చేవెళ్లప్రాణహిత వద్ద బ్యారేజ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. అందుకుగాను తుమ్మిడిహట్టి వద్ద నిర్మించ తలబెట్టిన బ్యారెజి నిర్మాణనికి మహారాష్ట్రతో సంప్రదింపులు జరిపేందుకు పూర్తి స్థాయిలో సాంకేతిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్‌ను ఆదేశించారు. ఈ మేరకు బేగంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి ఉత్తమ్ ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహారాష్ట్రలోని భూభాగంతోపాటు చప్రాల వన్యప్రాణుల అభయారణ్యంలో ముంపు ప్రభావం తగ్గేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలకు అవసరమైతే నష్ట పరిహారాన్ని చెల్లించేందుకు తెలంగాణా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో 148 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మాణానికి అంగీకరించిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ తక్కువ వ్యయంతో వరద నీటి ప్రవాహాన్ని వినియోగించేలా నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు ఉండాలన్నారు. సాంకేతిక నైపుణ్యం, ఆర్థిక ప్రయోజనాలతోపాటు సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆయన స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికిగాను అంతర్ రాష్ట్ర చర్చలకు ముందే ప్రత్యామ్నాయ మార్గాలు, సాధ్యాసాధ్యాలు, ఖర్చు



శుక్రవారం అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి ఉత్తమ్

చేసే మొత్తంతో ఒనగూరేప్రయోజనాలతోపాటు భూగర్భానికి సంబంధించిన సాంకేతిక వివరాలతో పూర్తిస్థాయిలో నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్లప్రాణహిత ప్రాజెక్టును గోదావరి ఉపనది ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మించి వరద కాలువలతో సాగునీరు సరఫరా చేయడంతోపాటు అవసరమైన చోట ఎత్తిపోతల పథకాలు నిర్మించి ఎగువ ప్రాంతాలకు మళ్లించేలా ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఉత్తర తెలంగాణా జిల్లాలతోపాటు ఎల్లంపల్లి జలాశయాలతో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రాంతాల వరకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రూపొందించిందన్నారు. తక్కువ >>2



## రేపే నీట్
# పరీక్ష

**22,79,743 మంది దరఖాస్తు**

**13 భాషల్లో పరీక్ష నిర్వహణ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే1:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు ఇతర మెడికల్ కోర్సులకు సంబంధించి జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)- యుజీ-2026 పరీక్ష రేపు(ఆదివారం) దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలను పరీక్షకు అరగంట ముందుగానే మూసివేస్తారు. పరీక్షను దేశ వ్యాప్తంగా 552 నగరాల్లో నిర్వహించనున్నారు. నీట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నిర్వహిస్తున్న సంగతి >>2

## రైతు హామీల అమలులో
# సర్కార్ విఫలం

**ప్రతి గింజను ఎమ్మెస్పీ ధరకు కొనుగోలు చేయాలి: సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ బహిరంగలేఖ**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే1:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమల్లో ఘోర వైఫల్యం చెందిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఫలితంగా రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రబీ సీజన్‌లో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని, తాలు, తరుగు, తేమ పేరు చెప్పి దోచుకుంటున్న దళారుల నుండి రైతును ఆదుకుని ప్రతి గింజను ఎమ్మెస్పీ ధరకు కొనుగోలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుక్రవారం మూడు పేజీల బహిరంగ లేఖ రాశారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సైతం రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంవల్ల ఆ పథకం ద్వారా తెలంగాణ రైతులు ప్రయోజనం అందుకోలేకపోతుండటం బాధాకరమని తెలిపారు. ముఖ్యంగా వడ్లు, మొక్కజొన్న, శనగ కొనుగోలులో ప్రభుత్వ నిరక్ష్యం ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. మండుతున్న ఎండలు, వడగాడ్పులు, అకాల వర్షాలతో తెలంగాణ రాష్ట్ర రైతాంగం అల్లాడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లు, మక్కజొన్న, శనగలు, పొద్దుతిరుగుడుసహా రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి నానా పాట్లు పడుతున్నారని, ఆరుగాలం పండించిన పంటలను వెంటనే అమ్ముకునే దిక్కులేక మండుటెండలో రోజుల తరబడి ఎదురు చూస్తూ అస్వస్థతకు గురవుతూ ఆసుపత్రుల పాలై చనిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా కపోవడం అత్యంత బాధాకరమని బండి ధ్వజమెత్తారు. అన్నదాతలు పడుతున్న కష్టాలను చూడలేక అత్యంత బాధాతప్త హృదయంతో కొన్ని విషయాలను ఈ లేఖ ద్వారా మీ దృష్టికి తీసుకువస్తున్నట్లు >>2



లారీని ఢీకొట్టిన కారు

## దైవదర్శనానికి వెళ్లి వస్తూ
# అనంతలోకాలకు..

**ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు**

**శంషాబాద్ ఒఆర్‌ఆర్‌పై ఘోరప్రమాదం**

**ఆరుగురు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**

**రంగారెడ్డి మే1,ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా లారీని కారు ఢీకొని ఆరుగురు మృతి చెందిన ఘటన శంషాబాద్ మండల తొండుపల్లి ఔటర్ రింగ్‌రోడ్డుపై చోటు చేసుకుంది. శంషాబాద్ సిఐ నరేందర్ రెడ్డి తెలిపినవివరాల ప్రకారం సనత్‌నగర్ నుండి బొబ్బిలి శివ కుమార్ తన వ్యాగనర్ కారు (టిఎస్23ఎఫ్ 2298) కారులో తన కుటుంబ సభ్యులు బొల్లి లావణ్య, బొల్లి రిషిత, కొడెం శ్రీనివాస్, కృష్ణ చంద్ర, కోడెం మాధవ్, శ్వేత మొత్తం 7 మంది యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకుని తిరిగి సనత్ నగర్ వస్తుండగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న (ఎపి39 యూవి 0909) లారీని అతివేగంగా ఢీకొట్టడంతో లారీకిందికి కారు దూసుకెళ్లి కారు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో కారులో ఉన్న ఏడుగురికి తీవ్రగాయాలు కాగా, ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



ఘటన స్థలానికి చేరుకున్న శంషాబాద్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా హాస్పిటల్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఈ రోడ్డు ప్రమాదాన్ని కారణం అతివేగం, డ్రైవింగ్ నిరక్ష్యం వల్లే జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# భగ్గుమన్న వాణిజ్య సిలిండర్

**న్యూఢిల్లీ, మే 1:** దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను ఏకంగా రూ.993కు పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంపు నేటి నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల సిలండర్ ధర రూ.3,071.50కి చేరింది. అదే హైదరాబాద్‌లో అయితే 19 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరలు రూ.1000 పెరిగి రూ. 3315వరకూ చేరింది. ఈ ధరలు శుక్రవారంనుంచే అమలులోకి వచ్చాయి. అయితే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. అమెరికా ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో విడతల వారీగా కమర్షియల్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు పెంచాయి. ఫిబ్రవరి 28 తర్వాత కమర్షియల్ సిలిండర్ ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. మార్చి ప్రారంభంలో సుమారు రూ.115 పెరిగిన ధరలు, ఏప్రిల్ 1న 200 వరకు పెరిగాయి. ఇప్పుడు ఒకేసారి రూ.993 పెంచారు. దీంతో ఒక్క వాణిజ్య సిలిండర్ ధర రూ.3వేలు దాటింది. తాజా పెంపుతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడనుంది. ఇంధన ధరల విషయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వివరాల ప్రకారం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరిగినప్పటికీ ఆయిల్ కంపెనీలు వాటిని భరిస్తున్నాయని తెలిపింది. దీంతో ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పులేదు. ఇక దేశీయ >>2




**రూ.993 మేర భారీగా పెంపు**

**హైదరాబాద్ మార్కెట్‌లో రూ.3315**



## ఓట్ల లెక్కింపు సిబ్బందిపై
# 'సుప్రీం'కు మమత

**ఇసి వైఖరిపై సిఎం ధ్వజం**

**న్యూఢిల్లీ, మే 1:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్లలెక్కింపు సిబ్బందిగా కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులను నియమించడంపై మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ సుప్రీం కోర్టులో పిటిషన్‌దాఖలుచేసి అత్యవసర >>2

## జిఎస్టీ వసూళ్లలో
# తెలంగాణ టాప్-2

**కర్ణాటక తర్వాత రాష్ట్రంలోనే అధిక పరోక్ష పన్నుల వసూళ్లు**




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే1:** దేశంలోనే జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో కర్ణాటక నిలిచింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో జీఎస్టీ రాబడి వసూళ్ల గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏప్రిల్‌లో 35 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో అధిక పనితీరును వాణిజ్య పన్నుల శాఖ నమోదు చేసింది. ఏప్రిల్ 2025లో రూ.3,433 కోట్ల జీఎస్టీ రాబడి రాగా ఈ సంవత్సరం ఏప్రిల్‌లో జీఎస్టీ రాబడి రూ.4,621 కోట్లుగా నమోదయ్యింది. గతేడాది కన్నా ఈ సంవత్సరం రూ.1,188 కోట్ల రాబడి వాణిజ్య పన్నుల శాఖకు అధికంగా వచ్చింది. దీంతో ఈ సంవత్సరం ఈ శాఖ 35 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. ఏప్రిల్‌లో వచ్చిన రూ.4,621 కోట్ల జీఎస్టీ ఆదాయం జీఎస్టీ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధికంగా వచ్చిన రాబడిగా నమోదు కావడం విశేషం. మార్చి 2026 నెలలో వాణిజ్య పన్నుల శాఖకు రూ.4,231 కోట్ల రాబడి రాగా, ఏప్రిల్‌లో అది మరింత పెరగడం విశేషం. రాష్ట్ర జీఎస్టీ ఆదాయం నాలుగు నెలలుగా నిరంతరం రూ.4 వేల కోట్లకు పైగా నమోదవుతోంది, జనవరి 2026 నుంచి వాణిజ్య పన్నుల శాఖ రాబడిని అధిగమిస్తూ వస్తోంది. ఈ నాలుగు నెలల్లో వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వసూలైన మొత్తం ఆదాయంలో పెట్రోల్, మద్యంపై వచ్చిన పన్నులతో పాటు ఇతర పన్నులు కూడా ఉన్నాయి. ఇక, జీఎస్టీ ద్వారానే రూ.7,570 కోట్లు వసూలు కాగా, ఇది ఇప్పటివరకు ఇదే అత్యధికమని వాణిజ్య పన్నుల శాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో నమోదైన పన్ను చెల్లింపుదారుల నుంచి వసూలు చేసిన ఐజీఎస్టీ, సీజీఎస్టీ, ఎస్జీఎస్టీలతో కలిపి జీఎస్టీ ఆదాయం రూ.7,181 కోట్లుగా నమోదయ్యింది. ఇందులో సీజీఎస్టీ ద్వారా రూ.2,092 కోట్లు, ఎస్జీఎస్టీ ద్వారారూ.2,527 కోట్లు, >>2



శుక్రవారం ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన విహెచ్‌ను సత్కరిస్తున్న సిఎం రేవంత్

# బ్యారేజ్ నిర్మాణం తథ్యం

>> వ్యయంతో ఉత్తర తెలంగాణా జిల్లాలో 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న సంకల్పంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుందన్నారు. అయితే 2014లో తెలంగాణా రాష్ట్రం ఏర్పడడం అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ అంటూ అకారణంగా కాళేశ్వరం పేరుతో మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజి నిర్మించినా ఆశించిన ప్రయోజనం చేకూరలేదన్నారు. ఎత్తిపోతలపై ఆధారపడడంతో విద్యుత్ చార్జీలు పెనుభారంగా పరిణమించాయన్నారు. భారీ వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు బయట పడడంతో వరద కాలువల ద్వారా లభించే ప్రయోజనాలు నెరవేరకపోగా రంగారెడ్డి జిల్లా చివరి ప్రాంతాలకు ఎంత మాత్రం ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రాణహిత చేవెళ్లను పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యే ప్రసక్తే లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న మౌళిక సదుపాయాలను సాధ్యమైన మేర వినియోగించుకుంటూ తక్కువ వ్యయంతో ఎల్లంపల్లి నుండి వరద కాలువ ద్వారా నీటిని సరఫరా చేయడంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని వివరించారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి, అక్కడి నుంచి సుందిళ్ల వరకు అనుసంధానానికి నాలుగు ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్ ప్రతిపాదనలను నిపుణులు, ఆర్వీ అసోసియేట్స్‌తో కలిసి సవివరంగా పరిశీలిస్తున్నారన్నారు. భూసేకరణ తగ్గించడం, పంపింగ్ అవసరాన్ని తగ్గించడం, టన్నెల్లు, కాలువల పొడవు తగ్గించడం, మొత్తం ప్రాజెక్టు సాధ్యా సాధ్యాలను మెరుగుపరచడం ఈ అధ్యయనాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. అందుకుగాను తుమ్మిడిహట్టి ప్రాంతంలో భూగర్భ, భౌగోళిక సర్వేలు కూడా వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. అదే సమయంలో... కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు వర్షాకాలానికి ముందే అత్యవసర మరమ్మతులు పూర్తి చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి చెప్పారు. మరమ్మతుల కోసం ప్రతి 1.5 మీటర్లకు ఒకసారి స్టాండర్డ్ పెనెట్రేషన్ టెస్ట్, ప్రతి 3 మీటర్లకు ఒకసారి పర్మియబిలిటీ పరీక్షలు నిర్వహించాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాతి పొర తగిలిన తర్వాత కూడా మరింత లోతుగా డ్రిల్లింగ్ చేయాలని సూచించారు. ఇందుకోసం సమన్వయ కమిటీ వెంటనే ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించి, పనులకు స్పష్టమైన కాలపట్టిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఇఎన్‌సి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం మిర్యాలగూడలో మేడే వేడుకల్లో పాల్గొని పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన డి.సిఎం భట్టి

# భగ్గుమన్న వాణిజ్య సిలిండర్

>> ఎయిర్‌లైన్స్‌కు విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలను కూడా కేంద్రం యథాతథంగా ఉంచింది. అంతర్జాతీయ విమానసర్వీసుల సంస్థలకు మాత్రం ఐదుశాతం ధరలను పెంచారు. నెలవారీ పెరుగుదలల్లో రెండోసారి పెంచినట్లయింది. కిలోలీటరుకు 76.55 డాలర్లు పెంచారు. ప్రస్తుతం ఢిల్లీలో కిలో లీటరుకు 1511.86 డాలర్లుగా నమోదయింది. ఇదిలా ఉంటే పెట్రోలు డీజిల్‌పై లీటరుకు రూ.4-5 వరకూ పెంచే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. అలాగే గృహావసరాల సిలిండర్లపైనా కూడా రూ.40నుంచి 50 వరకూ పెంచుతారన్న వార్తలు వెలవడుతుండటంతో వంటగ్యాస్ కూడా ఇకపై మరింత ప్రియం కానున్నది.

# రైతు హామీల అమలులో సర్కార్ విఫలం

>> బండి పేర్కొన్నారు. గత రబీ సీజన్ కూ బోనస్ ఎగ్గొట్టారు,.ఈ సీజన్‌లోనూ బోనస్‌కు పాతరేసినట్లేనా? అని ప్రశ్నించారు. సన్న వడ్లకే బోనస్ ఇచ్చి దొడ్డు వడ్లు పండించిన రైతులకు మొండి చేయి చూపారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీని తుంగలో తొక్కారు. పత్తి పంటకు ఎమ్మెస్పీ ఎగ్గొట్టి రైతులను ముంచారని విమర్శించారు. మొక్కజొన్నకు కేంద్రం ఎమ్మెస్పీ ఇస్తున్నా కొనుగోలు బాధ్యతను విస్మరించి దళారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అకాల వర్ష బాధిత రైతాంగానికి ఏదీ పరిహారం? అకాల వర్షాలతో రెండున్నరేళ్లలో 5 లక్షలకుపైగా ఎకరాల్లో పంట నష్టపోతే ప్రభుత్వం ఏం చేస్తోందని బండి సంజయ్ ఆ లేఖలో ప్రశ్నించారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.5 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.260 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటారా? అని ప్రశ్నించారు. పౌరసరఫరాల సంస్థను అప్పుల ఊబిలోకి నెడతారా? అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ రూ.56 వేల కోట్ల అప్పులతో దివాళా తీయించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సంస్థను రూ.లక్ష కోట్ల అప్పుల పాల్జేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరంగల్ డిక్లరేషన్ ను పాతిపెట్టి, రాయపూర్ ఏఐసీసీ రైతు తీర్మానాలకు తిలోదకాలిచ్చారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన ప్రశ్నించారు. రబీ సీజన్‌లో రైతుల వెతలపై మీరు ఏనాడైనా సమీక్షి ంచారా అని నిలదీశారు. వడగాల్పులతో జనం అల్లాడుతుంటే మీ డిజాస్టర్ మంత్రి నిద్రపోతున్నారా?, ఎన్నడూ లేనంతగా ఎండలు మండిపోతుంటే సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఏదని కేంద్రమంత్రి అడిగారు. తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే ఆందోళన తప్పదని బండి ఆ లేఖలో హెచ్చరించారు.

# 'సుప్రీం'కు మమత

>> విచారణకోరింది. ఓట్లలెక్కింపు నాల్గవ తేదీనే ఉన్నందున తమ పిటిషన్ వెంటనే విచారించాలని కోరింది. జస్టిస్ పిఎస్ నరసింహ, జోయ్‌మాల్యా బాగ్చీల ఆధ్వర్యంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను శనివారం విచారించనున్నది. రెండో విడత పోలింగ్‌లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మమతా బెనర్జీ బయటినుంచి వచ్చిన పరిశీలకులు పోలీస్ అధికారులు బెంగాల్‌గురించి వారికేమీ తెలియదని, టిఎంసి కార్యకర్తలే లక్ష్యంగా వారినినియమించారని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలు రాజకీయ వాతావరణంలో ఉద్రిక్తతలను పెంచాయి. టిఎంసి, బిజెపి కార్యకర్తలమధ్య రెండో విడత పోలింగ్‌లో అనేక చోట్ల ఘర్షణలుతలెత్తాయి. ఇటీవలే అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఒక సందేశం ఇస్తూ ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక కేంద్రప్రభుత్వ ఉద్యోగి లేదా ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగి ఉండాలని ఆదేశించారు. దీనితో టిఎంసి ఈ సర్క్యులర్‌ను సవాల్‌చేసింది. ఇలాంటి ఆదేశాలు కేవలం కేంద్ర ఎన్నికల సంఘం మాత్రమే ఇవ్వాలని, అదనపు సిఇఒకు ఎలాంటి అధికారాలుండవని వాదించింది. ఎన్నికలసంఘం హ్యాండ్‌బుక్‌లో అలాంటివేమీ లేవని సూక్ష్మస్థాయి పరిశీలకులు సహజంగానే కేంద్ర సర్వీసులనుంచి వస్తారని, అదే విధంగా ఓట్లలెక్కింపు సిబ్బందికి కూడా ఈ విధానం వర్తింపచేయడం ఎక్కడా ఇప్పటివరకూ లేదని, కేవలం పశ్చిమబెంగాల్‌లోనే అమలుచేయడం ఏకపక్షమేనని మమతా బెనర్జీ టిఎంసి నేతలు వాదిస్తున్నారు. దీనివల్లకేంద్ర ప్రభుత్వ ఉద్యోగులంతా ఎన్డీయే పరిధిలోనే ఉంటారని, అందువల్ల ఈ విధానంలో తమ పార్టీకి నష్టం కలగడంతోపాటు ఓట్లలెక్కింపులో విద్రోహచర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని వాదించారు. అయితే కోల్‌కత్తా హైకోర్టు ఈ వాదనలను తిరస్కరించింది. ఎన్నికల సంఘాన్ని కేంద్ర లేదా రాష్ట్రప్రభుత్వ సర్వీసులనుంచి లెక్కింపు సిబ్బందిని నియమించుకోవచ్చని స్పష్టంచేసింది. సిబ్బందిఎ ంపిక అనేది కేవలం ఎన్నికల సంఘం విచక్షణతోనే ఉంటుందని ఇప్పటికే ఓట్లలెక్కింపు కేంద్రాల్లో అన్ని భద్రతా చర్యలు తీసుకున్నట్లు గుర్తించింది. మైక్రో అబ్జర్వర్లు, అభ్యర్థినియమించిన కౌంటింగ్ ఏజెంట్లు, సిసిటివి నిఘా నిరంతరం ఉంటుందని, టిఎంసి లేవనెత్తిన అభ్యంతరాలకు ఆధారాలు లేవని హైకోర్టు పిటిషన్ కొట్టివేయడంతో టిఎంసి సుప్రీంకోర్టులో హైకోర్టు ఉత్తర్వులను సవాల్‌చేసింది.

# 7న తుమ్మిడిహెట్టికి సిఎం రేవంత్

## ప్రాణహిత నది పరిశీలన.. ఉన్నతాధికారులతో కీలక సమీక్ష

## అనంతరం బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం మరింత ఫోకస్ పెట్టింది. ఇటీవలే ఇంజినీర్లతో ఈ ప్రాజెక్టుపై సిఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 7న ప్రాజెక్టు నిర్మాణం తలపెట్టిన కుమురంభీం జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామానికి సిఎం వెళ్లనున్నారు. ప్రాణహిత నదిని పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చిస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ మేరకు సభాస్థలి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితికాపంత్, ఎమ్మెల్సీ దండే విఠల్ పరిశీలించారు. కాగా.. ఉమ్మడి ఎపిలో వైఎస్.రాజ శేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నాటి సిఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టును రద్దు చేసి ఆ స్థానంలోనే కాళేశ్వరం భారీ ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించి దాదాపు నిర్మాణం పూర్తి చేశారు. అయితే కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారెజి పిల్లర్లు కుంగడంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రాణహిత ప్రాజెక్టును మరోసారి తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలోనే ఈ నెల 7న ఆయన మేరకు తుమ్మిడిహెట్టిలో పర్యటించనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కమర్షియల్ గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోండి

## - కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం పడుతోందని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. 19 కేజీల గ్యాస్ ధరను రూ.993కు అంటే సుమారు రూ.1000 పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్రం ఒక్కసారిగా 30 నుండి 35 శాతం పెంచడంతో హోటళ్లు, కేఫ్‌లు రెస్టారెంట్లతో సహా చిన్న తరహా, వీధి వ్యాపారులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన 24 గంటలు పూర్తి కాగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, ఇది ముమ్మాటికీ ఇది సామాన్య ప్రజలను మోసం చేయడమేనని స్పష్టం చేశారు. కేంద్రం పెంచిన ధరలతో 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3000కు మించి పోయిందని తెలిపారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడుతుందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహారించుకోవాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ నేత పవన్ ఖేరాకు సుప్రీం కోర్టులో ఊరట

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** అస్సాం సిఎం హిమంత బిశ్వశర్మ సతీమణి రిణికి భుయాన్‌పై వ్యాఖ్యలు చేసినందుకు అస్సాంలో నమోదైన పోలీసు కేసుల్లో నిందితుడుగా వున్న కాంగ్రెస్ అధికార ప్రతనిధి పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. పవన్ ఖేరా ముందస్తు బెయిల్‌పై విచారణ జరిపిన జస్టిస్ జెకె మహేశ్వరీ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం తీర్పు రిజర్వ్‌చేయడం తెలిసిందే. శుక్రవారం మ ధ్యాహ్నం ఈ కేసులో పవన్ ఖేరాకు బెయిల్ ఇస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధికి ఎట్టకేలకు సుప్రీంకోర్టులో ఊరట దక్కింది. అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ సతీమణి రిణికి భుయాన్‌పై వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై అస్సాంలో కేసు నమోదవగా అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. అస్సాం పోలీసులు ఆయన కోసం గాలిస్తుండగా తెలంగాణ హైకోర్టు పవన్ ఖేరాకు ముందస్తు బెయిల్ ఇచ్చింది. దీనిని అస్సాం పోలీసులు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు డిస్మిస్ చేస్తూ అస్సాంలో కేసు నమోదైనందున ఆ రాష్ట్రంలో బెయిల్ పొందాలని ఆదేశించింది. దీంతో ఖేరా అస్సాం కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా దీనిని అస్సాం కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో ఖేరా అస్సాం కోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో ఇరువర్గాల వాదనలు విన్న తరువాత ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. కాగా శుక్రవారం దీనిపై తీర్పు వెలువరించిన కోర్టు ఇదే సమయంలో ఖేరాకు షరతులను విధించింది. దేశం విడిచి వెళ్లరాదని, పోలీసుల విచారణకు సహకరించాలని, సాక్ష్యాలను తారుమారు చేయరాదని, అవసరం అయితే విచారణ నిమిత్తం మరిన్ని షరతులను విధిస్తామని ధర్మాసనం పేర్కొంది.

# కవితతో మాజీ మంత్రి బోడ జనార్ధన్ భేటీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి

**హైదరాబాద్, మే 1 :** కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్‌లోకి చేరికలు మొదలయ్యాయి. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ టీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈరోజు బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవితతో జనార్ధన్ భేటీ అయ్యారు. బోడ జనార్ధన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడిగా పేరుగాంచారు. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు.

# జిఎస్టీ వసూళ్లలో తెలంగాణ టాప్-2

>> ఐజీఎస్టీ రూ.2,562 కోట్లుగా నమోద య్యింది. ఇది గతేడాదితో పోలిస్తే 12.6 శాతం వృద్ధిని నమోదుచేసింది. అన్ని రాష్ట్రాలకంటే జీఎస్టీ వృద్ధిలో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో కర్ణాటక ఉంది. (ఏప్రిల్ 2025 నాటికి కర్ణాటక 14.5 శాతం వృద్ధిని నమోదు చేసింది). స్థిరమైన వాణిజ్య అనుకూల వాతావరణం మద్దతుతో, కీలక రంగాలలో ఆర్థిక కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగడం తెలంగాణ ఆదాయ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఇది కొత్త పెట్టుబడులను ఆకర్షించి, ఇప్పటికే ఉన్న వ్యాపారాలు సమర్థవంతంగా విస్తరించడానికి వీలు కల్పించింది. తద్వారా ఉపాధి కల్పన, వినియోగం పెరిగింది. అధిక ఆర్థిక కార్యకలాపాలు రాష్ట్రానికి మెరుగైన పన్ను వసూళ్లు, మొత్తం ఆర్థిక బలంగా పరిణమించాయి.పన్నుల చెల్లింపులకోసం అనువైన సానుకూల, స్నేహపూర్వక వాతావరణం వృద్ధిచెందడంవల్లనే జిఎస్టీ రాబడులు పెరిగాయని వాణిజ్య పన్నులశాఖ వెల్లడించింది.

# శాంతి భద్రతల రక్షణలో రాజీలేదు

>> కేసు విచారణ తుది దశకు చేరుకుందని, దీనిపై త్వరలో సమీక్ష నిర్వహించి రె ండవ ఛార్జిషీట్ దాఖలు చేస్తామని ఆయన తెలిపారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు వెంటనే లొంగిపోయి, జనజీవన స్రవంతి లో కలవాలని, వారికి ఇచ్చే పునరావాస ప్యాకేజి విషయంలో తాను దగ్గరుండి సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం ఆనంద్ లక్ డికాపూల్‌లోని డిజిపి కార్యాలయంలో డిజిపిగా బాధ్యతలు చేబట్టారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆనంద్ వేద పండితుల సమక్షంలో జరిగిన పూజా కార్యక్రమాల తరువాత తన కుర్చీలో ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ డిజిపిగా తన ప్రాధాన్యతలను మీడియాకు వివ రించారు. డిజిపి పోస్టును తనపై నమ్మకం వుంచి ఇచ్చినందుకు సిఎం రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పోలీసు విభాగ ం దేశంలో నంబర్ వన్‌గా వుందని, దీనిని యథాతథంగా కొనసాగించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. రాష్ట్ర పోలీసు శాఖ అనేక రంగాల్లో విప్లవాత్మకంగా అభివృద్ధి చెందిందని, దీనిని మరింత ముందుకు తీసుకుపోతామని ఆయన తెలిపారు. శాంతి భ ద్రతల నిర్వహణలో క్షేత్రస్థాయిలో వుండే పోలీసు సిబ్బంది మరింత క్రియాశీలకంగా వుండేలా చూస్తామని ఆయన తెలిపారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందుగానే జాగ్రత్త పడడం మంచిదని, ఈ విషయంలో అందరు నిరంతరం సమన్వయంగా మెలగాలని ఆయన కో రారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆశయాలను పోలీసు శాఖ కొనసాగిస్తుందని ఆయన వెల్లడించారు.

## నేరాల నివారణకు సాంకేతికతను వాడతాం, ఎఐని వినియోగిస్తాం

### రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ ఏర్పాటు

రాష్ట్రంలో నేరాలను నివారించడంతో పాటు వాటి దర్యాప్తు వేగంగా జరిగేలా చూస్తామని, ఈ విషయంలో సాంకేతికను మరింతగా వాడతామ ని ఆనంద్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా ఇందులో వాడతామని ఆయన తెలిపారు. నేరాల స్వభావం గడచిన కొంతకాలంగా పూర్తిగా మారిపోయిందని, అనేక నేరాలలో నేరస్తులు టెక్నాలజిని వాడి పోలీసులకు సవాల్ విసురుతున్నారని, దీనిపై వ్యూహాత్మకంగా ముందు కు వెళతామని ఆయన అన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైం వెర్రితలలు వేస్తోందని, దీనిని కఠినంగా అణచి వేయాల్సి న అవసరం వుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో జిల్లాల పోలీసులు మరింత అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు. మాదకద్రవ్యాలను పూర్తిగా అణచి వేస్తామని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడిలో ఈగల్ పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయంగా వుందని ఆయన కొనియాడారు. రోడ్డు ప్రమాదాలు రా ష్ట్రంలో ఎక్కువగానే వుండడం ఆందోళనకరమని ఆయన తెలిపారు. ఈ విషయంలో ఇప్పటికే అమల్లో వున్న అరైవ్, అలైవ్‌కు తోడుగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చట్టాలను, నిబంధనలను అందరు పాటించాల ని ఆయన కోరారు. రాష్ట్రంలో అవసరం వున్న చోట అదనపు సిబ్బందిని నియమించడం, అవసరం లేని చోట అధికంగా వున్న వారిని మార్చ డంపై దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. 1980, 1990 దశకంలో నక్సల్స్ సమస్య వుండగా ఇప్పుడది కనుమరుగయ్యిందని, అప్పట్లో ఎస్ ఐబి, గ్రే హౌండ్స్ విభాగాలు వుండడం వల్ల నక్సలిజంపై పైచేయి సాధించామని ఆనంద్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తుది దశ కు చేరిందని, ఈ కేసును సిట్ విచారిస్తుందని, సిటీ కమిషనర్‌గా వున్న సమయంలో దీనిపై సమాచారం తనకు వుందని, మరోసారి పూర్తిగా సమీక్షించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మావోయిస్టులు ఎక్కడ వున్నా వెంటనే లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి సర్కారు ఇస్తున్న పునరావాసం కచ్చితంగా అందేలా చూస్తానని, దీనిపై రెండు నెలలకు ఒకసారి సమీక్షిస్తానని ఆనంద్ వెల్లడించారు. మీ డియా సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, పోలీసు నియామక మండలి డిజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తాం

>> రేవంత్ రెడ్డి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను సిఎంరేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోని కావని, కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధులను వాడుకుందని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు, రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచిన్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేప్టటామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి ్మ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, నెలా నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని సీఎం అన్నారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో 100 ఎకరాలు కేటాయించామని,బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు.ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్ యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని.. ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గుచూపుతున్నామని సిఎం ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని సీఎం అన్నారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కృషి చేస్తామని సీఎం తెలిపారు. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలని సిఎం పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను తొలగించమని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, మేనేజ్‌మెంట్ మధ్య గ్యాప్ రాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిపో మేనేజర్లు, ఈడీ, ఎండీ స్థాయి అధికారులు తరచూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై సుహృద్భావ వాతావరణంలో మాట్లాడుకుంటే సగం సమస్యలు పరిష్కారమవుతాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో మూడు నెలలకోసారి సమావేశం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డికి సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్.రెడ్డి, థామస్ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్) , అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (రి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయిస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండీ మోలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకే బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (రి)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కె.సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.

# రేపే నీట్ పరీక్ష

>> తెలిసిందే. నీట్ యుజీ- 2026 పరీక్ష కోసం 22,79,743 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 13,32,928 మంది మహిళా అభ్యర్థులు ఉండగా 9,46,815 మంది పురుష అభ్యర్థులు ఉన్నారు. దరఖాస్తుదారులలో మహిళలు 58 శాతంగా ఉన్నారు. నీట్ యుజీ-2025లో దరఖాస్తు చేసుకున్న 22,76,069 వారికంటే ఈ ఏడాది ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 1,28,875 సీట్లకి పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. పరీక్షను మొత్తం 13 భాషల్లో నిర్వహించనున్నారు. పరీక్షను తెలుగు, ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళంతోపాటు ఉర్దూ భాషల్లోనూ పరీక్షను నిర్వహిస్తున్నారు. నీట్ యుజీ-2026లో బయోమెట్రిక్ మినహాయింపుకు సంబంధించి పరీక్ష రోజున, తనిఖీ ప్రక్రియ పూర్తయిన తర్వాత, ప్రతి అభ్యర్థి పరీక్ష గదిలోకి ప్రవేశించే ముందు తప్పనిసరి బయోమెట్రిక్ తీసుకోవాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ తీసే క్రమంలో పరికరంలో హార్డ్‌వేర్ వైఫల్యం, బయోమెట్రిక్ డేటా నాణ్యత తక్కువగా ఉండటం, నెట్ వర్క్ కనెక్టివిటీ వైఫల్యం, బయోమెట్రిక్ డేటా ధృవీకరణ పూర్తి కాకపోయినా, అభ్యర్థిని పరీక్షా గదిలోకి ప్రవేశించడానికి అనుమతించాలని ఎన్‌టీఏ ప్రకటించింది. దీనికోసం అభ్యర్థి లిఖితపూర్వక హామీ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ హామీ పత్రం నమూనాను పరీక్షా కేంద్రంలో అందించబడుతుందని ఎన్‌టీఏ ప్రకటించింది.

## రాష్ట్ర ప్రజలకు బుద్ధ పూర్ణిమ శుభాకాంక్షలు

### సిఎం రేవంత్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి

**హైదరాబాద్, మే 1 :** పవిత్రమైన 'బుద్ధ పూర్ణిమ' సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. కరుణ, దయ, సహనం, శాంతి మార్గాలను బుద్ధ భగవానుడు మానవాళికి అందించిన అమూల్యమైన బోధనలు నేటి సమాజానికి మార్గదర్శనం చేస్తు న్నాయని అన్నారు. ఈ పవిత్రమైన రోజున మనమందరం సమైక్య జీవనం, శాంతి మార్గం ఎంచుకుని ముందుకు నడవాలని ఆకాంక్షి ంచారు.

## ఎన్నికలు కాగానే ధరలు పెంచడం మోడీకి అలవాటే

### మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే1:** ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 80 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మేడే కానుకగా హోటల్ కార్మికులకు ఇచ్చిన బహుమతి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడమేనని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. శుక్రవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. సిగాచీ పరిశ్రమలో కార్మికులు ప్రమాదంలో చనిపోతే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీర శూరకర్ణలా మాట్లాడారని, ఎన్నికలు అయ్యాక కుంభకర్ణుడిలా మారిపోయాడని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు జేమ్స్ బాండ్‌లా బాండు పేపర్లు ఎందుకు రాసిచ్చారని ప్రశ్నించారు.హామీల గురించి అడిగితేబూతులు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఎలా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎంను చూడలేదని అన్నారు.

## వారం - వర్జ్యం

02-05-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
పాడ్యమి రా.12.51
విశాఖ పూర్తి
వర్జ్యం : ఉ.10.47-మ.12.33
దు.తె.5.42-ఉ.7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** విదేశాలలోని మీ వారి నుండి ఆర్థిక సహాయాన్ని అందుకోగలుగుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం :** ఆధ్యాత్మిక విషయాలకు, ప్రయాణములకు ఇది అనుకూల సమయము. కనుమరుగైన వస్తువులు దొరుకుతాయి.

**మిథునం:** మీరు తెలుసుకున్న సమాచారములో పొరపాటు జరిగి, అవతలవారిని అపార్థం చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

**కర్కాటకం:** తొందరపడవద్దు. ఎంతో కాలముగా వాయిదా వడుతున్న విషయములు పరిష్కారమవుతాయి.

**సింహం:** దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా కాలం గడుపుతారు.వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** సంతాన విద్యా విషయములలో ప్రోత్సాహాన్ని చూపుతారు. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**తుల :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** పైరవీలు, రాజకీయాలు, సినీ రంగంలో సరికొత్త అవకాశాలు మీకు మేలు చేకూరుస్తాయి. స్థిర చరాస్తులు కొనుగోలు.

**ధనుస్సు:** చిన్న చిన్న సినిమాలు తీయాలను కునే ఔత్సాహికులకు సరికొత్త అవకాశాలు ముందుకు వస్తాయి.వస్తులాభం.

**మకరం:** సంతానం విద్యాపరంగా మంచి పురోభివృద్ధిని సాధిస్తారు. పలుకుబడి నామమాత్రంగా పెరుగుతుంది.

**కుంభం:** ఋణాలు చేయవలసి రావచ్చు. కొత్త వ్యాపార ప్రయత్నాలు వాయిదా వేయండి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త.

**మీనం :** స్థిరమైన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేరు. కుటుంబ సలహాలు మీ ప్రశాంతతకు భంగం కలిగించే సూచనలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పేపర్‌లెస్ న్యాయవ్యవస్థగా సిక్కిం రికార్డు

**సాంకేతికత, న్యాయ విద్యపై జాతీయ సదస్సులో సుప్రీం సిజె వెల్లడి**

**న్యాయ విద్య పాఠ్యప్రణాళికలను అభివృద్ధి చేయాలి**

**న్యాయ అకాడమీలకు సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పిలుపు**



సాంకేతికత న్యాయ విద్యపై సదస్సులో పాల్గొన్న సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

**గ్యాంగ్‌టక్, మే 1:** దేశంలోనే మొట్టమొదటి కాగిత రహిత (పేపర్‌లెస్) న్యాయవ్యవస్థగా సిక్కిం చరిత్ర సృష్టించింది. పూర్తిగా కాగితరహిత న్యాయవ్యవస్థ అంటే, భౌతిక కాగితాల ద్వారా కాకుండా, డిజిటల్ ఫైల్స్, ఈఫైలింగ్, ఆన్‌లైన్ విచారణలు, డిజిటల్ కేసు ట్రాకింగ్ వంటి పద్ధతులను ఉపయోగించి అన్ని న్యాయ ప్రక్రియలను ఎలక్ట్రానిక్‌గా నిర్వహించే ఒక వ్యవస్థ. శుక్రవారం గ్యాంగ్‌టక్‌లో నిర్వహించిన 'సాంకేతికత మరియు న్యాయ విద్యపై సదస్సు' ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, సిక్కింను దేశంలోనే మొట్టమొదటి కాగితరహిత రాష్ట్ర న్యాయవ్యవస్థగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ. ముహమ్మద్ ముస్తాఖ్ కూడా హాజరయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని న్యాయ విద్య పరిణామం చెంది, మెరుగుపడాలని పేర్కొన్నారు. ఇది ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యతను దాటి, అల్గారిథమిక్ వ్యవస్థలను, సహజ న్యాయం వంటి సూత్రాలతో వాటి పరస్పర చర్యను అర్థం చేసుకునేలా న్యాయమూర్తులను సన్నద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 'సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం అనేది కేవలం అమలు పరచడం గురించే కాదు, న్యాయ విద్యలో అవసరమైన మార్పుకు కూడా సంబంధించినది. గతకాలపు శాసనాలపై మంచి పట్టు ఉంటే సరిపోదు. ఆధునిక న్యాయమూర్తి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల వెనుక ఉన్న తర్కాన్ని కూడా అర్థం చేసుకోవాల్సి' అని సిజెఐ సూచించారు. ప్రాథమిక డిజిటల్ పరిచయానికి మించి, అల్గారిథమిక్ వ్యవస్థలను విమర్శనాత్మకంగా పరిశీలించేలా న్యాయమూర్తులను శక్తివంతం చేసే పాఠ్యప్రణాళికలను అభివృద్ధి చేయాలని ఆయన న్యాయ అకాడమీలకు పిలుపునిచ్చారు. తీర్పు ప్రక్రియ సమగ్రతను కాపాడటానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోని పక్షపాతాన్ని గుర్తించగల సామర్థ్యం న్యాయమూర్తులకు ఉండాలని కూడా ఆయన సూచించారు. 'న్యాయానికి సాంకేతికత ఒక సహాయకంగా మాత్రమే ఉండేలా చూడటానికి, అంతేగానీ నిర్ణయాలు తీసుకోవడంలో మానవ ప్రమేయాన్ని భర్తీ చేయకుండా ఉండేందుకు, విద్యారంగంలో ఈ మార్పు అత్యవసరం' అని సిజెఐ పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటూనే, సాంకేతిక సాధనాలను ఉపయోగించగలిగే న్యాయమూర్తులను తయారు చేయడమే దీని లక్ష్యమని ఆయన అన్నారు. సిక్కింను కాగితరహిత న్యాయ వ్యవస్థగా ప్రకటించడం అనేది, ముఖ్యంగా భౌగోళికంగా కష్టతరమైన ప్రాంతాలలో న్యాయం పొందే అవకాశాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో, భౌతిక కోర్టు ప్రక్రియల నుండి డిజిటల్ వ్యవస్థకు మారడాన్ని ప్రతిబింబిస్తుందని కూడా సిజెఐ నొక్కి చెప్పారు. గతంలో, సిక్కింలోని భౌగోళిక పరిస్థితుల కారణంగా వ్యాజ్యదారులు కోర్టులకు వెళ్లడానికి సుదీర్ఘమైన, అనిశ్చితమైన ప్రయాణాన్ని ఎదుర్కొనేవారని, అయితే ఇప్పుడు డిజిటల్ మౌలిక సదుపాయాలు భౌతిక కదలిక లేకుండానే పిటిషన్లు, విచారణలు నిర్వహించడానికి వీలు కల్పిస్తూ ఈ వాస్తవాన్ని మారుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. చట్టబద్ధమైన పాలనను నిలబెట్టడానికి డిజిటల్ సంస్కరణలు అత్యవసరం అని సిజెఐ అభిప్రాయపడ్డారు. ఈసేవా కేంద్రాలను విస్తరించి, బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం హైకోర్టులలో 48, జిల్లా కోర్టులలో 2,283 ఈసేవా కేంద్రాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ అంతరం న్యాయానికి అడ్డంకిగా మారకుండా నిరోధించడానికి వాటి సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడం అవసరమని ఆయన ఉద్ఘాటించారు. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వినియోగంపై మాట్లాడుతూ, విచారణ న్యాయస్థానాల స్థాయిలో దానిని 'జాగ్రత్తగా ప్రవేశపెట్టడానికి' అవకాశం ఉందని సిజెఐ అన్నారు. రికవరీ కేసులను ఆయన ఉదాహరణగా ఇచ్చారు. ఈ కేసులలో, ప్రారంభ దశలో ఆస్తులను ధ్రువీకరించడానికి, వాటిపై ఉన్న భారాలను గుర్తించడానికి ఏఐ సాధనాలను ఉపయోగించవచ్చని ఆయన తెలిపారు. ఇటువంటి వ్యవస్థలు ఆస్తి ఉనికిని నిర్ధారించగలవని, పరస్పర విరుద్ధమైన వాదనలను గుర్తించగలవని, తద్వారా అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించి, న్యాయస్థానాలు ప్రధాన వివాదాలపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తాయని సిజెఐ అన్నారు.

## జడ్చర్లలో అమానుషం

**చెత్త కుప్పలో శిశువు-పీక్కుతిన్న శునకాలు**

**జడ్చర్ల, మే 1, ప్రభాతవార్త :** అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకుప్పలో పడవేయడంతో ఆడ శిశువు పాదాలను కుక్కలు పీక్కు తిన్న హృదయ విదారక ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ గుట్ట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన ఆడ శిశువును చెత్తకుప్పలో పడవేసి వెళ్లడంతో కాలనీకి చెందిన కొందరు చిన్నారులు క్రికెట్ ఆడుతూ అక్కడికి వెళ్లి చూడగా శిశువు కనిపించడంతో కాలనీవాసులకు సమాచారం అందించారు. దీంతో కాలనీవాసులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు కాగా అప్పటికే శిశువు మృతి చెందినట్లు గుర్తించారు.

### షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో

## ఉపాధి అవకాశాలు

**రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ**

**పూగంభీరావుపేట, ప్రభాతవార్త:** షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో మజీద్ అవసరాలు తీర్చడమే కాకుండా స్థిరమైన ఆదాయం ఏర్పడి స్థానికులకు ఉపాధి అవకాశాలు కలుగనున్నట్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ అన్నారు. శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని జామా మస్జిద్ ఆవరణలో రూ. 90 లక్షలతో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మస్జిద్ అనేది కేవలం ప్రార్థన స్థలం మాత్రమే కాకుండా, సామాజిక మరియు మతపరమైన కార్యక్రమాల కేంద్రంగా కూడా ఉంటుందని అన్నారు. మస్జిద్ అవసరాలను తీర్చడానికి స్థిరమైన ఆదాయం చాలా అవసరమని, అందుకే కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా మస్జిద్ సంబంధించిన ఖర్చులు, నిర్వహణ మరియు ఇతర సేవా కార్యక్రమాలకు ఉపయోగపడి నిరంతర ఆదాయం లభిస్తుందని వివరించారు. కాంప్లెక్స్ నిర్మాణానికి గాను వక్ఫ్ బోర్డు నుండి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధుల మంజూరు కి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనారిటీ వ్యవహారాల మంత్రి అజారుద్దీన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారం లేకుండా ఇలాంటి అభివృద్ధి పనులు సాధ్యం కావని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, వక్ఫ్ ఆస్తులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా మత సంస్థలను బలోపేతం చేయడంతో పాటు సమాజ ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయని వెల్లడించారు. ఆరు నెలల లోపు నిర్మాణపు పనులు పూర్తికానునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ నాయకులు మహ్మద్ మహబూబ్ అలీ, సయ్యద్ గాజీద్దీన్ జుబేర్, మహ్మద్ యాహ్యా అస్లం, హమీదుద్దీన్ ఖాలిద్, సయ్యద్ నజ్మొద్దీన్, మహ్మద్ వకీల్ మోలవి (కామారెడ్డి), సయ్యద్ అసఫ్ అలీ సాదాత్, సయ్యద్ హాషిమీ యాసిన్ హుస్సేన్, మహ్మద్ షోయబ్, మహ్మద్ తాహిర్, మహ్మద్ రహీముద్దీన్, మహ్మద్ అజ్మొద్దీన్, మహ్మద్ ఆమిర్, మహ్మద్ అర్మాన్, మహ్మద్ తురాబ్ (స్ట్రక్చర్ ఇంజనీర్) తదితరులు పాల్గొన్నారు

## పశ్చిమబెంగాల్ 15 కేంద్రాల్లో నేడు రీపోలింగ్

**కోల్‌కత్తా, మే 1:** పశ్చిమబెంగాల్‌లోజరిగిన పోలింగ్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహిస్తోంది. శనివారం జరిగే ఈ



పోలింగ్ దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఉన్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ పోలింగ్‌జరుగుతుంది. మొత్తం 15 బూత్‌లలో 11 మగ్రహత్ పశ్చిమ్, నాలుగు డైమండ్ హార్బర్ నియోజకవర్గాల్లో ఉన్నాయి. రెండోవిడతజరిగిన 142 నియోజకవర్గాల పోలింగ్ సందర్భంగానే ఈ ఘర్షణలు చోటుచేసుకోవడంతో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల పరిశీలకులు ఇచ్చిన నివేదికల ఆధారంగా రీపోలింగ్ జరుగుతోంది. ఎన్నికలసంఘం ప్రత్యేక పరిశీలకుడుగా సుబ్రతా గుప్తాను నియమించింది. పోలింగ్ సందర్భంగా డైమండ్ హార్బర్ లోక్‌సభనియోజకవర్గపరిధిలో జరిగిన ఉద్రిక్తతలపై నివేదిక ఇవ్వాలని కోరింది.

## ముంబయిలో రూ.1745కోట్ల డ్రగ్స్ స్వాధీనం

**ముంబయి, మే 1:** ముంబైలోలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పై ఈ విషయాన్ని వెల్లడించారు.



మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించు కున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబైలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసు కున్నట్లు ఆయన వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి దాని నుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికిగాను ఎన్సీబీ బృందాన్ని ఆయన అభినందించారు. కాగా అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

## డిజిపి నియామకంపై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పూర్తి స్థాయి డిజిపి నియామకంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. యుపిఎస్‌సి సూచనల మేరకు సి.వి ఆనంద్‌ను రెగ్యులర్ డిజిపిగా నియమించినట్లు ఈ సందర్భంగా రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హైకోర్టుకు తెలిపా రు. దీంతో పాటు ఆనంద్‌ను డిజిపిగా నియమించినందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల కాపీని ఆయన అందజేశారు. ఈ జి ఓను పరిగణలోకి తీసుకోవాలని అడ్వకేట్ జనరల్ హైకోర్టును కోరారు. జిఓను పరిశీలించిన హైకోర్టు దీనిపై సానుకూలంగా స్పందించింది. గత డిజిపి శివధర్ రెడ్డి నియామకం చట్టవిరుద్ధమని ధన గోపాల్‌రావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై తరువాత విచారిస్తామని హైకోర్టు పేర్కొ ంది. శివధర్ రెడ్డి నియామకం చట్టబద్ధమా...? కాదా...? అనేది ఆయన తరపు న్యాయవాది వాదనలు విన్న తరువాత నిర్ణయం తీసుకుంటా మని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది.

## కొత్త పోస్టుల్లో చేరిన సీనియర్ ఐపిఎస్‌లు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన బదిలీలలో కొత్త పోస్టింగులు పొందిన పలువురు సీనియర్ ఐపిఎస్ అధికారులు శుక్రవారం నాడు తమ తమ విభాగాల్లో బాధ్యతలు చేబట్టారు. ఇందులో మొదటగా హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజిగా వున్న శిఖా గోయల్ సచివాలయంలో బాధ్యతలు చేబట్టారు. హోం శాఖతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజిగా కూడా ఆమె వుంటారు. ఫ్యూ చర్ సిటీ కమిషనర్‌గా డాక్టర్ తరుణ్ జోషి రంగారెడ్డి జిల్లా కొంగరకాలన్‌లో గల కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు చేబట్టారు. మల్కాజి గిరి పోలీసు కమిషనర్‌గా సుమతి మేడిపల్లిలో గల కమిషపనరేట్‌లో బాధ్యతలు చేబట్టారు. హైదరాబాద్‌తో పాటు శివార్లలోని కమిషనరేట్లలో కమిషనర్‌గా నియమితులైన మొదటి మహిళా అధికారి సుమతి కావడం గమనార్హం. డ్రగ్స్ కంట్రోల్ బోర్డు డైరక్టర్‌గా అవినాష్ మొహంతి ఎస్‌ఆర్‌నగర్‌లో గల ఆ విభాగం కార్యాలయంలో బాధ్యతలు చేబట్టారు. దీంతో పాటు ఆయన ఎసిబి డైరక్టర్‌గా అదనపు బాధ్యతలు చూస్తారు.

## కీలక ఖనిజాల మిషన్‌కు రూ.1,500 కోట్లు

**రీసైక్లింగ్ పథకానికి 58 కంపెనీలకు అర్హత**

**స్వచ్ఛ ఇంధన, అధునాతన తయారీ రంగాలకు మద్దతు**



**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** భారతదేశపు కీలక ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం దిశగా ఒక ప్రధాన ముందడుగు పడింది. కీలక ఖనిజాల రీసైక్లింగ్ ప్రోత్సాహక పథకం కింద కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అర్హత మదింపును పూర్తి చేసింది. గనుల మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి వెల్లడించిన వివరాలు ప్రకారం ఈ పథకంలో పాల్గొనడానికి 58 కంపెనీలు అర్హమైనవిగా ఆమోదించబడ్డాయి.

జాతీయ కీలక ఖనిజాల మిషన్ కింద మొత్తం రూ.1,500 కోట్ల వ్య యంతో కూడిన ఈ పథకానికి సంబంధించి మార్గ దర్శకాల జారీతో పాటు, గత ఏడాది అక్టోబర్ 2న వివరణాత్మక కార్యాచరణపై నోటిఫై చేసింది. లిథి యం అయాన్ బ్యాటరీలు, ఇ వ్యర్థాలు, పారి శ్రామిక స్క్రాప్ నుండి కీలక ఖని జాల దేశీయ రీసైక్లింగ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ఈ పథకం లక్ష్యం. తద్వారా దిగు మతులపై ఆధారపడటాన్ని తగ్గించడం మరియు స్వచ్ఛ ఇంధన, అధునాతన తయారీ రంగాలకు మద్దతు ఇవ్వడం. గత నెల వరకూ తెరిచి ఉన్న దర ఖాస్తుల స్వీకరణకు పరిశ్రమ భాగస్వాముల నుండి బలమైన స్పందన లభించింది. ఈ పథకం మార్గ దర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ, జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ ద్వారా ప్రతిపాదనలు పరిశీలన చేయబడ్డాయి. దీని ఆధారంగా, కార్యనిర్వాహక కమిటీ 58 సంస్థలను భాగస్వామ్యానికి అర్హమైనవిగా ఆమోదించింది.

వీటిలో 20 సంస్థలకు ఈ ఏడాది మార్చి 30న అనుమతిని సాధించాయి. మరో 38 సంస్థలు గత నెల 29వ తేదీన జరిగిన సమావేశంలో ఆమోదం పొందాయి. ఏడాదికి దాదాపు 850 మిలియన్ టన్నులు వాగ్దానం చేసిన సామర్థ్యంతో పాటు, సుమారు రూ.5 వేల కోట్ల వాగ్దానం చేసిన పెట్టుబడితో నిర్వహిం చబడతాయి.

ఎంపికైన కంపెనీలు ఇప్పటికే బ్యాటరీ రీసైక్లింగ్, ఇ వ్యర్థాల ప్రాసెసింగ్, ఇతర వ్యర్థాల నుండి పునరుద్ధరణ వంటి కీలక విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ పథకంలో తదుపరి దశ ప్రాజెక్ట్ అమలుపై కేంద్రం దృష్టిసారించింది. దీనిలో భాగంగా, అర్హతగల సంస్థల సామర్థ్య అభివృద్ధి, ఉత్పత్తి ప్రారంభాన్ని ఈ పథకం కింద ఆర్థిక సహాయం కోసం పరిగణనలోకి తీసుకుంటారని కేంద్ర ఖనిజాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## ఆంగ్‌శాన్ సుకీ గృహనిర్బంధానికి తరలింపు

**నైపైయిథా, మే 1:** మైన్మార్ మాజీ నేత ఆంగ్‌సాన్ సుకీ జైలు నుంచి ఇపుడు గృహ నిర్బంధంలోకి వచ్చారు. బౌద్ధుల శెలవు దినం సందర్భంగా ఖైదీలకు ఇచ్చే క్షమా బిక్షసందర్భంగా ఆమె జైలు శిక్షను గృహనిర్బంధానికి మార్చారు. సాంప్రదాయంగా ఉన్న తెల్లటి జాకెట్.. స్కర్టుతో ఉన్న సూక్యీ ఒక చెక్క బెంచిపై కూర్చుని ఉన్నట్లు కనిపించారు. ఇద్దరు గుర్తుతెలీని వ్యక్తులు ఆమెకు ఎదురుగా కూర్చుని ఉన్నారు. 2021లో సూక్యీని అదుపులోకి తీసుకున్న ఆర్మీ ఆమె ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని స్వాధీనం



చేసుకున్నారు. అప్పటినుంచి ఆమె బయట కనిపించిన దాఖలాలులేవు. ఆమె చివరిసారి ప్రజలకు కనిపించింది 2021 మే 24 తేదీ మాత్రమే. బుద్ధజయంతి సందర్భంగా ఇచ్చే సెలవు కావడంతో ఖైదీలకు ఇచ్చే క్షమాబిక్షలోభాగంగానే ఆంగ్‌సాంగ్ సుకీకి కూడా జైలుశిక్షను కుదించి గృహనిర్బంధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 1519 మంది ఖైదీలకు క్షమాబిక్ష ప్రసాదించిన మిన్ ఆంగ్ హ్లైయింగ్ సర్కారు వారి జైలుశిక్షలను గణనీయంగా తగ్గించింది. సూక్యీకి వాస్తవానికి 33 ఏళ్ల జైలుశిక్ష విధించారు. తాజాగా ప్రకటించిన క్షమాబిక్షతో ఆమె జైలుశిక్ష 18 ఏళ్లు తగ్గింది. 13ఏళ్లకుపైగా ఆమె శిక్షను అనుభవించాల్సి ఉందని అంచనా.

## ఎప్ సెట్‌కు 3 లక్షల దరఖాస్తులు

**నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు**

**4, 5 తేదీల్లో అగ్రికల్చర్, 9 నుంచి ఇంజనీరింగ్ పరీక్షలు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 1 :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎ) సెట్-2026కి సంబంధించి అపరాధ రుసుం రూ.10వేలతో దరఖాస్తు చేసుకోవడానికి శనివారం చివరి రోజు. ఇప్పటి వరకు 3,01,203 దరఖాస్తులు వచ్చాయి. అపరాధ రుసుం రూ.10వేలతో నేడు చివరి రోజు కావడంతో కొందరు దరఖాస్తు చేసే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హాల్ టికెట్లను జారీ చేశారు. ఏప్రిల్ 23 నుంచి అగ్రికల్చర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్స్‌ను జారీ చేయగా.. ఏప్రిల్ 27 నుంచి ఇంజనీరింగ్ హాల్ టికెట్లను జారీ చేశారు. ఇప్పటి వరకు అందిన 3,01,203 దరఖాస్తుల్లో ఇంజనీరింగ్‌కి 2,10,318 దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 90,569 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి కలిపి 317 దరఖాస్తులు వచ్చాయి. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదిల్లో నిర్వహించనుండగా.. వారికి సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 23న జారీ చేశారు. అగ్రికల్చర్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మే 9 నుంచి 11 వరకు జరిగే ఇంజనీరింగ్ పరీక్షల కోసం 115 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎప్ సెట్-2026కి సంబంధించి పరీక్షా కేంద్రాలను ఇప్పటికే నిర్ణయించిన నేపథ్యంలో వాటిల్లో పరీక్షల నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సారి నుంచి విద్యార్థులు పరీక్ష రాసిన వెంటనే వారికి ప్రాథమిక కీ ప్రకారం ఎన్ని మార్కులు సాధిస్తారనేది వెంటనే తెలిసిపోతుంది. అయితే ఫైనల్ కీతోపాటు నార్మలైజేషన్‌ను బట్టి వారికి ఫైనల్ ఎప్ సెట్ ర్యాంకులను కేటాయిస్తారు.

## శుద్ధవాగులో మునిగి ఇద్దరు బాలురు మృతి

**నర్సాపూర్(జి), 1 మే, ప్రభాతవార్త:** నర్సాపూర్(జి) మండల కేంద్రంలో శుక్రవారం తీవ్ర విషాదం నెలకొంది. శుద్ధ వాగులో ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు నీటిలో మునిగి మృతి చెందారు. స్థానిక సమాచారం ప్రకారం.. నర్సాపూర్ మండలానికి చెందిన రిజ్వాన్, అశు అనే ఇద్దరు బాలురు మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టడానికి సమీపంలోని శుద్ధ వాగు వద్దకు వెళ్లారు. అయితే, నీటి లోతును అంచనా వేయలేక వారు వాగులో మునిగిపోయారు. పిల్లలు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వాగు వద్ద గాలించగా, అప్పటికే వారు మృతి చెంది కనిపించారు. ఒకేసారి ఇద్దరు చిన్నారులు మరణించడంతో నర్సాపూర్ మండల కేంద్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తమ పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సిరిసిల్లలో తీవ్ర విషాదం

**సిరిసిల్ల అర్బన్, ప్రభాతవార్త :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో తీరని విషాదం నెలకొంది. శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓ ఆర్ ఆర్ ) ఎగ్జిట్16 వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. గత రెండేళ్లుగా హైదరాబాద్‌లోని సనత్ నగర్‌లో నివాసముంటున్న ఈ కుటుంబం, యాదగిరిగుట్ట మరియు స్వర్ణగిరి క్షేత్రాలను దర్శించుకుని తిరిగి వస్తుండగా మృత్యువు కబళించింది. ఈ వార్త తెలియగానే సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ సొంత గడ్డకు చెందిన వారు ఇలా ప్రమాదానికి గురికావడంతో బంధువులు, మిత్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒకే కుటుంబంలో ఆరుగురు సభ్యులు మరణించడంతో ఆ ప్రాంతమంతా శోకసంద్రమైంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగమే ఈ ఘోర ప్రమాదానికి ప్రాథమిక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ విషాద ఘటనపై సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను శంషాబాద్ ఏసీపీకి ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన మహిళకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.

## టెట్‌కి లక్ష 36వేల దరఖాస్తులు

**ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 28,149**

**ట్రాన్స్ జండర్ల నుంచి 5**

**3 వరకు ఎడిట్ సౌకర్యం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 1 :** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)-2026 దరఖాస్తు గడువు ముగిసింది. దరఖాస్తు గడువు ముగిసేనాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1,36,418 దరఖాస్తులు వచ్చినట్టు టెట్ కన్వీనర్ జి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. దరఖాస్తుల్లో 5 దరఖాస్తులు ట్రాన్స్ జెండర్ల నుంచి వచ్చినట్టు తెలిపారు. ట్రాన్స్ జెండర్లు ఇన్‌సర్వీస్ నుంచి వారని తెలిపారు. 1,36,418 దరఖాస్తుల్లో పేపర్-1కి 32,779 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 86,305 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. రెండు పేపర్లకు 17,334 దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. 28,149 ఇన్ సర్వీస్ టీచర్లలో పేపర్-1కి 7,678 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 20,471 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-2లో మ్యాథ్స్ అండ్ సైన్స్‌కి 11,343 దరఖాస్తులు రాగా, పేపర్-2 సోషల్ స్టడీస్‌కి9,128 దరఖాస్తులు వచ్చాయి. టెట్-2026 మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోవడానికి ఈ నెల 3 వరకు ఎడిట్ సౌకర్యం కల్పించినట్టు కన్వీనర్ తెలిపారు.

## గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలి

**సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 1 :** రెండు నెలల్లోనే వాణిజ్య గ్యాస్ ధరను రు.1303 పెంచారని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడానదరు. కేంద్రం పెంచిన వాణిజ్య గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. వాణిజ్య గ్యాస్ ధరలను అమాంతం పెంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, చమురు సంస్థలు తీసుకున్న నిర్ణయం సామాన్య ప్రజలపై యుద్ధం ప్రకటించడమేనన్నారు. కేవలం రెండు నెలల్లోనే సిలిండర్ ధరను రూ.1,303 పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. దేశంలో ఇంధన నిల్వలకు ఎలాంటి కొరత లేదని, అంతా బాగుందని ప్రజలను నమ్మబలుకుతూనే, మరోవైపు దొంగచాటుగా భారీ ఎత్తున భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. కమర్షియల్ సిలిండర్ ధరను 2026 మార్చిలో రూ.115, ఏప్రిల్‌లో రూ.195 పెంచిన కేంద్రం, ఇప్పుడు ఒక్కసారిగా రూ.993లు పెంచిందన్నారు. గత రెండు నెలల్లోనే రూ.1,303 భారాన్ని ప్రజలపై మోపడం అత్యంత దారుణమన్నారు. తాజా పెంపుతో హైదరాబాద్‌లో ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ ధర రూ.3,315కు చేరడం ఆందోళన కలిగిస్తుందన్నారు.

### వాణిజ్య సిలిండర్ ధర

## 3 నెలల్లోనే 81% పెంచారు

**రాహుల్‌గాంధీ నిశిత విమర్శ**

**న్యూఢిల్లీ, మే 1:** వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కేవలం మూడు నెలల్లోనే వాణిజ్య సిలిండర్ ధరను 81 శాతం పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఒక్కరోజులోనే రూ.993 పెంచారని, ఇది కచ్చితంగా



ఎన్నికల బిల్లు అని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయని తాను ముందే హెచ్చరించానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకు నిదర్శనమే నేడు వాణిజ్య సిలిండర్ ధర పెంపు అని తెలిపారు. రూ.993 పెరగడమంటే, ఇది ఒకరోజులో నమోదైన అతిపెద్ద పెరుగుదల అని ఆయన అన్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు ధర రూ.1,380 పెరిగిందని ఆరోపించారు. అంటే గత మూడు నెలల కాలంలో 81 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల ఈ ప్రభావం చిన్న చిన్న వ్యాపారులపై తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీ దుకాణాలు, చాయ్‌టిఫిన్ డబ్బాలు, హోటళ్లు, బేకరీలు, మిఠాయి దుకాణాలు తదితర వాటిపై ప్రభావం పడుతుందని అన్నారు. తద్వారా ఇది సామాన్యులకు కూడా భారంగా మారుతుందని అన్నారు.

## కార్మిక దినం రోజే దారుణం

**నోష్ రసాయన ల్యాబ్స్‌లో**

## పేలిన రియాక్టర్

**ఒకరు మృతి... ఐదుగురికి గాయాలు**

**చిట్యాల రూరల్, మే 01, ప్రభాతవార్త :** నల్గొండ జిల్లా చిట్యాల మండలం బొంగోనిచెర్వు గ్రామ పరిధిలోని నోష్ రసాయన ల్యాబ్స్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నోష్ రసాయన ల్యాబ్స్‌లోని బ్లాక్-3లో ప్రమాదవశాత్తు రియాక్టర్ అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలడంతో అక్కడే పనిచేస్తున్న ఒక కార్మికుడు మృతి చెందగా.. ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన వివరాలిలా వున్నాయి... నల్గొండ జిల్లా చిట్యాల మండలం బొంగోనిచెర్వు గ్రామ పరిధిలోని నోష్ రసాయన ల్యాబ్ రసాయన పరిశ్రమలో శుక్రవారం మధ్యాహ్నం ప్రొడక్షన్ బ్లాక్ 3లో ఉత్పత్తికి సంబంధించిన పదార్థాన్ని నింపుతుండగా రియాక్టర్ ఒత్తిడికి గురై ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. దీంతో పరిశ్రమ నుండి దట్టమైన పొగ వ్యాపించడంతో కార్మికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. కాసేపటికి తేరుకొని నీళ్లు, ఫోమ్ చల్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు అగ్నిమాపక శకటాలతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

ప్రమాదం జరిగిన సమయంలో బ్లాక్ 3లో ఆరుగురు కార్మికులు పనిచేస్తున్నారు. కాగా వీరిలో చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన బొడ్డు బాలకృష్ణ (32) గత పదేళ్లుగా టెక్నీషియన్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఒక్కసారిగా రియాక్టర్ పేలడంతో బాలకృష్ణ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, మరో ముగ్గురి పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని డీఆర్డీఎల్ అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదే పరిశ్రమలో ఏప్రిల్ 9వ తేదీన 2వ బ్లాక్‌లో సంభవించి ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడిన విషయం మరువకముందే మరో ప్రమాదం చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. వరుస ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ యాజమాన్యం తగిన భద్రతా చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. పనికి వెళ్తే తిరిగి వస్తామో లేదో భయం వేస్తోంది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్త

అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.

న- ఆస్కార్‌వైల్డ్

# మాటలతో ధరలు తగ్గవు!

'పదాల కన్న గొప్పది వాక్‌శక్తి, వాక్ శక్తి కన్న గొప్పది మనస్సు, మనస్సు కన్న గొప్పది సంకల్పం. మన పాలకుల్లో ఈ సంకల్పలోపం కారణంగానే ప్రజలకు ఇక్కట్ల మీద ఇక్కట్లు వచ్చి పడుతున్నాయేమోననిపిస్తున్నది. ఇతర సమస్యల మాటలెలా ఉన్నా రోజురోజుకు పెరిగిపోతూ ప్రజాజీవితాలను నరకప్రాయంగా మారుస్తున్నది. తాజాగా వాణిజ్య సిలిండర్ ధర రూ.993 పెరిగి మూడువేల మూడువందల పదిహేను రూపాయలకు చేరుకుంది. దీని ప్రభావం ఇతర వస్తువులపైన ముఖ్యంగా హోటళ్లల్లో అమ్మే తినుబండారాలపై తీవ్రంగా ఉంటుంది.మరొకపక్క పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశాలున్నట్లు చెప్తున్నారు. కేంద్రం ప్రస్తుతానికి లేదని చెప్తున్నా పరిస్థితులు అలా కన్పించడం లేదు.ఇక నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చే ఆలోచన కానీ, ప్రయత్నం కానీ త్రికరణ శుద్ధిగా జరగడం లేదు. ధరల నియంత్రణకు, సమీక్షలకు సమావేశాలకు కొరత లేదు. కమిటీల మీద కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, అవసరం అయితే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామంటూ ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ, అటు కేంద్ర ప్రభుత్వం కానీ హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. కానీ ఇవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో దళారులు లేరు. ప్రస్తుత పాలకులే కాదు,ఏపార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసేవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదిరించడం ఒక రివాజుగా మారిపోయింది. అయితే ఈ విషయంలో గతంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు.రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటీర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా గడగడలాడిన సందర్భాలు లేకపోలేదు. కానీ అవి రాను రాను తగ్గిపోతున్నాయి. అధికారులను వారి వారి విధులను స్వేచ్ఛగా చేయనీయడం లేదేమోననిపిస్తున్నది. అన్నింటిలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం తమ సిఫారసులకు, రాజకీయ ఒత్తిడిలకు లొంగని సమర్థులైన అధికారులను బదలీ వేటుతోనో, ఇతర కుంటిసాకులతో శంకరగిరి మాన్యాలు పట్టించడం ఏనాటి నుంచో ఆరంభమైనా ఇటీవల పెరిగిపోతున్నది. అందుకే అప్పటి భయభక్తులు ఇప్పుడు లేవు. అధికారుల్లో కూడా అంకితభావం తగ్గిందనే చెప్పొచ్చు. బిల్లు, బెల్లు అనే తీరులోనే వ్యవహరించేవారు ఎక్కువైపోయారు. దీనికితోడు రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు మరికొందరు అక్రమ వ్యాపారస్తులతో మమేకం అవుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలానే రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత ఉందని చెప్పక తప్పదు. కొందరు బడావ్యాపారులు, మరికొందరు రాజకీయ నాయకులతో అవినాభావ సంబంధాలు ఏర్పర్చుకుంటున్నారు. చివరకు ఈ భారమంతా ప్రజలు భరించక తప్పడం లేదు.దీంతో ఎన్ని కేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు జారీ చేసినా తమను ఎవరూ ఏమీ చేయలేరనే దీమా అక్రమ వ్యాపారుల్లో అంతకంతకు పెరిగిపోతున్నది. ధరలు పెరగడానికి ముఖ్య కారణాల్లో ఇదొకటి.ద్రవ్యోల్బణంతోపాటుమార్కెట్ మాయాజాలం కూడా ఉందనేది నిర్వివాదం. పప్పుదినుసుల సాగు వివిధ కారణాలతో తగ్గిపోతున్న మాట వాస్తవం. ప్రకృతి సహకరించకపోవడం,అకాల వర్షాలతోపాటు చీడపీడలతో ఈసాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ పరిస్థితులను ముందుగానే ఊహించి దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు, దళారులుపావులు కదపడం సహజమే. ఈ విష యంలో పాలకులకు నిర్దిష్టమైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం దురదృష్టకరం. రైతుల దగ్గర సరుకులున్నప్పుడు ధరలు పాతాళాలోకానికి పడిపోతున్నాయి. వారి దగ్గర నుండి వ్యాపారుల గోదాముల్లోకి చేరిన తర్వాత ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం ఉల్లిగడ్డల ధరలు చూసినా కిలో పది రూపాయలలోపే రైతుల వద్ద కొంటున్నారు. సాగు ఖర్చుల మాట దేవుడెరుగు. కనీసం రవాణా ఖర్చులు కూడా వస్తాయా లేదా అన్నట్లుగాఉంది పరిస్థితి.మొన్న పూల రైతులు చిత్తూరు జిల్లాల్లో రోడ్లపై పోసిపోయారు. రైతుల పరిస్థితి ఇలా ఉంటే వినియోగ దారుడికి మాత్రం ఏనిత్యావసర వస్తువులధరలు చూసినా మండిపోతున్నాయి.ఉత్పత్తులన్నీ ఎక్కడ ఏమోవుతున్నాయి? ఎక్కడెక్కడ గోదా ముల్లో ఉన్నాయి? అవి ఎవరివి? నిబంధనలు అతిక్ర మించి దాచిన అక్రమ నిల్వలు ఎన్ని? తదితర వివరాలు అధికారులకు తెలియకుండాపోయాయి. అవకాశాలు ఏమాత్రం లేవు. వాటిని బయటపెట్టి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురాగలిగితే కొంతమేరకైనా ధరలు తగ్గే అవకాశాలుంటాయి.ఇక రైతులు నేరుగా తమ ఉత్పత్తులను వినియోగదారులకు అమ్ముకునేందుకు ప్రత్యేకంగా రైతు బజార్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. కానీ అది కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి.దళారులే పట్టాదారు పాసుపుస్తకాలు సంపాదించి రైతుల అవతారమెత్తి ఈ రైతు బజార్లలో ఏకకాలంలో అన్నిరకాల కూరగాయలు పండించినట్లు రైతు బజార్లలో పెట్టి అమ్ముకుంటున్నారు.ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి.సమీక్షలు,సమావేశాలతో కాలం గడపకుండాఅక్రమ నిల్వలను బయటకు తేవాలి.నల్లబజారులో అమ్మేవారిపై ఉక్కుపాదం మోపి ధరలను అదుపులోకి తేవాలి. ఇందు లో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదు.



మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం ఈ నాలుగు వెనక్కి రావు.

ప్లినీ



సలహా ఇచ్చేటప్పుడు విచక్షణ పాటించాలి. స్వీకరించేటప్పుడు వినమ్రంగా ఉండాలి.

స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### ప్రాణాలు తీస్తున్న పేలుళ్లు

భారతదేశంలోని బాణసంచా తయారీ కేంద్రాలలో తరచుగా జరుగుతున్న పేలుళ్లు సామాన్యుల ప్రాణాలను గాలిలోదీపంగా మారుస్తున్నాయి.గతఐదు సంవత్సరాలలో సుమారు 180 ప్రమాదాలు సంభవించగా, 480 మందికిపైగా ప్రాణాలుకోల్పోవడం అత్యంత విచారకరం. ముఖ్యంగా తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఇటువంటి మరణకాండలకు కేంద్రబిందువుగా మారింది. భద్రతా ప్రమాణాలను విస్మరించడం, నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో కూడా పనులు కొనసాగించడం యాజమాన్యాల లాభాపేక్షకు నిదర్శనం. పరిమితికి మించి కార్మికులనుగుమిగూడించడం,నిషేధిత రసాయనాల వినియోగం, ముడి సరుకుల అక్రమ నిల్వలు ఈ విపత్తులకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.అనుమతి పొందిన సంస్థలు కూడా భద్రతా చర్యలను గాలికి వదిలేయడం వల్లఅమాయక కార్మికులు బలిఅవుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఎగ్జిట్ పోల్స్‌పై నమ్మకం పోతోంది

గతంలో పోలింగ్ పూర్తయిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలయ్యేవి. అవి దాదాపు వాస్తవానికి దగ్గరగా ఖచ్చితంగాఉండేవి.కానీ, నేడుఎగ్జిట్ పోల్స్ నిర్వహించేవారు.ఆయారాజకీయపార్టీలకు అనుకూలంగా సర్వే చేస్తున్నారు.దాంతో అసలు ఫలితాలను ప్రజలకు అందించలేకపోతున్నారు. గతంలో వేర్వేరు సంస్థలు నిర్వహించిన ఫలితాలు వేర్వేరుగా ఉండేవి.ఇప్పుడు అన్నిసంస్థల సర్వేలు ఒకేలా ఉండటంతో,ఎగ్జిట్ పోల్స్ పై ప్రజలలో నమ్మకంపోయింది. అందుకే ఈ ఎగ్జిట్ పోల్స్ వివాదాస్పదం అవుతున్నాయి.ఎగ్జిట్ పోల్స్ పైనిర్వహించే సంస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి.అంతేకాని రాజకీయ పార్టీలకుకాదనిగ్రహించాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకుసంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్,కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడా కొంత ఉపశమనం ఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్యాశాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చు ప్రాధాన్యత ఉంటుంది. వాటి స్థితిని బట్టి వ్యవధి అవసరం.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

### ఏడు రోజులు ఏడు సబ్జెక్టులు

విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు చాలా కీలకమైనవి. సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ మొదటి సర్టిఫికేట్. కొంత కాలం పూర్వం సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ అని ఉండేది. ఆ సర్టిఫికెట్ ఆధారంగానే విద్యార్థిని విద్యార్థుల పుట్టిన తేదీ ధ్రువపరచడం జరుగుతూ ఉన్నది.ఇంటర్మీడియట్ బోర్డు ఒక దోపిడీ వ్యవస్థగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇంటర్మీడియట్ బోర్డును రద్దుచేసి ప్రస్తుతం ఉన్న హై స్కూల్స్, హై స్కూల్ ప్లస్‌గా మార్చాలి. అదేవిధంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు జనరల్ సైన్స్ ను విడదీసి విడివిడిగా భౌతిక శాస్త్రం జీవశాస్త్రం సబ్జెక్టులుగా పెట్టి ఏడు సబ్జెక్టులు పదవ తరగతి వరకు బోధించి బోర్డ్ ఎగ్జామ్స్ పెట్టాలి. ఒక ఎగ్జామినేషన్‌కు ఇంకొక ఎగ్జామినేషన్ మధ్య మధ్యలో సెలవులు ఇవ్వకుండా పరీక్షలను వరుసగా ఆదివారం కూడా మినహాయింపు లేకుండా ఏడు రోజులు ఏడు సబ్జెక్టులు పెట్టాలి.

- వీరగంట రూపవతి, బొబ్బిలి

### ఆవేదన

విదేశాలకు వెళ్లిన పిల్లలు తమ భవిష్యత్తు కోసం కష్టపడుతుంటారు, కానీ ఇక్కడ వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులు ఒంటరితనంతో జీవిస్తున్నారు. డబ్బులు పంపించడం బాధ్యతలో ఒకభాగమే గానీ, అదిప్రేమను, తోడును భర్తీ చేయదు. ఫోన్‌కాల్స్ మాత్రమేకాదు,వీడియో కాల్స్‌లో చూసినంత మాత్రాన కూడా ఆ ప్రేమను అనుభవించలేరు. పిల్లల నవ్వుల్లో జీవించిన తల్లిదండ్రులు, ఇప్పుడు స్క్రీన్‌లో కనిపించే ముఖాలకే పరిమితమవ్వడం బాధాకరం. పెంచితే ఇలానా?" అన్న ప్రశ్నవారి మనసులో నిశ్శబ్దంగా మార్మోగుతుంది.వాళ్లు ఆశించేది డబ్బు కాదు, తమ పిల్లల సమీపం, స్నేహం, మమత. వృద్ధాప్యంలో ఒక దగ్గరగా ఉండటం, ఒక ఆప్యాయమైన మాట. ఇవే వారికి నిజమైన ఆనందం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది.కానీ ప్రస్తుతం ఈలోపం కారణంగా అనేకమంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.

- పి. రాజశేఖర్, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అటవీ సంస్కృతిని అణచలేమా?

**ఈ రాక్షస క్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. అక్కడక్కడ కేసులు నమోదు చేసినా కొద్దిపాటి శిక్షలతో బయటపడుతున్నారు. ప్రాణ సమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింత పశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా, నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి ఒక తిరుగులేని హెచ్చరికను అందించగలుగుతాం. దేశం నుంచి ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతారు. చట్టాన్ని అమలు చేసే చిత్త శుద్ధిలేనప్పుడు, త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, శిక్షలు, హెచ్చరికలు అన్నీ నిష్ప్రయోజనమే.**

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎందరు నేతలు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. ఈ ర్యాగింగ్‌కు ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. వీటిలో కొన్ని మాత్రమే వెలుగు చూస్తున్నాయి. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక, వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ ఆటవిక సంస్కృతి కొనసాగుతూనే ఉంది. చాలా సందర్భాల్లో ఈ దురదృష్టకర సంఘటనలు వెలుగు చూడడం లేదు. అయితే వైద్య కళాశాలల్లో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు జాతీయ వైద్య మండలి (ఎన్ఎమ్‌సి) ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పోర్టల్ బాధిత విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతున్నది. ఇందుకు తాజాగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో(కెఎమ్‌సి) జరిగిన ర్యాగింగ్‌ను ఉదహరించవచ్చు. కేవలం యాప్ ద్వారానే ఈ ర్యాగింగ్ వెలుగు చూసింది. సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. అయితే ఆ ఘర్షణకు సంబంధించి రెండువర్గాలు రాజీ కుదుర్చుకున్నాయి. కానీ ఆ పక్క రోజు జూనియర్స్ తమ వాట్సాప్ గ్రూపులో సీనియర్లపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ఈ విషయం సీనియర్లకు తెలియడంతో వసతి గృహంలోని భవనంపైకి జూనియర్లను పిలిపించి వాట్సాప్ పోస్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమేకాక మోకాళ్లపై కూర్చోబెట్టి తప్పయిందని, మరొకసారి ఇలా చేయమని క్షమాపణలు చెప్పించుకున్నారు. ఈ దృశ్యాలను కూడా జూనియర్లు సెల్‌ఫోన్‌లో రహస్యంగా రికార్డు చేశారు. దాన్ని జాతీయ వైద్య మండలి ఫిర్యాదుల పోర్టల్‌కు పంపించారు. దీంతో ఎన్ఎమ్‌సి అధికారులు వెంటనే రంగంలోకి దిగి డిఎంఇకి లేఖరాశారు. దీంతో డిఎమ్ఇ సంబంధిత ప్రిన్సిపల్‌కు సమాచారం ఇచ్చి విచారణకు ఆదేశించారు. అప్పటివరకు కెఎమ్‌సి అధికారులకు ర్యాగింగ్ విషయం తెలియలేదంటే ఏమనుకోవాలి?. దీంతో ఆఘమేఘాలపై రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి ర్యాగింగ్ జరిగిందని నిర్ధారించారు. ఏడుగురు సీనియర్లను ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ ప్రిన్సిపల్ ఆదేశాలు ఇచ్చారు. అలాగే కోర్సు పూర్తయ్యేవరకు వసతి గృహంలో ఉండడానికి వీల్లేదని నిర్ధేశించారు. ఇక హైదరాబాద్‌లోనిఉస్మానియా వైద్యకళాశాలలో పిజి ప్రథమ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థి ఆత్మహత్యకు సీనియర్ల ర్యాగింగే కారణమంటూ కుటుంబ సభ్యులు గత నెల పదిహేనో తేదీన ఉస్మానియ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాడని, కళాశాలలో కొందరు ర్యాగింగ్ చేస్తున్నారని ఇటీవల తమకు ఫోన్‌లో చెప్పినట్లు వారంటున్నారు. అయితే అక్కడికి వచ్చి మాట్లాడుతామని చెబితే ఫిర్యాదులు చేస్తే వేధింపులు మరింత ఎక్కువ అవుతాయని, రావొద్దని చెప్పినట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. పిజిలో తను అనుకున్న విభాగంలో సీటు రాకపోవడం వల్ల ఒత్తిడితో బాధపడుతూ ఒక మానసిక వైద్యుడి సూచనతో మాత్రలు కూడా వాడుతున్నాడని,గదిలో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు,మత్తు ఇంజక్షన్ తీసుకొని ప్రాణాలు తీసుకున్నాడనేది మరొక వాదన. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతయేడాది గుజరాత్‌లోని పాఠక్ జిల్లాలోని వైద్యకళాశాలలో సీనియర్లు ఒక

## ఒక్క మాట

జూనియర్ విద్యార్థిని మూడుగంటలపాటు నిలబెట్టి పైశాచిక ఆనందం పొందారు. దాంతో ఆ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఆతర్వాత అటునుండి అటే పరలోకానికిపయనం కట్టాడు. తెలంగాణలో ఖమ్మం జిల్లాలో కొత్తగా చేరిన ఒక విద్యార్థి హెయిర్‌స్టయిల్ బాగాలేదంటూ సీనియర్లు ర్యాగింగ్ చేశారు. ఈ విషయం ఆ కాలేజీ ర్యాగింగ్ నిరోధక కమిటీ ఇన్‌ఛార్జ్ దృష్టికి పోవడంతో జూనియర్‌పై ఆగ్రహం చేసిన సీనియర్లు తమ మీదనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఆ విద్యార్థికి గుండుకొట్టించారు. ఇలా దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్ కాలేజీల్లోనే కాదు ఇప్పుడు డిగ్రీకాలేజీలు, చివరకు ఇంటర్మీడియేట్ స్థాయికి కూడా ఈర్యాగింగ్ భూతం విస్తరిస్తున్నది. దీనిని నిరోధించేందుకు చట్టాలు చేస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యుజిసి) కఠిన మార్గదర్శకాలను రూపొందించింది. అయినా ఫలితం లేకుండాపోతున్నది. యేడాది యేడాదికి పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు.కాలేజీల్లో జూనియర్లకు రక్షణ కవచంగా ఉండాల్సిన కొందరు అధ్యాపకులు ర్యాగింగ్ చేసేవారికి కాపలాదారు లుగా మారిపోవడం దురదృష్టకరం. 'నేను చదువుతున్న కాలేజీలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనొచ్చు. కానీ వారే నీచంగా ప్రవర్తిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలి? నాలాగే ఇక్కడ చాలామంది అమ్మాయిలు బాధపడుతున్నారు,మాలో ఎవరో ఒకరు చనిపోతేనే ఈ విషయం బయటి ప్రపంచానికి తెలుస్తుంది. అందుకే నేను ఈ పనిచేస్తున్నా' అంటూ గత యేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఒక విద్యార్థిని ప్రాణం తీసుకుంది. ఇలాంటి సంఘటనలు బయటపడినప్పుడు ప్రభుత్వాలు, భద్రతా వ్యవస్థలు, ర్యాగింగ్ నిరోధక కమిటీలు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ర్యాగింగ్ నిరోధక నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ యుజిసి కళాశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తూనేఉంది. అయినా ఎలాంటి మార్పులు రావడం లేదు.కొందరు విద్యార్థులు ఈ ర్యాగింగ్ పేరుతో సాగిస్తున్న కార్య క్రమాలు వినడానికి జుగుప్సా కరంగా ఉంటున్నాయి. ఈ వికృత చేష్టలను వీడియో టేప్‌చేసి దాంతోజూనియర్లను బ్లాక్‌మేయిల్ చేసి మళ్లీ మళ్లీ ఉపయోగించుకునే తలంపు సభ్యసమాజాన్ని తలవంచుకునేలా చేస్తున్నది. కొన్నిసార్లు పోలీసులు రంగప్రవేశం చేసి, నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేసిన తర్వాత కూడా యాజమాన్యాలు స్పందించడం లేదు.అసలు ర్యాగింగ్ అనేది ముందుగా కేవలం ఇంజినీరింగ్, మెడికల్‌లాంటి ప్రొఫెషనల్ కాలేజీల్లో 19వశతాబ్దం ఆరంభంలో మొదలైందని చెప్తారు. ఇది రానురాను కాలేజీలన్నింటికి విస్తరించింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఇంటర్మీడియేట్ విద్యను పూర్తిచేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ కాలేజీలోనికి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరకు,భయం పోగొట్టి నలుగురు కలిసిమెలిసి ఉండేలా చేసేందుకు చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైంది. కానీ రాను రాను శృతిమించడంతో కొందరు విద్యార్థులకు ప్రాణాంతక, వికృత కేళిగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విష వలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా చేస్తున్న ఈ ర్యాగింగ్‌ను లేత మనసులు తట్టుకోలేకపోతున్నాయి. దీనికి అశ్లీల సాహిత్యం, నీలిచిత్రాలు, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు తోడు కావడంతో పరాకాష్టకు చేరిందని చెప్పొచ్చు. ఇప్పటికే దేశంలో ఎంతోమంది మెరికల్లాంటి విద్యార్థులు దీనికి బలైపోయారు.అకారణంగా మెరికల్లాంటి పిల్లలను కోల్పోయిన ఆ కుటుంబాల గర్భశోకాన్ని ఏమిచ్చి తీర్చగలరు?ఈ రాక్షస క్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారు. అక్కడక్కడ కేసులు నమోదు చేసినా కొద్దిపాటి శిక్షలతో బయటపడుతున్నారు. ప్రాణసమానంగాపెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింతపశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? పెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా, నిర్దిష్టమైన చర్యలు తీసుకోగలిగితే ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి ఒక తిరుగులేని హెచ్చరికను అందించగలుగుతాం. దేశం నుంచి ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలగలుగుతారు. చట్టాన్ని అమలు చేసేందుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, హెచ్చరికలు అన్నీ నిష్ప్రయోజనమే.

# యుద్ధాలతో ప్రపంచం అతలాకుతలం

కనుమ ఎల్లారెడ్డి

నేడు విశ్వం యుద్ధాలతో చాలా భయానక వాతావరణం తలపిస్తోంది. రష్యా, ఉక్రెన్ యుద్ధం ఒక ప్రక్క సాగుతుండగా, మరోప్రక్క ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులతో భయకంపితుల్ని చేస్తోంది. ఇరాన్‌లో అంతా మరుభూమిని తలపిస్తోంది.అమెరికాకుతోడుగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తోడుగా నిలిచాయి. ఇరాన్ ప్రక్క హెజ్‌బొల్లా, ఇరాకీ మిలిషియా అండగా నిలిచాయి. ఇవి లెబనాన్‌లోని తీవ్రవాద సంస్థలు.ఇందులో హెజ్‌బొల్లా భయంకరమైన సంస్థ. ఆకస్మాతుగా ఇజ్రాయెల్ పై దాడి చేసింది. ఈ దాడులను ఇజ్రాయెల్ తిప్పి కొటిడితే భారీ నష్టమే జరిగిపోయింది. ఇలా దాడులు, ప్రతి దాడులతో విశ్వం అతలాకుతలమవుతోంది. ఆయా దేశాలలోని పౌరులు ఏ క్షణనా ఏమి జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పుడు రష్యా, ఉక్రెన్ యుద్ధం కంటే ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల గురించే ఎక్కువగా చర్చించుకుంటున్నారు. అటు ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. ఈ పరస్పర దాడులతో మధ్యలో కువైట్, సౌది, ఖతర్ తీవ్రంగా నష్టపోతున్నాయి. ఫలితంగానే సౌదిలోని ఆరామ్ కొ చమురు కేంద్రంపై ఇరాన్ దాడి చేసి తీవ్ర నష్టం కలిగించింది. ఇలా పరస్పర దాడులతో ఏం సాధిస్తాయో అర్థం కావడం లేదు. అసలు తప్పంతా అమెరికా, ఇజ్రాయెల్ దాడులతోనే వచ్చింది. ముందు నుంచి ఇరాన్‌ను మెత్తగా మచ్చిక చేసుకుని అణుస్థావరాలు వాటిలోని నిల్వలను ధ్వసం చేసివుంటే ఏ తగాదా ఉండేది కాదు. దీనికితోడు ఇరాన్ భద్రతా మండలి సెక్రటరీ అలీ లరీ జని మేము చర్చలకోసం ప్రయత్నం చేయడం లేదు అనడం గమనార్హం. ఒక విధంగా చుస్తే ఖమేని లక్ష్యంగా ఇది కొనసాగింది. ఇజ్రాయెల్ అత్యంత సాంకేతికతతో 'మోసద్' అనే క్షిపణితో ఇరాన్ అధినేతను మట్టు పెట్టింది. రంగంలోకి హెజ్బుల్లా రాకపోయి ఉంటే బాగుండేది. ఎందుకంటే ఏడాదిక్రితమే ఇజ్రాయెల్, హెజ్బుల్లా మధ్య కాల్పుల ఒప్పందం జరిగింది. ఇదే విషయం లెబనాన్ చెప్పినా కూడా హెజ్బుల్లా వెనక్కి తగ్గలేదు. కాని ఖమేని మృతితో ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇప్పుడు యుద్ధం భీకర రూపం దాల్చుతోంది. ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్, అమెరికాకు కూడా నష్టం వాటిల్లుతోంది. అయితే ఇవి ఆ దేశాలు లెక్క చేయవు. మొత్తం ఇరాన్ పూర్తిగా మరు భూమిగా మారాలని అమెరికా, ఇరాన్ పై అత్యాధునిక ఆయుధాలు వినియోగిస్తోంది. ఇది ఇలా ఉండగా ఇజ్రాయెల్ ప్రకటన మా దాడిలో ఇరాన్ పగ్గాలు చేపట్టిన ఆయా తుల్లా ఆలీ రెజా కూడా మరణించారన్న వార్త హాల్‌చల్ చేసింది. అయితే ఇరాన్ దీన్ని ధ్రువీకరించలేదు. ఇలా దేశ నాయకులను చంపుకుంటూపోతే ప్రగతి ఏ దేశమైన ఏమి సాధించలేదు. ఇలా మధ్య ప్రాచ్యం అట్టుడికిపోతోంది. ఈ యుద్ధాలతోనే వేగలేకపోతుంటే పాక్,ఆఫ్ఘనిస్థాన్ యుద్ధం మరో కోణంలో జరుగుతోంది. పాక్‌లోని బెలూచిస్థాన్ కూడా పాక్ పై గుర్రుగా ఉంది. ఇప్పుడు దేశాల మధ్య శాంతి కావాలి, అంతర్జాతీయ చట్టాలను అన్ని దేశాలు పాటించాలి. శాంతి సంస్థ ఐక్యరాజ్య సమితి మధ్యవర్తిత్వంతో దేశాలు యుద్ధం ముగించి శాంతి పరిమళాలు కురిపించాలి. ఇది ఏ స్థాయికి పోతుందో చెప్పలేం. యుద్ధం ఆపడమా, చర్చలు చేపట్టడ మా అనేది నాయకులే తేల్చుకోవాలి. చర్చలకు సిద్ధం అని ఇరాన్ చెబుతున్నప్పుడు అమెరికా అంగీకరించాలి. చర్చలుతోనే పశ్చిమ ఆసియాలో శాంతి నెలకొంటుంది అనే అభిప్రాయం వ్యక్తమావుతోంది. లేకపోతే అమాయక, ఏమి తెలియని పౌరులు మరణిస్తారు. ఇది ఎంత మాత్రం సహింపరానిది. విశ్వం యుద్ధాల మయం అయితే అభివృద్ధి కుంటు పడుతుంది. ఇప్పటికైనా నాయకులు కళ్లు తెరవాలి. హింసతో ఏదీ సాధ్యం కాదు. కనుక చర్యల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలి.

# ప్రైవేటు ప్రయాణం నుంచి ప్రభుత్వ సారథ్యం వైపు..

రామ కిష్టయ్య సంగన భట్ల

హైదరాబాద్ మహానగర చరిత్రలో మెట్రో రైలు కేవలం ఒక రవాణా సౌకర్యం మాత్రమే కాదు, అది ఒక సామాజిక, ఆర్థిక విప్లవం. భాగ్యనగర జీవన రేఖగామారిన ఈ ప్రాజెక్టు,ఇప్పుడు ఒక కీలకమైన పరివర్తన దశలోఉంది. దశాబ్ద కాలంపాటు ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచిన ఈ ప్రయాణం, ఇప్పుడు ప్రభుత్వ సారథ్యం వైపు మళ్లుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఎల్అండ్‌టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్‌లో ఈక్విటీ వాటాను కొనుగోలు చేయాలని భావించడం వెనుక కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే లేదు, దాని వెనుక నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న ఒక వ్యూహాత్మక దార్శనికత ఉంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు బీజాలు 2008లోనే పడ్డాయి. అప్పట్లో ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) మెట్రో ప్రాజెక్టుగా ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మొదట మేటాస్ సంస్థకు అప్పగించినా, ఆ తర్వాత తలెత్తిన సంక్షోభాలవల్ల 2010లో ఎల్అండ్‌టి సంస్థ ఈ బృహత్తర బాధ్యతను స్వీకరించింది. సుమారు 22 వేల కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మితమైన ఈ వ్యవస్థ, మూడు ప్రధాన కారిడార్ల ద్వారా 69 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 2017 నవంబర్ 28న అప్పటి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా మియాపూర్ నుండి నాగోల్ వరకు ప్రారంభమైన ఈ ప్రయాణం, అనతి కాలంలోనే నగర వాసుల దైనందిన జీవితంలో అంతర్భాగమైంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం, నిత్యం ఐదు లక్షల నుండి ఆరు లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు. ఐటీ హబ్‌లకు ప్రయాణించే ఉద్యోగులు,వాణిజ్య ప్రాంతాలకు వెళ్లే వ్యాపారులు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరికీ మెట్రో ఒక సురక్షితమైన, వేగవంతమైన మార్గంగా నిలిచింది. అయితే, ఈ వెలుగుల వెనుక ఆర్థికపరమైన సవాళ్లు కూడా ఉన్నాయి. మెట్రో ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చుకోలేకపోయింది. ముఖ్యంగా కోవిడ్19 మహమ్మారి విధించిన లాక్‌డౌన్ సమయం ఈ సంస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రయాణికుల సంఖ్య తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం, బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించాల్సి రావడం వంటి కారణాలతో ఎల్ అండ్ టి సంస్థ ఆర్థిక ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈక్విటీని కొనుగోలు చేయడం వల్ల మెట్రో కేవలం ఒక వ్యాపార వస్తువుగా కాకుండా, ప్రజా సేవా దృక్పథంతో నడిచే అవకాశం ఉంటుంది. దీనివల్ల చార్జీల నియంత్రణ, భద్రత, విస్తరణ నిర్ణయాల్లో ప్రభుత్వానికి పూర్తిస్వేచ్ఛ లభి స్తుంది. మరోవైపు, హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న కొద్దీ పాత మెట్రో మార్గాలు సరిపోవడం లేదు.నగరంలోని నలు మూలలను అనుసంధానం చేయడానికి 'మెట్రో ఫేజ్2' విస్త రణ అనివార్యమైంది. ప్రభుత్వం సుమారు 76 కిలోమీటర్ల మేర కొత్త మార్గాలను ప్రతిపాదించింది. ఇందులో అత్యంత కీలకమైనది రాయదుర్గం నుండి శంషాబాద్ విమానాశ్రయం



వరకు సాగే 31కిలోమీటర్ల ఎయిర్‌పోర్టు కారిడార్.సుమారు 6,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ మార్గంవల్ల అంతర్జాతీయ ప్రయాణికులకు ట్రాఫిక్ చిక్కులు తప్పుతా యి. అలాగే నాగోల్ నుండి ఎల్బీనగర్ వరకు అనుసంధా నం చేయడం,మియాపూర్ నుండి పటాన్‌చెరు వరకు పొడిగించడం వంటి ప్రణాళికలు నగర పరిధిని మరింతగా పెంచుతాయి. వీటన్నిటికంటే ముఖ్యంగా, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న పాతబస్తీ మెట్రో అంశం ఇప్పుడు ఒకకొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.ఎంజీబీఎస్ నుండి చాంద్రాయణ గుట్ట వరకు పాతబస్తీ గుండా మెట్రోను నిర్మించడం సామాజికంగా, రాజకీయంగా సవాలుతో కూడుకున్నది.భూసేకరణ సమస్యలు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, ఇరుకైన రహదారులు అడ్డంకులుగా నిలిచినప్పటికీ, పాతనగర ప్రజలకు కూడా ఆధునిక రవాణాఫలాలను అందించాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. ఇది నగరంలోని రెండు విభాగాల మధ్య ఉన్న రవాణా అంతరాన్ని తొలగించి, సమగ్ర నగర అభివృద్ధికి బాటలు వేస్తుంది. మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం వల్ల లభించే మరోగొప్ప ప్రయోజనం 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్'.అంటే మెట్రో రైలును టీజీఎస్ఆర్‌టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు త్వరలో రానున్న రీజినల్ రింగ్ రోడ్‌తో అనుసంధానించడం. దీనివల్ల ప్రయాణికులు ఒకే టికెట్ లేదా కార్డ్ ద్వారా వివిధ రకాల రవాణా మార్గాల్లో ప్రయాణించవచ్చు. ఇది నగరంలో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి, కాలుష్య నివారణకు తోడ్పడుతుంది. అలాగే 'ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్' పద్ధతిలో మెట్రో స్టేషన్ల చుట్టూ వాణిజ్య సముదాయాలను నిర్మించడం ద్వారా ప్రభుత్వం అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. కానీ ఈ ప్రస్థానంలో ఆర్థిక సవాళ్లు ప్రధానమైనవి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాలు,ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. ఈ క్రమంలో మెట్రో ఈక్విటీని కొనుగోలు చేయడం,కొత్త ఫేజ్ నిర్మాణానికి వేలకోట్ల రూపాయలను సమీకరించడం ప్రభుత్వానికి ఒక కత్తిమీద సాము వంటిదే. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన వాటా, రుణాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుండి సహాయం పొందే విషయంలో రాజకీయ చతురత అవసరం. ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్ళినప్పుడు ప్రైవేటు రంగంలోని చురుకుదనం, నాణ్యత తగ్గకుండా చూసుకోవడం కూడా ఒక పెద్ద బాధ్యత. బ్యూరోక్రసీ వల్ల నిర్ణయాల్లో జాప్యం జరగకుండా ఒక స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థ ను ఏర్పాటు చేయడం ద్వారా మాత్రమే ఈ లక్ష్యాలను సాధించవచ్చు. హైదరాబాద్‌ను కేవలం ఒక ప్రాంతీయ నగరంగా కాకుండా,గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచనలో మెట్రో విస్తరణ ఒక ముఖ్యమైన పిల్లర్. ఐటీ,ఫార్మా రంగాలు ఇప్పటికే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఈరంగాల్లో పెట్టుబడులు పెరగాలంటే మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి. ఒక సమర్థవంతమై న మెట్రోవ్యవస్థ కార్బన్ ఫుట్‌ప్రింట్‌ను తగ్గించి, నగరాన్ని పర్యావరణహితంగా మారుస్తుంది. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థే ఆ నగర ఆర్థిక శక్తిని నిర్ణయిస్తుంది. హైదరాబాద్ మెట్రో పరిణామ క్రమం ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ నుండి ప్రభుత్వ భాగస్వామ్యం వైపు సాగుతున్న ఈప్రయాణం కేవలం యాజమాన్యమార్పు మాత్రమే కాదు,అది నగరప్రణాళికలో ఒక నూతన విప్లవం.

# కోల్‌కతాలో తగ్గని ఉద్రిక్తత

- స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత లేదంటూ రోడ్డెక్కిన టీఎంసీ
- ఐవీఎంలు ట్యాంపరింగ్ చేస్తే సహించబోమన్న సీఎం మమత
- కోల్‌కతాలోని ఇండోర్ స్టేడియం వద్ద భారీ ధర్నా



**కోల్‌కతా, మే 1:** ఓటింగ్ ప్రక్రియ ముగిసి మే 4న ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో కొత్త వివాదం ఏర్పడింది. ఎన్నికల సంఘంపై అధికార టీఎంసీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కయ్యాయని పేర్కొంది. కొందరు వ్యక్తులు ఏ పార్టీ నేతలు అక్కడ లేకుండా స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపర్చిన ఈవీఎంలను తెరుస్తున్న వీడియో ఫుటేజ్‌ను టీఎంసీ ఎక్స్‌లో విడుదల చేస్తూ బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కుతో భారీ ఎన్నికల మోసం జరిగిందని ఆరోపించింది. పేర్ల తొలగింపు, ఓటర్లను బెదిరించడం నుంచి ఈవీఎంలను తారుమారు చేయడం వరకు ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నాలు పెచ్చుమీరాయని, ఇది ఒక నిస్సహాయక చర్య అని టీఎంసీ విమర్శించింది. టీఎంసీ ఆరోపణతో పార్టీ వర్గాలు ఎన్నికల సంఘం చర్యపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. టీఎంసీ నేతలు శశిపంజా, కునాల్ ఘోష్‌లు బ్యాలెట్‌బాక్స్‌లు భద్రపర్చిన కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియం బయట ధర్నా ప్రారంభించారు. బెనర్జీ భవానీపూర్, దక్షిణ కోల్‌కతాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల బ్యాలెట్ బాక్స్‌లు భద్రపర్చిన షెకావత్ మెమోరియల్ గర్ల్స్ హైస్కూల్‌కు చేరుకున్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలకు తెగించి పోరాడతామని ఆమె స్పష్టం చేశారు. ఈవీఎంల భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె స్వయంగా కోల్‌కతాలోని ఓ స్ట్రాంగ్‌రూమ్ వద్ద మూడు గంటలకుపైగా ఉన్నారు. దక్షిణ కోల్‌కతాలోని సాఖావత్ మెమోరియల్ స్కూల్‌లో భవానీపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్‌రూమ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, బ్యాలెట్ బాక్సులను తెరుస్తున్నారని టీఎంసీ ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియోలు టీవీలో చూసిన తర్వాత మమతా బెనర్జీ గురువారం రాత్రి నేరుగా అక్కడికి చేరుకున్నారు. భవానీపూర్ అభ్యర్థిగా తనకున్న హక్కుతో స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎం యంత్రాన్ని దొంగిలించడానికి లేదా కౌంటింగ్‌ను తారుమారు చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే మేం ప్రాణాలకు తెగించి పోరాడతామని హెచ్చరించారు. తనను మొదట సెంట్రల్ ఫోర్సెస్ సిబ్బంది అడ్డుకున్నారని, కానీ ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థిగా తనకు ఉన్న హక్కును వినియోగించుకుని లోపలికి వెళ్లానని తెలిపారు. తాజా ఆరోపణలతో పశ్చిమ బెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రూల్స్‌కు వ్యతిరేకంగా ఏం చేసినా సహించేది లేదన్నారు. కౌంటింగ్ జరిగే మే 4వ తేదీ వరకు పార్టీ వర్గాలు నిరంతరం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద గస్తీ నిర్వహించాలని పార్టీ వర్గాలకు మమతా బెనర్జీ పిలుపు చేశారు. ఈ ఎన్నికల్లో విజయం పట్ల మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 సీట్లలో విజయంసాధిస్తామని ఆమె ప్రకటించారు. ఈ క్రమంలో నాయకులు, పార్టీ వర్గాలు బ్యాలెట్ బాక్స్‌లు ఉంచిన ప్రాంతంపై నిఘా ఉంచి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.కౌంటింగ్‌కు ముందే స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చిన బ్యాలెట్ బాక్స్‌లను బీజేపీ తెరుస్తున్నదంటూ టీఎంసీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం గురువారం ఖండించింది. స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపర్చిన ఈవీఎంలన్నీ సురక్షితంగా, భద్రంగా ఉన్నాయని స్పష్టం చేసింది. టీఎంసీ వీడియోలో చూపించిన పోస్టల్ బ్యాలెట్ల కోసం ఉద్దేశించిన మరో స్ట్రాంగ్ రూమని వివరణ ఇచ్చింది. స్ట్రాంగ్‌రూమ్‌లో కూర్చున్న మమతా బెనర్జీ వీడియోపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో దీదీ ఉన్నంత వరకు తమ ఎలక్షన్ ఏజెంట్ అడ్వకేట్ సుర్జానీల్ దాస్ ఉంటారన్నారు. ఎటువంటి తప్పుడు విధానాలను ఆమె అవలంబించబోదన్న ఆశిస్తున్నట్లు తెలిపారు.

# భారత్‌గడ్డపై పాకిస్థాన్ మరోసారి ఉగ్రదాడికి కుట్ర

## నిఘా వర్గాలు హెచ్చరిక


ఆసిమ్ మునీర్

**ఇస్లామాబాద్, మే 1:** భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్తాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకాశ్మీర్‌ను లక్ష్యంగాచేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్‌ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసీమ్ మునీర్, తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్లీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు. ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీని వల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్‌ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికిపాల్పడటం ఆ వ్యూహంలో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్‌చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసినా ఫర్వాలేదన్న తెగింపుతో మునీర్ ఉన్నారని, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే ముఖ్యమని మునీర్ సన్నిహితుల చెబుతున్నారు.


రోదిస్తున్న బంధువులు

# ఒడిలో నాలుగేళ్ల కుమారుడితో తల్లి మృతి

### జబల్‌పూర్‌పడవప్రమాదంలో కన్నీరు పెట్టిస్తున్న దృశ్యం

### 9కి పెరిగిన మృతులు


**జబల్‌పూర్, మే 1:** మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లోజరిగిన పడవ ప్రమాదంలో హృదయ విదారక దృశ్యం ఆవిష్కృతమైంది. గురువారం జరిగిన ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 9కి చేరగా, శుక్రవారం సహాయక బృందాలు వెలికితీసిన ఒక తల్లి, ఆమె నాలుగేళ్ల కుమారుడి మృతదేహాలు అందరినీ కంటతడి పెట్టించాయి. తుదిశ్వాస విడిచే సమయంలోనూ ఆ తల్లిబిడ్డలు ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకునే ఉన్నారు. వారిద్దరికీ కలిపి ఒకే లైఫ్ జాకెట్ ఉండటాన్ని బృందాలు గుర్తించాయి. నాలుగేళ్ల తన కొడుకుని తల్లి హత్తుకుని మరణించింది. ఆ చిన్నారి తల్లిని పట్టుకుని ప్రాణాలు కోల్పోయాడు. మరణంలోనూ తల్లీకొడుకు ఒకరినొకరు విడిచిపెట్టకుండా, చివరి క్షణం వరకు హత్తుకుని ఉండిపోయారు. ఒకరినొకరు పట్టుకుని ఉండిపోయిన తల్లీకొడుకు మృతదేహాలు నీటిలో తేలడం చూసిన సహాయక బృంద సభ్యులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రతి ఒక్కరినీ ఈ దృశ్యం కదిలిస్తోంది. గుండె బరువెక్కేలా చేస్తోంది. ఈ ఇద్దరితోపాటు వీరి కుటుంబానికి చెందిన మరో ఇద్దరు ఢిల్లీ నుంచి ఇక్కడికి విహారయాత్రకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి మృతదేహాల్ని రెస్క్యూ బృందాలు ఒడ్డుకు చేర్చాయి. జబల్‌పూర్‌లోని బార్గీ డ్యామ్ రిజర్వాయర్‌లో ముందురోజు సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. సుమారు 30 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక క్రూయిజ్ బోటు ఆకస్మికంగా చెలరేగిన తుపాను కారణంగా నీటిలో బోల్తా పడింది. ఇప్పటివరకు 22 మందిని సురక్షితంగా కాపాడగా, పలువురు గల్లంతయ్యారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం, స్థానిక పోలీసులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న రాష్ట్ర మంత్రి రాకేశ్ సింగ్ తల్లి, బిడ్డ మృతదేహాలను చూసి తీవ్రంగా చలించిపోయి, కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. బలమైన గాలులు వీస్తున్నప్పుడు ఒడ్డుకు తిరిగి వెళ్దామని సిబ్బందిని కోరినా వారు వినలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అందరు ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇవ్వలేదని ప్రమాదం నుంచి బయటపడిన ఒకరు ఆరోపించారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ హామీ ఇచ్చారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పర్యాటక శాఖ మంత్రి ధర్మేంద్ర భవ్ సింగ్ లోధి స్పష్టం చేశారు.

## ఆస్తికోసం తల్లి, సోదరుడి హత్య

**తిరువనంతపురం, మే 1:** కేరళలో ఆస్తి కోసం కన్నతల్లిని, సోదరుడిని ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా హత్య చేసి, వారి మృతదేహాలను ఇంట్లోనే పూడ్చిపెట్టాడు. నెలరోజుల క్రితం ఇడుక్కి జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. పొన్నూట్టిల్ కుటుంబానికి చెందిన సజీ (45) తమ్ముడు రెజీ (40), తల్లి మేరీకుట్టి(65)తో కలిసి నివసిస్తున్నాడు. ఆ కుటుంబానికి చెందిన సుమారు ఎకరం భూమిని పంచుకోవడంపై సోదరుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో నెలరోజుల క్రితం ఓ రాత్రి రెజీ మద్యం సేవించి ఇంటికి వచ్చిన క్రమంలో అన్నదమ్ములు ఇద్దరికీ గొడవ జరిగింది. మాటా మాటా పెరగడంతో రెజీ ముఖంపై సజీ తీవ్రంగా దాడి చేశాడు. అతను స్పృహ కోల్పోయిన తర్వాత టవల్‌తో గొంతు నులిమి హత్య చేశాడు. ఈ హత్యను చూసిన తల్లి మేరీకుట్టిని కూడా ముఖంపై కొట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. రెండు రోజుల పాటు మృతదేహాలను ఇంట్లోనే దాచిపెట్టి, ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. ఈ హత్యలు చేయడంలో తనకు ఎవరూ సహాయం చేయలేదని, ఒక్కడినే ఈ ఘాతుకానికి పాల్పడ్డానని సాజీ పోలీసుల ఎదుట అంగీకరించాడు. నెలరోజుల నుంచి మేరీ కుట్టి, రెజీ కనిపించకపోవడంతో సజీని ఆరాతీశారు. సజీ వారికి పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దాంతో అనుమానించి ఇరుగుపొరుగు అనక్కరలో ఉండే వారి సోదరి సనీకి సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సజీ ఇంటికి వెళ్లాడు. పోలీసులను చూడగానే సజీ పారిపోయాడు. దాంతో అనుమానించిన పోలీసులు ఇంటి ఆవరణను పరిశీలించారు. తవ్వి పూడ్చిన ఆనవాళ్లు కనిపించడంతో తిరగతోడించగా రెజీ, మేరీకుట్టి మృతదేహాలు బయటపడ్డాయి. నిందితుడి కోసం తీవ్రంగా గాలించి గత నెల 28న అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా 2018లో సజీ తండ్రి మాథ్యూ కూడా అదృశ్యమయ్యాడు. దాంతో ఆ ఘటనతో ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు పట్టుకునన దృశ్యం

# మరణానికి ముందు ఎప్‌స్టీన్ ఆత్మహత్యలేఖ!



**వాషింగ్టన్, మే 1:** అమెరికాలో సంచలనం సృష్టించిన లైంగిక నేరగాడు, వివాదాస్పద ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ జైలులో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసినట్లుగా భావిస్తున్న ఒక సూసైడ్ నోట్‌ను గత ఏడేళ్లుగా అత్యంత రహస్యం గా ఉంచారన్న సమాచారం బయటకు పొక్కింది. ఈ నోట్‌ను బహిర్గతం చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో ఈ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఎప్‌స్టీన్ మృతిపై దర్యాప్తులో ఈ లేఖ కీలకం కానుందని నిపుణులు భావిస్తున్నారు. ఎప్‌స్టీన్ 2019 ఆగస్టులో మాన్‌హాటన్ కరెక్షనల్ సెంటర్‌లోని తన గదిలో మరణించిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు కొన్ని వారాల ముందు జులై నెలలో అతను మొదటి సారి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో అతని సెల్‌మేట్, పలు హత్య కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న మాజీ పోలీస్ అధికారి నికోలస్ టార్టాగ్లియోన్‌కు ఈ నోట్ దొరికింది. వారిద్దరి గదిలోని ఒక పుస్తకంలో, పసుపు రంగు కాగితంపై ఇక వీడ్కోలు చెప్పే సమయం వచ్చిందని రాసి ఉన్నట్లు టార్టాగ్లియోన్ గుర్తించాడు. తనపై దాడి చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని ఎప్‌స్టీన్ ఆరోపిస్తాడేమోనన్న భయంతో, టార్టాగ్లియోన్ ఆ నోట్‌ను జైలు అధికారులకు కాకుండా నేరుగా తన న్యాయవాదులకు అప్పగించాడు. వారు దాని ప్రామాణికతను నిర్ధారించుకున్నారని చెబుతున్నప్పటికీ, ఆ తర్వాత టార్టాగ్లియోన్ కేసును విచారిస్తున్న ఫెడరల్ జడ్జి ఆ నోట్‌ను సీల్‌చేసి, గోప్యంగా ఉంచాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఎప్‌స్టీన్ మృతిపై దర్యాప్తు చేస్తున్న అధికారులు గానీ, న్యాయ శాఖ గానీ ఈ నోట్‌ను పరిశీలించలేదు. ఈ నోట్‌కు టార్టాగ్లియోన్ కేసుతో సంబంధం లేదని, ఎప్‌స్టీన్ చివరి రోజుల్లోని మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, అతని మృతిపై దర్యాప్తులో ఇది కీలకమైన ఆధారమని అమెరికా మీడియావాదిస్తోంది. అందుకే దానిని బహిర్గతం చేయాలని కోర్టులో ఒక పత్రిక పిటిషన్ దాఖలు చేసింది. ప్రపంచంలోని అత్యంత శక్తిమంతులతో ఎప్‌స్టీన్ నెరిపిన లైంగిక నేరాల నెట్‌వర్క్‌కు సంబంధించిన వేలాది పత్రాలు ఇటీవల బయటకు వస్తున్న నేపథ్యంలో ఈ సూసైడ్ నోట్ ఉదంతం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఫెడరల్ సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలపై విచారణ ఖైదీగా ఉండగానే ఎప్‌స్టీన్ మరణించడం అప్పట్లో జైలు భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది.

# ట్రంప్‌పై హత్యాయత్నం విడియో విడుదల


హిల్టన్ ఫైర్ విడియో

**వాషింగ్టన్, మే 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనకు సంబంధించిన వీడియోను యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు విడుదల చేశారు. గతనెల 25న వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ కార్యక్రమంలో ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. నిందితుడు కోల్ థామస్ అలెన్ సెన్సార్ గేట్ల గుండా వేగంగా పరిగెత్తుకెళ్తూ ఒక పోలీస్ అధికారిపై కాల్పులు జరిపిన దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. ఈ ఘటనలో ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి తూటా తగలగా, అది ఎవరి కాల్పుల వల్ల జరిగిందనే దానిపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వాషింగ్టన్ యూఎస్ అటార్నీ జీనైన్ పిర్రో ఈ వీడియోను విడుదల చేశారు. అధ్యక్షుడిపై హత్యాయత్నం చేసే క్రమంలో కోల్ అలెన్ సీక్రెట్ సర్వీస్ అధికారిపై కాల్పులు జరిపినట్లు వీడియోలో స్పష్టంగా ఉంది. ఇది ఫ్రెండ్లీ ఫైర్ అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. కాలిఫోర్నియాకు చెందిన 31 ఏళ్ల కోల్ అలెన్, ఒక పార్ట్‌టైమ్ ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. విచారణ పూర్తయ్యే వరకు జైల్లోనే ఉండేందుకు అతడు అంగీకరించాడు. అతడిపై అధ్యక్షుడిపై హత్యాయత్నంతో పాటు ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేశారు. నేరం రుజువైతే జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. దాడికి ముందు తనను తాను ఫ్రెండ్లీ ఫెడరల్ అసాసిన్ అని చెప్పుకున్న అలెన్ ట్రంప్ పరిపాలనపై తనకున్న వ్యతిరేకతను పరోక్షంగా వెల్లడించాడు. ఈ ఘటనపై స్పందించిన సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ సీన్ కరన్ భద్రతా ఏర్పాట్లను సమర్థించారు. దాడిని కేవలం కొన్ని సెకన్లలోనే భద్రతా వలయం బయటి పరిధిలోనే అడ్డుకున్నామని తెలిపారు. దాడి జరిగిన ప్రదేశానికి, ట్రంప్ ఉన్న వేదికకు మధ్య 355 అడుగుల దూరం ఉందని, మధ్యలో అనేక సాయుధ అధికారులు, పటిష్ఠమైన భద్రత ఉందని ఆయన వివరించారు.


మాట్లాడుతున్న సోఫియా ఖురేషి

# మరోసారి మీడియా ముందుకు వ్యోమికా, సోఫియాలు..!

**న్యూఢిల్లీ, మే 1:** కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మరోసారి మీడియా ముందుకు వస్తున్నారనిప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గత సంవత్సరం పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో, భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించేందుకు ఈ ఇద్దరు అధికారిణులు మీడియా ముందుకు వచ్చారు. వీరిద్దరు మరోసారి మీడియా ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వీరితో పాటు నేవీ కమాండర్ ప్రేరణా దేవస్థలి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ బ్రీఫింగ్‌లో వారు ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలు, ప్రాముఖ్యత, దాని వెనుక జరిగిన ప్రణాళిక వంటి విషయాల గురించి మాట్లాడే అవకాశముంది. సోఫియా ఖురేషీ గుజరాత్‌కు చెందినవారు. బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990లలో సైన్యంలో చేరారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా పని చేశారు. 2019లో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదాను పొందారు. మే 7తో ఆపరేషన్ నిర్వహించి ఏడాది పూర్తవుతుండడంతో వీరు మీడియా ముందుకు వస్తున్నట్టు తెలుస్తోంది.

# హర్భజన్ సింగ్‌కు భద్రత కల్పించండి

### - పంజాబ్ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 1:** రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ వ్యక్తిగత భద్రతను పునః సమీక్షించాలంటూ పంజాబ్ ప్రభుత్వానికి పంజాబ్–హర్యానా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అతడికి ఎలాంటి హానీ జరగకుండా చూడాలని ఆదేశించింది. హర్భజన్‌సింగ్ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామాచేసి, బిజెపిలో చేరారు. దీంతో పంజాబ్ ప్రభుత్వం హర్భజన్ సింగ్‌కు వ్యక్తిగత భద్రతను ఉపసంహరించింది. ఈ ఉపసంహారణ అనంతరం, ఆప్ కార్యకర్తలు ఆయన నివాసం వెలుపల నిరసన చేపట్టారు. ప్రహరీ గోడలపై "గద్దర్"(ద్రోహి) అని స్ప్రే పెయింట్‌తో రాశారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ రాజ్యసభ ఎంపీ హర్భజన్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పిటిషన్‌లో, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సెక్యూరిటీ) ఎటువంటి కొత్త ముప్పు అంచనా లేదా ముందస్తు నోటీసు లేకుండా, ఏకపక్షంగా మరియు కక్షపూరితంగా తన భద్రతను ఉపసంహరించుకున్నారని హర్భజన్ సింగ్ వాదించారు.భద్రతను ఉపసంహరించుకున్న వెంటనే, ఏప్రిల్ 25 మరియు 26 తేదీలలో ఒక గుంపు తన నివాసంపై దాడి చేసిందని, అయితే స్థానిక పోలీసులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, భద్రతను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి, హర్భజన్ సింగ్‌కు ఎలాంటి శారీరక హాని జరగకుండా చూడాలని ఆప్ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వానికి పంజాబ్, హర్యానా హైకోర్టు నోటీసు జారీ చేసింది.

# బర్త్‌డేకేక్ మృతుల కేసు నిందితుడి ఎన్‌కౌంటర్

**బులంద్‌షహర్, మే 1:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో సంచలనం సృష్టించిన ట్రిపుల్ మర్డర్ కేసులో ప్రధాన నిందితుడు జీతూ సైనీ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అతడిపై రూ.50వేల రివార్డు ఉంది. కొన్ని రోజులుగా పరారీలో ఉన్న అతడిని గురువారం తెల్లవారుజామున పోలీసులు కాల్చి చంపారు. ధరౌ పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపమని కోరారు. వారు ఆగకుండా పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని ఝాజర్ రోడ్డులో చుట్టుముట్టగా, నిందితులు కాల్పులు కొనసాగించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక నిందితుడు గాయపడగా, మరొకరు చీకటిని ఆసరాగా చేసుకుని తప్పించుకున్నాడు. గాయపడిన జీతూ సైనీని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి ఒక పిస్టల్, బుల్లెట్లు, నంబర్ ప్లేట్ లేని స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 25న ఖుర్జాలో జరిగిన పుట్టినరోజు వేడుకలో అమర్‌దీప్ (30), మనీశ్(28), ఆకాశ్(18) అనే ముగ్గురు కుటుంబ సభ్యులను కాల్చి చంపిన కేసులో జీతూ సైనీ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. పుట్టినరోజు జరుపుకుంటున్న జీతూసైనీ ముఖానికి మృతులు సరదాగా కేక్ పూయడమే ఈ ఘర్షణకు కారణమైంది. ఈ చిన్న విషయంపై మాటామాటా పెరిగి, నిందితులు ఆయుధాలతో తిరిగి వచ్చి కాల్పులకు తెగబడ్డారు. పోలీసుల చర్యపై మృతుల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుల ఆస్తులను కూల్చివేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా సైనీ నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

# ఇంధన సంక్షోభంలో పాకిస్థాన్


పాకిస్థాన్‌లో పెట్రోలు కోసం బారులుతీరిన వాహనదారులు

**కరాచి, మే 1:** తీవ్ర ఇంధన సంక్షోభంతో పాకిస్థాన్ అల్లాడుతోంది. సహజ వాయువు (సీఎన్‌జీ) కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం మరో భారం పడింది. తాజాగా పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ (హెచ్ఎస్‌డీ) ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జల సంధిలో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో ఈ పెంపు తప్పలేదని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త ధరలు వారం రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది. పాకిస్థాన్ పెట్రోలియం డివిజన్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం హైస్పీడ్ డీజిల్ ధర లీటర్‌కు 19.39 పాకిస్థానీ రూపాయలు పెరిగి, 380.19 నుంచి 399.58కి చేరింది. పెట్రోల్ ధర లీటర్‌కు 6.51 పెరగడంతో, పాత ధర 393.35 నుంచి 399.86కి ఎగబాకింది. పాకిస్థాన్‌లో హైస్పీడ్ డీజిల్‌ను ప్రధానంగా రవాణా, వ్యవసాయ రంగాల్లో ఉపయోగిస్తారు. ప్రస్తుతం దేశంలో పంటల సాగు సీజన్ నడుస్తున్నందున, ఈ ధరల పెంపు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రవాణా ఖర్చులు పెరగడంతో ఇప్పటికే ఎరువుల ధరలు పెరిగాయని సర్కారు చెపుతోంది. తాజా ధరల పెంపునకు ముందే పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రజలు తీవ్ర గ్యాస్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రావిన్స్ వ్యాప్తంగా సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్లు మూతపడటంతో చాలా ప్రాంతాల్లో గృహ, వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో కోతలు విధించారు. సీఎన్‌జీ అందుబాటులో లేకపోవడంతో స్కూల్ వ్యాన్లు, బస్సుల ఆపరేటర్లు చాలావరకు తమ సర్వీసులను నిలిపివేశారు. ఇది విద్యార్థుల చదువులు, దినచర్యపై ప్రభావం చూపుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ప్రజా రవాణా వాహనాలు పెట్రోల్‌తో నడపాల్సి రావడంతో నిర్వాహకులు ఛార్జీలను విపరీతంగా పెంచారు. ఒకవైపు సీఎన్‌జీ కొరత, మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం రెట్టింపు అయింది. సీఎన్‌జీ సరఫరాను పునరుద్ధరించకపోతే సర్వీసులను పూర్తిగా నిలిపివేస్తామని రవాణా నిర్వాహకులు హెచ్చరిస్తున్నారు

# రాహుల్‌గాంధీకి ఊరట

### -ఇండియన్ స్టేట్ వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరణ

### - పిటిషన్ కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు

**న్యూఢిల్లీ, మే 1:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వివాదాస్పద "భారత రాజ్యంతో పోరాటం" వ్యాఖ్యపై ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడానికి నిరాకరిస్తూ సంభాల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు శుక్రవారం, మే 1న కొట్టివేసింది. హిందూ శక్తి దళ్‌కు చెందిన సిమ్రాన్ గుప్తా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్ డి. చౌహాన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం దీనిని తిరస్కరించింది. గత ఏడాది జనవరిలో కాంగ్రెస్ నాయకుడు చేసిన ఈ ప్రకటన దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది "రాజద్రోహ, దేశ వ్యతిరేక" ప్రకటనకు సమానమని గుప్తా తన పిటిషన్‌లో వాదించినట్లు ఐఏఎన్ఎస్ నివేదించింది. జనవరి 2025లో న్యూఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో గాంధీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. "తాము ఇప్పుడు బిజెపి, ఆర్ఎస్ఎస్, భారత రాజ్యంతోనే పోరాడుతున్నాము," అని ఆయన అన్నారు. ఆయన వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శలు మాత్రమే కాదని, దేశాన్ని అస్థిరపరిచే ఉద్దేశపూర్వక ప్రయత్నమని, అవి భారత రాజ్యాన్ని ఒక శత్రుశక్తిగా చిత్రీకరించాయని గుప్తా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనికి ముందు, రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ పిటిషనర్ దాఖలు చేసిన దరఖాస్తును సంభాల్‌లోని స్థానిక కోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత, ఈ విషయం అలహాబాద్ హైకోర్టుకు చేరింది. అంతేకాకుండా, ఆ తర్వాత దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా హైకోర్టు తీర్పునిస్తూ, రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరిస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డికె అరుణ

# భవిష్యత్తులో కవిత ఉనికి ఉండదు

## ఏదో ఒక పార్టీలో విలీనం తప్పదు

## మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 1, ప్రభాతవార్త :** కవితా తన తండ్రి కేసిఆర్ పేరు చెప్పుకొని రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నారని, భవిష్యత్తు ఎన్నికల్లో, రాజకీయాల్లోనూ కవిత ఉనికి ఉండదు అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో వైయస్ షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టింది ఏమైంది..,కాంగ్రెస్ లో విలీనం చేసిందని గుర్తు చేశారు. కవిత కూడా తన పార్టీని ఏదో ఒక పార్టీలో విలీనం చేస్తుందని పేర్కొన్నారు. నీళ్ల నిధులు నియామకాల నినాదం నేటికి నెరవేరలేదని తెలంగాణలో బిజెపి ప్రభుత్వం తెచ్చుకొని, ఆ నినాదం నెరవేర్చుతుందనే విశ్వాసం ప్రజల్లో కూడా ఉందని చెప్పారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజా రెడ్డి, సుధాకర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి, పిట్టల యాదయ్య గుండా సంతోష్ మర్రి జ్యోతి హరికృష్ణ కృష్ణ వర్ధన్ రెడ్డి, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విహెచ్, రాష్ట్ర బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బాలమయదేవి, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ సిఇవో ఆలోక్‌కుమార్, ఆశన్న

## విహెచ్‌తో ప్రభుత్వ ఉన్నతాధికారుల సమావేశం

**హైదరాబాద్, మే 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావును పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు కలిశారు. శుక్రవారం అంబర్‌పేటలోని హనుమంతరావు నివాసానికి రాష్ట్ర బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బాలమయదేవి, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ సిఇవో ఆలోక్‌కుమార్, ఆశన్న (డిడిబిసిడబ్ల్యు), డి.కృష్ణమాచారి (ఎబిసిడివో), మన్విత (ఎబిసిడివో), రమేష్ (ఏబిసిడివో),




రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి జెఏసి ఛైర్మన్ వేముల రామకృష్ణ, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు

## జి.ఓ.7తో పేద విద్యార్థులకు

# ఉన్నత విద్య దూరం

## విద్యార్థి జెఏసి నిరసన.. జి.ఓ. పత్రాల దహనం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** ప్రభుత్వ అస్పష్టమైన విధానాల వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని తెలంగాణ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ వేముల రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగంలో గందరగోళానికి కారణమవుతున్న జి.ఓ.ఎం.ఎస్ నం.7ను నిరసిస్తూ శుక్రవారం నగరంలో విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నల్ల కండువాలతో నిరసన తెలుపుతూ, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను దహనం చేశారు.ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ, ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన తర్వాత ఫీజులు చెల్లిస్తామంటే కాలేజీ యాజమాన్యాలు అంగీకరించడం లేదని, దీంతో విద్యార్థులపై పెను భారం పడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీకి అవకాశం కల్పించినట్లేనని విమర్శించారు. ఫీజుల నియంత్రణపై కమిటీ వేసి కాలయాపన చేస్తున్న ప్రభుత్వం, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంలో ఎందుకు వెనకడుగు వేస్తోందని ఆయన నిలదీశారు.రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు.10 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కాలేజీలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి. ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. జి.ఓ.ఎం.ఎస్ 7ను సవరించి, విద్యా సంవత్సరం లోపలే నిధులు జమ చేస్తామని స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏరా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నందగోపాల్, జూనియర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వంశీ కృష్ణ తదితరులు పాల్గొని విద్యార్థుల పోరాటానికి మద్దతు ప్రకటించారు.



బాధ్యతలు చేపడుతున్న షా నవాజ్ ఖాసిం

## మల్టీ జోన్ 2 ఐజిగా షా నవాజ్ ఖాసిం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** మల్టీ జోన్ ఐజిగా నియమితులైన షా నవాజ్ ఖాసీం శుక్రవారం బాధ్యతలు చేబట్టారు. డిజిపి కార్యాలయంలో గల తన ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు చేబట్టారు. ఇంతకు ముందు ఆయన తూర్పు మండల డిసిపిగా మైనారిటి విభాగం కార్యదర్శిగా, డ్రగ్స్ కంట్రోల్ డైరక్టర్‌గా పనిచేశారు. షా నవాజ్ ఖాసీం 2003 బ్యాచ్ ఐపిఎస్ అధికారి.

## ఉద్యోగుల సమ్మె కాలం సెలవులుగా పరిగణన

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** తమ డిమాండ్ల సాధన కోసం ఇటీవల సమ్మె చేసిన తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు (ఆర్టిజన్ల) కు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని విద్యుత్ శాఖ తీసుకుంది. ఈ నెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆర్టిజన్లు చేసిన సమ్మె కాలాన్ని సెలవు దినాలుగా గుర్తిస్తున్నట్టు ప్రకటించింది. తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో హెచ్‌ఆర్ డైరెక్టర్ ఎస్.వి. కుమార్ రాజు సమ్మె కాలాన్ని సెలవు దినాలుగా గుర్తిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

# త్వరలో జొన్న కొనుగోలు కేంద్రాలు

- పంట కొనుగోళ్లలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- ఇకనైనా ప్రతిపక్షాల నేతలు వాస్తవాలు తెలుసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** పంట దిగుబడుల కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని ప్రధాన పంటల దిగుమతులను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తేల్చి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులతో శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో పంట కొనుగోళ్లపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం జొన్న, మొక్కజొన్న పంటను కొనుగోలు చేయకపోయినా మద్దతు ధర చెల్లించి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పిడిఎస్ పథకంలో కేంద్రం కొనే పప్పు ధాన్యాలు, నూనె గింజల్లో 25శాతం కేంద్ర పరిమితికి మించి కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. అయితే వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిపక్షాలు ప్రతీ అంశాన్ని రాద్ధాంతం చేస్తూ రాజకీయంగా పబ్బం గడుపుకుంటున్నాయని మండిపడ్డారు. పంట కొనుగోళ్ల విషయంలో గత ప్రభుత్వ రికార్డును, ఈ రెండు సంవత్సరాల్లో కొనుగోళ్లను పోల్చి చూశాక మాట్లాడాలని హితవు చెప్పారు. త్వరలోనే జొన్న కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే అధికారంలో ఉన్నపుడు అరకొర కొనుగోళ్లు చేసి చేతులు దులుపుకున్న ఓ పార్టీ, అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పంట కొనుగోళ్ల ఊసే ఎత్తని మరోపార్టీ నేతలు రైతుల్లో అనవసర ఆందోళనలు సృష్టించేలా ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు.

కాగా.. రైతులు, వ్యాపారులకు అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష      ్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కొహెడ మార్కెట్ నిర్మాణంపై ఎపిసి కార్యదర్శితోపాటు మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్కెటింగ్ డిపార్ట్మెంట్ రూపొందించిన కొహెడ మార్కెట్ మాస్టర్ ప్లాన్‌ను సమీక్షించారు. మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, నిల్వ సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

# విభజన రాజకీయాలను తిప్పికొట్టాలి

- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు పిలుపు

**చిక్కడపల్లి, మే 1, ప్రభాతవార్త :** శ్రమ అనేది కుల మతాలకు అతీతమని, విభజన రాజకీయాలు చేస్తున్న శక్తులను కార్మిక లోకం ఐక్యంగా తిప్పి కొట్టాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. శుక్రవారం మే డే దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సిపిఎం కేంద్ర కార్యాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు.

కార్మిక రాజ్యం రావాలంటే సామ్రాజ్యవాద విస్తరణ కాంక్ష నశించాలని ఆయన నొక్కి చెప్పారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, శాంతి ఒప్పందాలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.యుద్ధ ప్రభావం మన దేశంపై తీవ్రంగా పడుతోందని రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.1,000 పెరగడం వల్ల సామాన్యులపై పెను భారం పడుతుందని, యుద్ధం కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొత్త లేబర్ కోడ్‌లు కార్మిక పోరాటాలను అడ్డుకోలేవని ఆయన స్పష్టం చేశారు. అణచివేత పెరిగే కొద్దీ తిరుగుబాటు కూడా పెరుగుతుందని, నోయిడాలో యూనియన్లు లేకపోయినా వేలాది కార్మికులు రోడ్లపైకి వచ్చి పోరాడటమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి, టి.సాగర్, జి.నాగయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సారంపల్లి మల్లారెడ్డి, జి.రాములు, డీజీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సిపిఎం కేంద్ర కార్యాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బి.వి. రాఘవులు


# పదోన్నతులకు బంపర్ ఆఫర్

- కొత్త ఉచిత విద్యుత్ డిస్కంలో సిబ్బంది బదిలీ
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యుత్ శాఖ

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడుతున్న ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్డీడీసీఎల్)లో సిబ్బంది నియామకానికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు వీటకి సంబంధించి విద్యుత్ శాఖ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, ఆర్టిజన్లను బదిలీ చేయడం ద్వారా ఈ కొత్త ఉచిత డిస్కంలోకి తీసుకోనున్నారు. ముఖ్యంగా బదిలీ కోరుకునే వారికి తదుపరి కేడరుకు సంబంధించి పదోన్నతి కల్పిస్తూ విద్యుత్ శాఖ ఆఫర్ ప్రకటించింది. ఈ బదిలీ ప్రక్రియలో భాగంగా ఎస్ఈ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు, అలాగే అకౌంట్స్, పీ అండ్ జి కేడర్ల వారికి ఒక స్థాయి పై కేడరుకు పదోన్నతి లభించనుంది. ఈ నేపథ్యంలో సూపరిండెంటెండ్ ఇంజనీర్‌గా ఉన్నవారు చీఫ్ ఇంజర్‌గాను, అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు డివిజనల్ ఇంజనీర్లుగా ప్రమోషన్లు ఇవ్వనుంది. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి సూపరిండెంటెండ్ ఇంజనీర్ కేడర్ వారికి ఏడాది, డివిజనల్ ఇంజనీర్ అంతకంటే తక్కువ కేడర్ వారికి 2 సంవత్సరాల కనీస సర్వీస్ ఉండాలని ఈ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. అయితే పదోన్నతి పొంది బదిలీ అయినవారు 5 సంవత్సరాల వరకు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) నిమిత్తం దరఖాస్తు చేసుకునేందుకు, అలాగే ఇతర సంస్థలకు డిప్యూటేషన్లపై వెళ్లేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎటువంటి వీలుండదని విద్యుత్ శాఖ తేల్చిచెప్పింది. తెలంగాణ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్కో), విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్కో), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో ప్రొబేషన్ పూర్తి చేసుకున్న రెగ్యులర్ ఉద్యోగులు, ఆర్టిజన్లు ఈ మూడో కొత్త డిస్కంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. కొత్త ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థలకు బదిలీ కోరుకునే ఉద్యోగులు కేవలం ఆన్లైన్ పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు గాను ఏప్రిల్ 30 నుంచే ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఈ బదిలీలను కోరుకునే ఉద్యోగులు ఈ నెల 8ని చివరి తేదీగా ప్రకటించింది. తదుపరి వీటిని పరిశీలించి, అర్హులైన వారికి ఈ నెల 13న కొత్త విద్యుత్ పంపిణీ సంస్థలో పనిచేసేందుకు వీలుకల్పిస్తూ నియామక ఉత్తర్వులను జారీచేయనుంది. ఈ ఉత్తర్వులు అందిన వెంటనే ఈ నెల 15వ తేదీన ప్రస్తుతం విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పోస్టుల నుంచి రిలీవ్ అయి ఇదే నెల 25లోపు కొత్త ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థలో తమకు కేటాయించిన పోస్టులో చేరాల్సి ఉంటుందని మార్గర్శకాల్లో పేర్కొంది.

# కోమాలో ఉన్న బాధితునికి నిమ్స్‌లో చికిత్సఅందించాలి

**హైదరాబాద్(బేగంపేట), మే 1, ప్రభాతవార్త :** సౌదీ అరేబియా దమ్మాంలో కోమాలో ఉన్న తన భర్తను ఇండియాకు రప్పించి నిమ్స్‌లో చికిత్స అందించాలని కోరుతూ చంద్రకళ అనే మహిళ శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో నిర్వహించిన సిఎం ప్రజావాణిలో ప్రజావాణి ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డికి దరఖాస్తు అందజేసారు. నిజామాబాద్ పట్టణం గాజుల పేట్‌కు చెందిన తిరుకోవులూరు శ్రీనివాస్(56) ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లాడు. గత మూడు నెలలుగా అక్కడి ఆసుపత్రిలో కోమా స్థితిలో చికిత్స పొందుతున్నాడు. తాము పేద వారమని, సౌదీలో వైద్య ఖర్చులను భరించలేమని, కోమా పేషెంట్‌ను హైదరాబాద్‌కు తీసుకు వచ్చి నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం అందించేలా సహాయం చేయాలని చంద్రకళ వారి కుటుంబ సభ్యులు చిన్నారెడ్డిని కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన చిన్నారెడ్డి చర్యలు తీసుకోవాలని సీఎంఓ అధికారులను ,నిమ్స్ డైరక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ అంబాసిడర్ డా.బి.ఎం.వినోద్‌కుమార్,వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డి,సీఎం ప్రవాసీ ప్రజావాణీ లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి,ఖతార్ ఇండియన్ ఎంబసీలో ఐసిబిఎఫ్ లీగల్ సెల్ ప్రతినిధి ఖాజా నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో డా.జి.చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చంద్రకళ

**సిఎం ప్రజావాణికి 142 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 218వ సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 142 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 37దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 24దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 40దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 02దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 39దరఖాస్తులు అందాయి.సీఎం ప్రజావాణీ ఇంచార్జ్,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్యప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ఎన్‌ఆర్ఐ సలహా మండలి ఛైర్మన్ మంద భీంరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# కెసిఆర్‌కు కవిత భయం పట్టుకుంది

## అందుకే బయటకు వస్తున్నారు

## టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ గౌడ్

**హైదరాబాద్, మే1, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** హైదరాబాద్‌లోని చెరువుల కబ్జాల విముక్తి కోసం ప్రభుత్వం చేపట్టిన హైడ్రా చర్యలపై కేసీఆర్ అభ్యంతరం చెప్పడాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తప్పుపట్టారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. నగరం చుట్టూ ఉన్న చెరువులను బీఆర్ఎస్ నాయకులే కబ్జా చేశారని, అందుకే హైడ్రా వల్ల ఆ పార్టీ నేతలకు ఇబ్బంది కలుగుతోందని ఎద్దేవా చేశారు. చెరువులను కబ్జాల నుండి విముక్తి చేస్తే కేసీఆర్‌కి వచ్చిన ఇబ్బంది ఏంటని ఆయన ప్రశ్నించారు. హైడ్రా నిబంధనల గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవు పలికారు. టిఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారని, ఆమె భయం వల్లే ఆయన బయటకు వస్తున్నారని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కవితకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ ప్రజల కోసం కాకుండా రాజకీయ ఉనికి కోసమే బయటకు వస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేస్తున్నామని చెబుతూనే, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా మహేశ్ గౌడ్ కొన్ని కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని, దీనిపై ఇప్పటికే కసరత్తు పూర్తయిందని తెలిపారు. ఇక అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం తీసుకునే అధికారం పూర్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని ఆయన స్పష్టం చేశారు. ఫోన్లు ట్యాప్ చేయడం బిఆర్ఎస్ నాయకులకు అలవాటని, తమకు కాదని ఎద్దేవా చేశారు. అటువంటి అవసరం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు.

గతంలో ప్రతిపక్ష నేతలు, సినీ తారల ఫోన్లను ట్యాప్ చేసింది వారు కాదా అని ఆయన ప్రశ్నించారు. అప్పటి పరికరాలను ఉపయోగించి హరీశ్‌రావు ఫోన్‌ను స్వయంగా కెసిఆర్ ట్యాప్ చేసి ఉంటారని వ్యాఖ్యానించారు.



## సేంద్రీయ ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం

# ప్రత్యేక మొబైల్ యాప్

## 4న ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సేంద్రీయ ఉత్పత్తుల క్రయవిక్రయాల కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు యాప్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు, రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయ అవకాశాలపై వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు, జన్యుమార్పిడి పంటలను వాడకుండా, సహజ వనరుల నుండి పోషకాలను, సేంద్రియ ఎరువులను ఉపయోగించి వ్యవసాయం చేసే విధానాన్ని సేంద్రీయ వ్యవసాయంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో సుశిక్షతులైన సేంద్రీయ సాగు రైతులు ఉన్నారని, పెద్ద ఎత్తున సేంద్రీయ సాగు విధానంలో పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో సేంద్రీయ పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తెలంగాణ ఆర్గానిక్స్ యాప్‌ను ఈ నెల 4న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, నిజామాబాద్, అదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలలో సేంద్రియ సాగు జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం క్రింద 60 వేల ఎకరాలలో సేంద్రియ సాగును కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వివరించారు. ఒక నిర్దిష్ట పద్ధతిలో ఆగికల్చర్ ప్రొడ్యూస్ ఎక్స్‌పోర్టు డెవలప్ మెంట్ అథారిటి నిర్దేశించిన ప్రమాణాలను మేరకు అధికారులు రైతు పంట క్షేత్రాలను తనిఖీ చేయడం తోపాటు ల్యాబ్‌కు సేంద్రీయ ఉత్పత్తుల శాంపిల్స్‌ను పంపి సేంద్రీయ ధృవీకరణ చేయనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక వ్యవసాయ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 4న వికారాబాద్ జిల్లా, తాండూరులో తెలంగాణ ఆర్గానిక్స్ మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఆసక్తిగల వినియోగదారులు యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలోని ప్లే స్టోర్ నుంచి టిజి ఆర్గానిక్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

## సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో

# మందమర్రికి రెండో స్థానం

## జనరల్ మేనేజర్ రాధాకృష్ణ

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్‌లో వివిధ గనుల్లో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాయి. సింగరేణి వ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే మందమర్రి ఏరియా బొగ్గు ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచింది. సింగరేణి పరిధిలోని మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా లోని గనులు 100 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ తెలిపారు. జీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ లో ఏరియాలోని గనుల్లో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష      ్యం 2,01,500 టన్నులు కాగా, నెలాఖరుకు వంద శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. కల్యాణిఖని ఓపెన్ కాస్ట్ గనిలో 1,40,000 టన్నుల లక్ష్యానికి గాను 1,63,123 టన్నులు ఉత్పత్తి చేసి 117 శాతం సాధించగా, కేకే-5 గనిలో 16 వేల టన్నుల లక్ష్యానికి 16,280 టన్నులతో 102 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో 24.80 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత లక్ష్యానికి 28.70 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసి 116 శాతం సాధించినట్లు వివరించారు. ప్రతి రోజు రెండు రైల్వే రేకుల ద్వారా నెలలో మొత్తం 52 రేకుల బొగ్గును రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా రెండో దశ గనిని ప్రారంభించే ప్రణాళిక ఉందని, దీనికి అటవీ శాఖ అనుమతులు రావాల్సి ఉందన్నారు. కాసీపేట-1 గనిలో మ్యాన్ రైడింగ్ వ్యవస్థ వల్ల ఉద్యోగులకు నడక భారం తగ్గిందని, దీంతో బొగ్గు ఉత్పత్తి మరింత పెంచుకునే అవకాశం ఉందన్నారు. కాగా వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఏప్రిల్ నెల నుంచి మజ్జిగ సరఫరా చేస్తున్నామని, రెస్ట్ షెల్టర్లు ఏర్పాటు చేసి ఏసీ సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. అలాగే ఓబీ కాంట్రాక్ట్ సంస్థలో పనిచేసే కార్మికులకు మజ్జిగతో పాటు గొడుగులు కూడా అందజేశామని చెప్పారు.

# ఎగుమతుల్లో రాష్ట్రానికి కీలక స్థానం

## ఒక్క యేడాదిలో 5 వేల మిలియన్ డాలర్లకు పెరుగుదల

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త :** తెలంగాణ ఎగుమతుల రంగంలో పురోగతిని సాధించింది. ఈ రంగంలో గణనీయమైన వృద్ధిని సాధిస్తూ దేశంలోనే రాష్ట్రం ప్రత్యేకతను చాటింది. తెలంగాణ ఎగుమతుల విలువ ఒక్క ఏడాదిలోనే 5 వేల మిలియన్ డాలర్లకు పైగా పెరిగినట్లు తాజాగా రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్ నివేకలో వెల్లడించింది. ఈ నివేదికలోని గణాంకాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి జరిగిన మొత్తం ఎగుమతుల విలువ 14,026 మిలియన్ డాలర్లు కాగా, 2024-25 నాటికి అది 19,123 మిలియన్ డాలర్లకు చేరింది. కేవలం ఒక ఏడాదిలోనే దాదాపు 36 శాతం వృద్ధి నమోదైంది. ఇది రాష్ట్ర ఆర్థిక బలాన్ని, పరిశ్రమల సామర్థ్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నది. ప్రధానంగా ఐటీ, ఫార్మాస్యూటికల్ రంగాలు ఎగుమతుల పెరుగుదలలో కీలకంగా నిలిచాయి. రాష్ట్రం నుంచి ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, బల్క్ డ్రగ్స్, డ్రగ్ ఫార్ములేషన్లు, ఐటీ సేవలు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చెందిన ఫార్మా క్లస్టర్లు, ఐటీ హబ్లు రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి వెన్నెముకలా మారాయి. 2024-25లో ఐటీ ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశవ్యాప్తంగా పెరుగుదల కనిపించింది. కానీ తెలంగాణలో ఐటీకి తోడు ఫార్మా రంగం సైతం సమానంగా బలంగా ఉండటంతో, రాష్ట్రానికి అత్యధిక వృద్ధి నమోదు కావడం సాధ్యమైంది. ఇక ఫార్మా, ఐటీ రంగాలకే పరిమితం కాకుండా ఇంజినీరింగ్ సామగ్రి, రసాయనాలు, ఏరోస్పేస్ పరికరాలు వంటి తయారీ రంగ ఉత్పత్తులు కూడా తెలంగాణ నుంచి ఎగుమతి అవుతున్నాయి. ఈవిధంగా విభిన్న రంగాల భాగస్వామ్యం రాష్ట్ర ఎగుమతులకు స్థిరత్వాన్ని ఇస్తున్నది. ఈ పెరుగుదలతో దేశవ్యాప్తంగా ఎక్కువ ఎగుమతులు చేసే రాష్ట్రాల జాబితాలో తెలంగాణకు ఏడో స్థానం లభించింది.

మెరుగైన విద్యుత్ సరఫరాకు

# ఏఐ వినియోగించాలి

## ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్ లోడ్ పడకుండా చూడాలి
## సోలార్ స్టవ్‌ల వినియోగంపై అవగాహన పెంచాలి
## విద్యుత్ శాఖపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, మే1, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** విద్యుత్ శాఖలో సరఫరా లోపాలు, మెరుగైన విద్యుత్ సరఫరాకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (రైతు డిస్కం) లో చేరిక పై ఉద్యోగులు, సిబ్బందికి ఉన్న అపోహలు తొలగించాలని స్పష్టం చేశారు. ట్రాన్స్ఫర్మర్లపై ఓవర్ లోడ్ పడకుండా చూడాలని ఆదేశించారు. శుక్రవారం రాత్రి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై సమీక్షించారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక వాడలు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, ట్రిపుల్ ఆర్ వంటి డెవలప్మెంట్ నేపథ్యంలో డిమాండ్‌కు తగిన విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా ప్రాధాన్యక్రమంలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. భారీ డాటా సెంటర్లకు అవసరమైన అనుమతులు ఇవ్వండని చెప్పారు. సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సబ్ స్టేషన్స్ పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్ కింద భూమి అందుబాటులో ఉన్న చోట ఉమ్మడి జిల్లాలో రెండు సబ్ స్టేషన్ల పక్కన సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాలని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టే 18 సోలార్ పవర్ ప్లాంట్లు (హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో జిల్లాకు రెండు చొప్పున) నిర్మాణానికి నోడల్ అధికారులను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోలార్ స్టవ్ ల వినియోగంపై అవగాహన పెంచాలని చెప్పారు సిఎం వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్‌కో సిఎండి హరీశ్, ఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్, మూడో డిస్కం సిఎండి ముషారఫ్ అలీ ఫారూఖీ పాల్గొన్నారు.

# 3 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధిస్తాం

- కార్మికులందరూ దానిలో భాగస్వాములు కావాలి
- మంత్రి జి.వివేక్ వెంకటస్వామి



శ్రమశక్తి అవార్డులను అందజేస్తున్న మంత్రి వివేక్ హరిచందన తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 1 ప్రభాతవార్త :** కార్మికుల హక్కుల కోసం, లేబర్ చట్టాలు సరిగాలేక కార్మికుల చేసిన పోరాటాలకు గుర్తింపుగా ప్రపంచ వ్యాప్తంగా మే 1న కార్మికుల దినోత్సవం చేసుకుం టున్నామని కార్మికులందరికి మే డే దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2047 సంవత్సరం నాటికి 3 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలన్న ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉందని, ఈ లక్ష్య సాకారానికి కార్మికుల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ఆయా చట్టాలు వచ్చాక యాజమాన్యాలు కూడా వాటిని గౌరవిస్తూ, ఆచరిస్తూ ముందుకు పోతున్నాయని, ఇది చాలా మంచి పరిణామమని, తాను మంత్రి అయ్యాక యాజమాన్యాల నుండి చాలా తక్కువ విజ్ఞప్తులు వస్తున్నాయని ఆనందాన్ని వ్యక్తపరిచారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి లక్ష్యాన్ని చేరుకునేందుకు కార్మికులకు శిక్షణ ఇవ్వాలి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకోవాల్సి ఉందని, తదనుగుణంగా టాటా వారితో ఒప్పందం చేసుకుని 4వేల కోట్లతో 120 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసి) స్థాపించి తగుశిక్షణ ఇవ్వ డం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏటీసీల్లో కార్మి కుల పిల్లల కోసం ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నామని, ఏటీసీల్లో చదివే పిల్లలకు 2500 స్టైఫండ్ ఇస్తున్నామన్నారు. ఈ కోర్సుల్లో వ్యవసాయరంగానికి సంబంధించిన కోర్సులు చేరుస్తున్నామని తెలిపారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం టాప్‌కామ్ సంస్థకు 90కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. ఇటీవలి జర్మనీ పర్యటనలో అక్కడ వాళ్లు 5వేల మందికి ఉపాధి కల్పిస్తామని హామీనిచ్చారని, తదనుగుణంగా టామ్ సంస్థ ద్వారా తగిన శిక్షణతోపాటు జర్మనీ భాష ఎలా నేర్పించాలో ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక కార్మికుల ఇన్సూరెన్స్ స్కీమ్ 6 లక్షల నుండి 10లక్షలకు పెంచామన్నారు. హమాలీ కార్మికుల కోసం ఒక బోర్డును ఏర్పాటుచేసి వాళ్లకూ తగిన న్యాయం చేస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లను ఆదుకోవాలని సూచించారని, రాష్ట్ర గవర్నర్ గిగ్ వర్కర్ల బిల్లుకు ఆమోదం తెలిపారని, త్వరలో నియమాలను రూపొం దించి అమలు చేస్తామని తెలిపారు. కార్మికుల ఆరోగ్య రక్షణకు పెద్దపీటవేస్తూ శంషాబాద్, రామగుండంలలో 100 పడకల ఆస్పత్రులు, మహబూబ్‌నగర్‌లో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సమాజ నిర్మా ణంలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులకు ఎంతచేసినా తక్కువే అన్నారు. మంత్రులు వివేక్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే జి.వినోద్, ఎంపి గడ్డం వంశీకృష్ణ, కార్మికశాఖ కార్యదర్శి దాసరి హరిచందన, కమిషనర్ పమేలా సత్పతి, జనక్‌ప్రసాద్ తదితరులతో కలిసి వివిధరంగాలకు చెందిన పలువురికి శ్రమశక్తి అవార్డులతోపాటు ప్రమాదంలో చనిపోయిన గిగ్‌వర్కర్ ధరావత్ భద్రు కుటుంబానికి 5లక్షల చెక్కును అందజేశారు.

## కెఆర్ఎంబి తీరుపై తెలంగాణ అసహనం

### ఎపి అక్రమంగా నీటిని తరలించుకు వెలుతున్నా నియంత్రించడం లేదని ఆవేదన

**హైదరాబాద్, మే1, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులను కాపాడే విషయంలో, కేటాయింపుల మేరకు నీటిని వినియోగించుకునేలా ఎపిని నియంత్రించడంలో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ నీటిపారుదల వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. ప్రధానంగా కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ నుండి ఎపి అక్రమంగా నీటిని తరలించుకుకెళుతున్నా, కేటాయింపులను మించి నీటిని వినియోగించుకుంటున్నా బోర్డు నియంత్రించలేకపోయిందన్న విమర్శలు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి. ఈ తరుణంలో కెఆర్ఎంబి తీసుకున్న మరో కీలక నిర్ణయంపై తెలంగాణ నీటిపారుదలశాఖ వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఏడాది నీటి సంవత్సరం మరో నెల రోజుల్లో ముగుస్తుందనగా, కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, సాగర్‌లో నీటి నిల్వలు అంతంతమాత్రంగానే ఉన్న సమయంలో ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం విమర్శలకు తావిస్తోంది. నీరంతా ఎపి తరలించుకెళ్లాక, మరో నెల రోజుల్లో నీటి సంవత్సరం ముగుస్తున్న సందర్భంలో మీటింగ్ నిర్వహించినా, దాన్ని వాయిదా వేసినా వచ్చే ఫలితం శూన్యమని తెలంగాణ నీటిపారుదలశాఖ భావిస్తోంది. ప్రస్తుత నీటి సంవత్సరం మరో 30 రోజుల్లో ముగుస్తోంది. ఈ ఏడాది కృష్ణా నది నుంచి 75శాతం జలాలను ఎపి తరలించుకుపోయింది. ఈ విషయాన్ని తెలంగాణ నీటిపారుదలశాఖ ఎన్నిసార్లు లేఖల ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లినా కెఆర్ఎంబి సమావేశం ఏర్పాటు చేయలేదని నీటిపారుదలశాఖవర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి త్రిసభ్య కమిట ఏటా సీజన్లవారీగా ఎప్పటికప్పుడు సమావేశాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాల డిమాండ్లను, అందుబాటులో ఉన్న నీటినిల్వలను పరిగణనలోకి తీసుకొని ఇరు రాష్ట్రాలకు నీటి వాటాలను కేటాయించాలి. కానీ ప్రస్తుత నీటి సంవత్సరంలో ఇప్పటివరకు త్రిసభ్య కమిటీ సమావేశం జరగలేదు.

ఫలితంగా ఎలాంటి ఇండెంట్లు, త్రిసభ్య కమిటీ నిర్ణయాలు, నీటి విడుదల ఆర్డర్లు లేకుండానే ఎపి యథేచ్ఛగా కృష్ణా జలాలను మళ్లించుకుపోయింది. ఈ ఏడాది ఇప్పటివరకు 680 టీఎంసీలకుపైగా కృష్ణా జలాలను ఎపి వినియోగించుకుంది. ఎపికి నిర్దేశిత తాత్కాలిక వాటా 66శాతమే కాగా అంతకు మించి 75శాతం మేర కృష్ణా జలాలను మళ్లించినట్టు అధికారిక గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే 2026-27 నీటి ఏడాదిలోనైనా ఎపి అక్రమంగా కృష్ణా జలాలను మళ్లించుకోకుండా నిలువరించాలని కెఆర్ఎంబిని తెలంగాణ నీటిపారుదలవర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

## తూప్రాన్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల నియామకం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మరో రెండు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెదక్ జిల్లా తూప్రాన్ మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా యమజాల కీర్తన, వైస్ చైర్మన్‌గా మామిండ్ల కృష్ణ, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీకి చైర్మన్‌గా బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా తన్వీర్ అహ్మద్‌ను నియమించింది. రాష్ట్రంలో ఉన్న 207 మార్కెట్ కమిటీలకు 187 మార్కెట్ కమిటీలకు పూర్తిస్థాయిలో నియమించినట్లు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. గతంలో 197 వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉండగా రైతుల అవసరాలు కోసం మరో 17 కొత్త మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే 10 మార్కెట్లు (పానగల్, చిన్నంబావి, వీపనగండ్ల, పెద్దకొత్తపల్లి, కోడేరు, ఎలిగేడ్, దామరచర్ల, ఎల్కతుర్తి, గోపాల్ పేట, మతికేపల్లి, ఖిల్లా ఘనపూర్) ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడంతో మార్కెట్ కమిటీల సంఖ్య 207కు చేరుకుందన్నారు. మిగిలిన 7 మార్కెట్లు (జూలూరుపాడు, తెల్కపల్లి, అడ్డాకల్, హసన్ పర్తి, జిల్లేడు చౌదర్ గూడ, కొత్తగూడ, ఐజ)ను కూడా నెలలోపు ఏర్పాటు చేసి రైతులకు మరింత సౌకర్యం కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో రైతులు పంటలు అమ్ముకునేందుకు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలను నిరక్ష్యం చేసి, రైతులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని మంత్రి విమర్శించారు.

## రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తాం

### రాజ్యాధికార పార్టీలో చేరిన మాజీ మావోయిస్టులు



వనజక్కకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తీన్మార్ మల్లన్న

**హైదరాబాద్(సైఫాబాద్), మే 1 ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ మాజీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాజ్యాధికార పార్టీలో చేరారు. వారికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు మాజీ మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు గన్‌పార్కులోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం వారు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రెస్‌క్లబ్‌లో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మావోయిస్టులను తమ అవసరాల మేరకు వినియోగించుకుని వదిలి వేశాయని, వారికి అసెంబ్లీలో అవకాశం కల్పించ లేదని ఆరోపించారు. అసెంబ్లీలో పిడిత వర్గాల గొంతు వినిపించాలంటే ఒక్క రాజ్యాధికార పార్టీ ద్వారానే సాధ్యమన్నారు. 2028లో రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పార్టీ ముందుకు కొనసాగుతుందన్నారు. పార్టీలో మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తామని, పార్టీలో, అధికారంలో 50 శాతం మహిళలకు రిజర్వేషన్‌లు కల్పిస్తామన్నారు. జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించి, వేలాది మంది మాజీ మావోయిస్టులతో భువనగిరిలో 'మహాగర్జన' నిర్వహిస్తామన్నారు. మావోయిస్తు నాయకులు మాట్లాడుతూ ఏండ్లు తరబడి తాము అడవుల్లో జీవిస్తూ పీడిత వర్గాల కోసం పోరాటాలు చేశామన్నారు. కాని మా లక్ష్యాలు పూర్తిగా నేరవేరలేదని, ఇప్పుడు మల్లన్న ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య మార్గంలోకి వస్తూ అసెంబ్లీలో ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతామన్నారు.

తాము అనుకున్న మార్పులను చట్టాల రూపంలో తీసుకురావడానికి ఇదే చివరి అవకాశమని భావించి టిఆర్‌పిలో చేరుతు న్నామన్నారు. మా భావజాలం కలిగిన వేలాది మంది త్వరలో భారీగా ఈ పార్టీలో చేరుతా రన్నారు. ఈ సభకు మావోయిస్టు పార్టీ మాజీ దళ కమాండర్ పటేల్ వనజక్క (వనజ) అధ్యక్షత వహించగా, అడవి బిడ్డలు, ఉద్యమకారులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిలో ట్రయల్ రన్ ప్రారంభం

**యూసుఫ్‌గూడ మే 1 ప్రభాతవార్త :** సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిలో ఆస్పత్రిలో శుక్రవారం నుంచి ట్రయల్ రన్ ప్రారంభించారు. నెల రోజుల పాటు కొనసాగే ట్రయల్ రన్ అనంతరం ఆస్పత్రిని అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. ట్రయల్ రన్ ఏర్పాట్లను డీఎమ్ఈ డాక్టర్ నరేంద్రకుమార్ పరిశీలించారు. ఆస్పత్రి నోడల్ అధికారి డాక్టర్ మెహబూబ్ ఖాన్ పర్యవేక్షణలో తొలి రోజు 9 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ట్రయల్ రన్‌లో 22 మంది రోగులను తాత్కాలిక రిజిస్ట్రేషన్ విభాగం ద్వార నమోదు చేసుకుని ఆయా స్పెషాలిటీ ఓపీల ద్వార వైద్యుల కన్సల్టేషన్ నిర్వహించి మందులను అందజేశారు. ట్రయల్ రన్‌లో భాగంగా నెల రోజుల పాటు అన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలకు చెందిన ఓపీ సేవలను తీసుకురావడం రోగులను ఆయా విభాగాలకు పంపడం వైద్యుల కన్సల్టేషన్ నిర్వహణ, వ్యాది నిర్ధారణ పరీక్షలను మొదలు పెట్టడం, యంత్ర పరికరాల పనితీరు పరిశీలించడం, వార్డులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం ఆయా విభాగాలకు వైద్య సిబ్బందిని కేటాయించడం తదితర ఏర్పాట్లను చూసుకుంటూ ఆస్పత్రి అధికారికంగా ప్రారంభించే నాటికి మెరుగైన పనితీరు సాధించటం ముఖ్య ఉద్దేశమని నోడల్ అధికారి డాక్టర్ మెహబూబ్ ఖాన్ తెలిపారు. ట్రయల్ రన్‌లో ఎవరికైనా అత్యవసర సేవలు అవసరమైతే అందుబాటులో మూడు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. టిమ్స్ శుక్రవారం ప్రారంభించిన ట్రయల్ రన్‌లో భాగంగా బోరబండకు చెందిన మనెమ్మ తొలి రోగిగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆగ్రహం

### నిజామాబాద్‌లో రహదారిపై ధాన్యం పారబోసి ధర్నా
### ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా యాసంగిధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. అయితే కొన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతో అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లారీల కొరత, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 17శాతం తేమ వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబోసినా వారాల తరబడి ధాన్యం తూకం వేయడం లేదని, తూకం వేసినా లోడింగ్ చేసి మిల్లులకు తరలించడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ అన్నదాతలు రోడ్డెక్కుతున్న ఘటనలు రాష్ట్రంలో నిత్యకృత్యమయ్యాయి. తాజాగా నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామ రైతులు రోడ్డెక్కిధర్నా నిర్వహించారు. వరి కొనుగోలు చేయడం లేదని రహదారిపైన ధర్నా చేశారు. 15 రోజుల నుండి వరి కోసి కొనుగోలు కేంద్రాలకుధాన్యాన్ని తరలించినా కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. రైతులందరూ రోడ్డుపై వరి ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. వరి ధాన్యం కుప్పకి నిప్పు అంటించిమరి తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. రోడ్డుపైనే వంటా వర్పు కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి రైతులు ప్రయత్నించడంతో రహదారిపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపచేశారు.

## మూడున్నర కోట్ల పనిదినాలు పూర్తి చేయాలి

### ఉపాధి హామీ పనులపై మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్, మే1, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో డీఆర్డీఓలు, ఎంపీడీవోలు మరియు సంబంధిత అధికారులతో ములుగు నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మే మాసం ఉపాధి హామీ పథకం అమలులో అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఉపాధి కోరిన ప్రతి కుటుంబానికి పనిని కల్పించడం ప్రధాన లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి పనులపై డిమాండ్ అధికంగా ఉన్నందున, సాంకేతిక, ఇతర సమస్యలను అధిగమించి ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మే మాసంలో కనీసం మూడున్నర కోట్ల పనిదినాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఏప్రిల్ మాసంలో అధికారులు యజ్ఞంలా పనిచేసి కోటిన్నర పనిదినాలను పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం పంట కోతలు ముగియడంతో ఉపాధి కూలీ పనులకు డిమాండ్ మరింత పెరుగుతుందని, అర్హులైన అన్ని కుటుంబాలకు ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పని ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ వంటి మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. కూలీల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఉపాధి పనులు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా, తీవ్ర ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు నిర్వహించేలా ప్లాన్ చేయాలని సూచించారు.

## ఆదాయ పంపిణీ ప్రాతిపదికన చిత్రాల ప్రదర్శన

### థియేటర్లను మూసివేసే తక్షణ ప్రణాళిక ఏదీ లేదు
### స్పష్టం చేసిన సినిమా ఎగ్జిబిటర్ల సంఘం

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సినిమా థియేటర్లను ఈ నెల 1 నుండి షట్‌డౌన్ చేసే విషయమై ఎగ్జిబిటర్లు సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఆదాయ పంపిణీ ప్రాతిపదికన ఆఫర్ చేసిన చిత్రాలను మాత్రమే ప్రదర్శించనున్నారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా శుక్రవారం నాడు సుమారు ఐదు చిత్రాలు విడుదలవుతూ థియేటర్లలో సందడి కొనసాగుతోంది. వీటిలో ధనుష్ నటించిన కారా ఏప్రిల్ 30న విడుదల కాగా, తరుణ్ భాస్కర్, జెట్లీ నటించిన గాయపడ సింహం, హిందీ చిత్రం ఏక్ దిన్, మోహన్‌లాల్, మమ్ముట్టి నటించిన మలయాళ చిత్రం పేట్రియాట్ శుక్రవారం రిలీజ్ అయ్యాయి. కాగా అద్దె విధానానికి సంబంధించిన వివాదాల కారణంగా తెలంగాణలోని దాదాపు 400 సింగిల్‌స్క్రీన్ థియేటర్లను ఎగ్జిబిటర్లు మే 1వ తేదీ నుండి మూసివేయాలని ఇటీవల నిర్ణయించారు. దీంతో టాలీవుడ్‌లో ఆందోళన నెలకొంది. అయితే, థియేటర్లను మూసివేసే తక్షణ ప్రణాళిక ఏదీ లేదని ఎగ్జిబిటర్లు ఇప్పుడు స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదాయ పంపిణీ ప్రాతిపదికన తమకు ఆఫర్ చేసిన చిత్రాలను ప్రదర్శిస్తామని తెలంగాణ థియేటర్ల సంఘం అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి వెల్లడించారు. మే 1 నుంచి థియేటర్లను మూసివేయడం తమ ఉద్దేశం ఎన్నడూ కాదని ఆయన స్పష్టం చేశారు. సుదీర్ఘ వారాంతం, వేసవి సెలవుల ప్రయోజనం కారణంగా ఈ చిత్రాల విడుదల సమయం అనుకూలంగా ఉందని ఎగ్జిబిటర్లు భావిస్తున్నారన్నారు. అయితే, అన్ని విడుదలలూ ఒకే పద్ధతిని అనుసరించవని, తమ జెట్లీ సినిమా కోసం రెంటల్ విధానానికే కట్టుబడి ఉండాలని నిర్ణయించుకుందని పేరు చెప్పేందుకు ఇష్టపడని మరొకరు పేర్కొన్నారు. ఈ బ్యానర్ నిజాం ప్రాంతంలో పంపిణీదారుగా కూడా పనిచేస్తున్నందున, హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని తమ సొంత 30 థియేటర్ల నెట్‌వర్క్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

## హజ్ యాత్ర ఫీజు రూ.10 వేలు పెంపు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** మధ్య ప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం దృష్ట్యా, హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులు విమాన ఛార్జీల వ్యత్యాసం కోసం రూ.10 వేలు అదనంగా భరించుకోవాలని భారత్ హజ్ కమిటీ స్పష్టం చేసింది. ఇందుకు గాను ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ఈ మొత్తాన్ని ఈ నెల 15వ తేదీలోగా చెల్లించాలని తెలిపింది. ఈ మేరకు దీనికి సంబంధించి తాజాగా జారీ చేసిన ఒక సర్క్యులర్‌లో, యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన సరఫరాలో ఏర్పడిన ఇబ్బందుల కారణంగా ఏవియేషన్ టర్బైన్ ఇంధనం ధరలు విపరీతంగా పెరిగాయని వివరించింది. ఈ కారణంగానే బేస్ ఫేర్‌ను 400 డాలర్లకు పైగా సవరించాలని విమానయాన సంస్థల నుండి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఈ చెల్లింపు సౌకర్యం సంస్థ వెబ్ సైట్ ద్వారా లేదా హజ్ సువిధా యాప్ ద్వారా క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ ఉపయోగించి మొత్తాన్ని జమ చేయవచ్చని సూచించింది. అదేవిధంగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో ప్రతి ఓవర్ నంబర్‌కు ఎదురుగా అందుబాటులో ఉన్న బ్యాంక్ రిఫరెన్స్ నంబర్‌ను ఉపయోగించి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క ఏదైనా శాఖలో హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఖాతాలో పే ఇన్ స్లిప్ ద్వారా చెల్లించాలని విజ్ఞప్తి చేసింది.

## పెండింగ్ చలాన్ల పేరిట వాహనాల జప్తుపై హైకోర్టు మండిపాటు

### డిజిపి, హోం సెక్రటరీ, ట్రాఫిక్ చీఫ్, రవాణా శాఖ కమిషనర్‌కు నోటీసులు

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** పెండింగ్ చలాన్లు వున్నాయనే నెపంతో వాహనాలను పోలీసులు జప్తు చేయడంపై హైకోర్టు మండి పడింది. హైదరాబాద్‌లో పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఓ బాధితుడు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారించిన హైకోర్టు పోలీసుల చర్యలు ఎంతమాత్రం సరైనవి కావని వెల్లడించింది. పెండింగ్ చలాన్లు వున్నాయనే కారణంగా ఎవరి వాహనాలను జప్తు చేయరాదని గ తంలోనే తాము ఆదేశాలు ఇచ్చామని, అయితే పోలీసులు తమ తీర్పును పట్టించుకోకుండా ఇష్టానుసారం వ్యవహరించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని డిజిపితో పాటు హోం శాఖ ముఖ్య కార్యదర్శి, సిటీ ట్రాఫిక్ జాయింట్ సిపి, రవాణా శాఖ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు అమల్లో వుండగా పోలీసుల అతి వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారని, దీనిపై వివరణ ఇవ్వాలని నలుగురు అధికారులకు హైకోర్టు ఆదేశించింది, దీనిపై తదుపరి విచారణను జూన్ 19వ తేదీకి వాయిదా వే సింది.

### నిర్మాణ భద్రతా ప్రమాణాల బలోపేతంలో

## హౌసింగ్ సొసైటీల పాత్ర కీలకం

### - స్పష్టం చేసిన నరెడ్కో తెలంగాణ

**హైదరాబాద్, మే 1, ప్రభాతవార్త:** పట్టణ ప్రాంతాల్లో నిర్మాణ భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడంలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (ఆర్‌డబ్ల్యుఎ), హౌసింగ్ సొసైటీల పాత్ర కీలకమని నారెడ్కో- తెలంగాణ స్పష్టం చేసింది. "సురక్షిత సమాజాల నిర్మాణం- ఆర్‌డబ్ల్యుఎ, హౌసింగ్ సొసైటీల బాధ్యత." అనే అంశంపై శుక్రవారం నరెడ్కో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ డిజి విక్రమ్‌సింగ్‌మాన్, హెచ్ఎండిఎ వాటర్ సరఫరా బోర్డు ఎండి అశోక్‌రెడ్డి తదితరులు హాజరై ప్రసంగించారు. నిర్మాణ సంస్థలు, నిర్మాణ నిపుణులు, అధికారులు భవన భద్రత, అగ్నిమాపక నిబంధనలు, నీటి సరఫరా, పారిశుధ్యం వంటి అంశాలపై అవగాహనను పెంచుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే ప్రజల భద్రతకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మాణ సంస్థలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు రవికుమార్, ప్రతినిధులు బి. సునిల్ చందర్‌రెడ్డి, శ్రీనివాస్ గరిమెళ్ల, కె. శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యతకు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కీలకం

### గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, మే1, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'తో రాష్ట్రాల ప్రజల్లో పరస్పర అవగాహన కలగడంతో పాటు జాతీయ సమైక్యత బలోపేతం అవుతుందనీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'లో భాగంగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వైవిధ్యాలున్న ఐక్యతే భారతదేశ బలమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. పశ్చిమ భారత అభివృద్ధిలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. సాంస్కృతిక వారసత్వంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో ఈ రాష్ట్రాలు విశిష్ట స్థానాన్ని సంపాదించాయని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వం మహారాష్ట్రకు గౌరవాన్ని తీసుకువచ్చిందని, భక్తి సంప్రదాయం సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించిందని చెప్పారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి మహనీయుల పుట్టినిల్లు గుజరాత్ రాష్ట్రం దేశానికి సేవా భావం, ఆవిష్కరణల దిశగా మార్గదర్శకంగా నిలిచిందని గవర్నర్ కొనియాడారు. ఆది శంకరాచార్యులు దేశ సాంస్కృతిక, భౌగోళిక ఐక్యత కోసం కృషి చేశారని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' పేరుతో దేశంలోని విభిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రజల మధ్య పరస్పర అవగాహన, సాంస్కృతిక బంధాన్ని పెంపొందిస్తూ, 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భావనను బలోపేతం చేస్తూ జాతీయ సమైక్యతను ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్న మహారాష్ట్ర, గుజరాత్ ప్రజలు తమ మూలాలను నిలబెట్టుకుంటూనే తెలంగాణ అభివృద్ధికి తోడ్పడుతున్నారని ప్రశంసించారు. అనంతరం మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల గవర్నర్‌లు రాష్ట్ర అవతరణ సందేశాలను డిజిటల్ స్క్రీన్ పై ప్రదర్శించారు.




## రియాన్ పరాగ్ కెప్టెన్ ఇన్నింగ్స్
# రన్స్ ఛేదనలో ఢిల్లీ కింగ్

**జైపూర్:** పరుగుల చేధనలో ఢిల్లీ క్యాపిటల్స్ కింగ్‌గా నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ ఉంచిన 226 రన్స్ లక్ష్యాన్ని మరో 5బంతులు ఉండగానే 3వికెట్లు కోల్పోయి అందుకుంది. మూడు వరుస పరాజయాలకు పుల్‌స్టాప్ పెడుతూ ఢిల్లీ గెలుపుపై నిలిచింది. ఈ సీజన్‌లో నాలుగో విజయంతో ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. రాజస్థాన్‌కు సొంతగడ్డపై ఓటమే దక్కింది.


భారీ టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి ఓపెనర్లు నిస్సాంక(33 బంతుల్లో 62), కేఎల్ రాహుల్(40 బంతుల్లో 75) ఫ్లయింగ్ స్టార్స్ ఇచ్చారు. సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడుతూ తొలి వికెట్‌కు 110 రన్స్ జోడించారు. ఆ తరవాత నితీష్ రాణా(17 బంతుల్లో 33)తో కలిసి రాహుల్ రెండో వికెట్‌కు 61 రన్స్ అందించాడు. రాహుల్‌ను ఆర్చర్ అవుట్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠకు చేరింది. ఈ దశలో రాయల్స్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ట్రిస్టన్ స్టబ్స్(18), అశుతోష్(25) ధాటిగా ఆడి ఢిల్లీ విజయాన్ని ఖాయం చేశారు.

సొంతగడ్డపై రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్(50 బంతుల్లో 90) దుమ్మురేపాడు. చక్కని శుభారంభాలు అందిస్తున్న ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(6), వైభవ్ సూర్యవంశీ (4) ఈసారి విఫలమయ్యారు. ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్స్‌తో రాజస్థాన్ పరుగుల ఖాతాను తెరిచిన జైస్వాల్... మూడో బంతికి స్టార్క్‌కే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరారు. స్టార్క్ ఈ సీజన్‌లో బరిలోకి దిగిన తొలి మ్యాచ్ తొలి ఓవర్‌లోనే వికెట్ పడగొట్టాడు. రెండో ఓవర్‌లో బౌండరీతో ఖాతా తెరిచిన వైభవ్‌ను యార్కర్‌తో జెమీసన్ బోల్తా కొట్టించాడు. దీంతో 12 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రియాన్ పరాగ్.. ధృవ్ జురెల్(30 బంతుల్లో 42)తో కలిసి ఆదుకున్నాడు. ఆరో ఓవర్లో జెమీసన్ బంతులను 6, 4, 6 బాది 20 రన్స్ పిండుకున్నాడు. రియాన్ ఆ తర్వాత వేసిన అక్షర్ పటేల్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, నటరాజన్ బౌలింగ్‌లో 4,6 బాదాడు. మరోఎండ్‌లో ధృవ్ కూడా ధాటిగా ఆడాడు. అక్షర్ బంతికి సిక్స్ బాదిన జురెల్.. ఆ తర్వాతి బంతిని కూడా భారీ షాట్ ఆడబోయి అవుటయ్యాడు. ఇద్దరూ మూడో వికెట్‌కు 102 రన్స్ జోడించారు. జురెల్ అవుటైన తర్వాత రియాన్ మరింత జోరు పెంచాడు. ఈ క్రమంలో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. జెమీసన్ 16వ ఓవర్లో 3 వరుస బౌండరీలతో సెంచరీకి చేరువయ్యాడు. ఈ దశలో స్టార్క్ ఒకే ఓవర్లో జడేజా(20), పరాగ్‌ను అవుట్ చేశాడు.

ఆఖర్లో డొనొవన్ ఫెరియెరా(14 బంతుల్లో 47నాటౌట్) గత మ్యాచ్ తరహాలో చెలరేగాడు. 18వ ఓవర్లో కుల్‌దీప్ బంతులకు మూడు సిక్స్‌లతో 20 రన్స్, స్టార్క్ ఓవర్లో 4, 6తో 14 రన్స్, నటరాజన్ ఓవర్లో 4, 6, 6తో 18 రన్స్ దంచేయడంతో చివరి మూడు ఓవర్లలో 52 రన్స్ వచ్చాయి. దీంతో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లోలో 6 వికెట్లకు 225 రన్స్ సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో స్టార్క్ మూడు వికెట్లు.. జెమీసన్, అక్షర్, నటరాజన్ తలా ఓ వికెట్ పడగొట్టారు.

## లక్కీ లూజర్‌పై మార్టా కోస్టియుక్ విజయం



**మాడ్రిడ్:** ఉక్రెయిన్ సంచలన తార మార్టా కోస్టియుక్... మాడ్రిడ్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో లక్కీ లూజర్ అనస్తాసియా పొటపోవాపై గెలుపొందింది. గంటా 36 నిమిషాల పాటు జరిగిన సెమీస్ పోరులో కోస్టియుక్ 6-2, 1-6, 6-1 తో పొటపోవాను కంగుతినిపించింది. డబ్ల్యుఏ 1000 టోర్నీ ఫైనల్‌కు చేరడం కోస్టియుక్‌కు ఇదే తొలిసారి. టైటిల్ కోసం 9వ సీడ్ మిర్రా ఆంద్రీవాతో తలపడనుంది. కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో సాగుతున్న మార్టా కోస్టియుక్.. సెమీఫైనల్లోనూ అదే జోరు చూపింది. లక్కీ లూజర్‌గా మెయిన్ డ్రాలో ఎంట్రీ ఇచ్చిన అనస్తాసియా పొటపోవా ఒక్కో విజయంతో సెమీఫైనల్ వరకు వచ్చింది. తొలి సెట్‌ను 6-2తో కోస్టియుక్ నెగ్గి ఆధిక్యం చాటింది. అయితే పుంజుకున్న పొటపోవా... రెండో సెట్‌లో కోస్టియుక్ సర్వీసులను పలుసార్లు బ్రేక్ చేసి 6-1తో నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో కోస్టియుక్ ఏస్‌ల ముందు పొటపోవా నిలువలేకపోయింది. పలుమార్లు డబుల్ ఫాల్ట్‌లతో సర్వీసులను చేజార్చుకుంది.

# థామస్ కప్ సెమీస్‌లో భారత్

**హోర్సెన్స్:** డెన్మార్క్ వేదికగా జరుగుతున్న థామస్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. లీగ్ స్టేజ్‌లో రెండు విజయాలతో క్వార్టర్‌ఫైనల్‌కు వచ్చిన లక్ష్యసేన్ నేతృత్వంలోని భారత జట్టు అదే జోరు కొనసాగించింది. చైనీస్ తైపీపై 3-0 తో క్లీన్‌స్వీప్ చేసి సెమీఫైనల్లో ప్రవేశించింది. సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీ విజయాలు అందించారు.

తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ శుభారంభం అందించాడు. చైనీస్ తైపీ ఆటగాడు చో తిన్ చెన్‌పై మూడు సెట్లపోరులో చెమటోడ్చి నెగ్గాడు. తొలి సెట్‌ను 18-21తో చేజార్చుకున్న లక్ష్యసేన్.. ఆ తర్వాత చక్కగా పుంజుకున్నాడు. పోటాపోటీగా జరిగిన రెండు సెట్లను 22-20, 21-17తో గంటా 28 నిమిషాల్లో ముగించాడు. భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. రెండో సింగిల్స్‌లోనూ ఆయుష్ షెట్టి జోరు చూపాడు. ఇటీవలి విజయాలతో చక్కని ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆయుష్ షెట్టి... వరుస సెట్లలో ఆల్‌ఇంగ్లాండ్ ఛాంపియన్ లిన్ చున్‌యిపై గెలుపొందాడు. తొలి సెట్‌ను 21-16లో అలవోకగా ముగించిన ఆయుష్‌కు రెండో సెట్‌లోనూ పెద్దగా

### క్వార్టర్‌లో చైనీస్‌తైపీపై 3-0తో క్లీన్‌స్వీప్






ప్రతిఘటన ఎదురుకాలేదు. ఈసెట్‌ను కూడా 21-17తో ముగించి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఇక డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మరో విజయం అందించింది. ఈ జోడీ మూడు సెట్ల పోరులో 23-21, 19-21, 21-12తో చైనీస్ తైపీ జోడీ వాంగ్ చిన్ లిన్-చ్యు హిసాంగ్ చే జోడీపై విజయం సాధించారు. ఇండోనేషియాపై భారత్‌కు 3-0తో క్లీన్ స్వీప్ అందించారు. భారత్ సెమీఫైనల్లో.. ఫ్రాన్స్, జపాన్ మ్యాచ్ విజేతతో తలపడనుంది. బ్యాడ్మింటన్ టీమ్‌లో ప్రతిష్టాత్మకమైన థామస్ కప్‌ను ఒకేఒకసారి అందుకుంది. 2022లోఛాంపియన్‌గా నిలిచింది. కాగా ఉబెర్ కప్‌లో భారత మహిళల టీమ్ లీగ్ దశలోనే నిష్క్రమించింది.



## టెస్ట్‌ల్లో టీమిండియాకు మూడో ర్యాంకు

**దుబాయి:** ఐసీసీ వార్షిక టెస్ట్ ర్యాంకుల్లో టీమిండియా మెరుగుపడింది. టాప్-3లో చోటు సంపాదించింది. తాజాగా టెస్ట్ ర్యాంకులను ఐసీసీ వెల్లడించింది. వార్షిక టెస్టు ర్యాంకుల్లో ఆస్ట్రేలియా (131 పాయింట్లు) అగ్రస్థానంలో నిలిచింది. రెండో ర్యాంకు దక్షి ణాఫ్రికా (119) సొంతమైంది. ఇక భారత్ (104) కూడా ఒక ప్లేస్‌ను మెరుగుపర్చుకుని మూడో ర్యాంకును అందుకుంది. బజ్‌బాల్ క్రికెట్ అంటూ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తోన్న ఇంగ్లాండ్ (102) ర్యాంకు నాలుగుకు పడిపోయింది. న్యూజి లాండ్ (101) ఐదో స్థానంలో ఉండగా, ఆ తర్వాత పాకిస్థాన్ (89), శ్రీలంక (86), వెస్టిండీస్ (68), బంగ్లాదేశ్ (67), ఐర్లాండ్ (25), జింబాబ్వే (10) జట్లు కొనసాగుతున్నాయి.

వన్డే, టీట్వంటీ క్రికెట్‌లో చక్కని విజయాలు సాధించిన టీమిండియా.. గతేడాది టెస్టుల్లో ఇబ్బంది పడింది. స్వదేశంలోనూ పరాజయాలను చవిచూసింది. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్ నాలుగో సీజన్ నడుస్తోంది. ఈ ఏడాది ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్‌తో టీమిండియా టెస్టులు ఆడబోతోంది. ప్రస్తుతం ఆరో స్థానంలో ఉన్న టీమిండియా... అన్నింట్లోనూ విజయాలు సాధించడంతో పాటు మిగతా జట్లు వెనకబడితేనే డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశం ఉంటుంది.

## సన్‌రైజర్స్ జట్టులోకి అండర్-19 హీరో

**హైదరాబాద్, మే2(వార్త క్రీడా ప్రతినిధి**

గాయపడిన ఆల్‌రౌండర్ శివమ్ మావి స్థానాన్ని అండర్19 ప్రపంచకప్ 2026 హీరో, యువ పేస్ బౌలింగ్‌ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబ్రిష్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భర్తీ చేసింది. ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. 18 ఏళ్ల అంబ్రిష్ ఈ ఏడాది అండర్-19 ప్రపంచకప్ భారత్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. టోర్నీలో 11 వికెట్లు తీసి భారత తరఫున సంయుక్తంగా అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. కుడిచేతి మీడియం పేసర్ అయిన అంబ్రిష్.. ఎడమచేతితో బ్యాటింగ్ చేస్తాడు. లోయర్ ఆర్డర్‌లో ఉపయోగకర బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఈ ఆల్‌రౌండ్ నైపుణ్యం ఎస్ఆర్‌హెచ్‌కు అదనపు బలంగా మారనుంది. ఇప్పటికే ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ వంటి దేశీయ యువ పేసర్లతో కలకలలాడుతున్న ఎస్ఆర్‌హెచ్‌కు అంబ్రిష్ మరో అస్త్రంగా మారే అవకాశం ఉంది. ఈ సీజన్ వేలంలో మావిని రూ.75 లక్షల బేస్ ధరకు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. అయితే అతను గజ్జలో గాయం కారణంగా సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో అంబ్రిష్(రూ. 30 లక్షలకు)ను సన్‌రైజర్స్ ఎంపిక చేసుకుంది.

## అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ
# యేడాదిలోనే 2లక్షల కోట్ల ఆస్తులు జోడింపు



**ముంబయి, మే 1:** అదానీ గ్రూప్ తమ వ్యాపారాల్లో వేగవంతమైన వృద్ధిని కొనసాగిస్తూ ఈ ఒక్క ఏడాదిలోనే కొత్తగా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను సమకూర్చుకోనున్నట్లు గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ప్రకటించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రూప్‌లోని 4 లక్షల మంది ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గడిచిన 35 ఏళ్లలో తాము సుమారు రూ.2లక్షల కోట్ల ఆస్తులను నిర్మించామని, ఇప్పుడున్న తమ సామర్థ్యంతో ఈ ఒక్క ఏడాదిలోనే మరో రూ.2 లక్షల కోట్ల ఆస్తులను జోడించబోతున్నామని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో తమ వంతు పాత్ర పోషిస్తామని గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. తాము చేపట్టే ప్రాజెక్టులు కేవలం పనులు పూర్తి చేయడం కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడమేనని ఆయన అన్నారు. ముంద్రా పోర్టు, గంగా ఎక్స్‌ప్రెస్‌వే వంటి ప్రాజెక్టులను ఉదాహరణగా చూపుతూ, ఇవి దేశ నిర్మాణంలో కీలకమైనవని పేర్కొన్నారు. పలు కీలక ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఒకప్పుడు బీడుభూమిగా ఉండి, ఇప్పుడు దేశంలోనే అతిపెద్దదైన ముంద్రా పోర్టు, కేరళలోని విజింజం పోర్టులు దేశ వాణిజ్యాన్ని, అంతర్జాతీయ సముద్ర వాణిజ్య పటంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. కచ్‌లోని ఖవ్డాలో నిర్మిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఇంధనాన్ని అందిస్తుందన్నారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని, ఇటీవల ప్రారంభమైన గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఉత్తరప్రదేశ్‌లో 8 కోట్ల మంది ప్రజల జీవితాలను మార్చబోతోందని వివరించారు. మీరట్, ప్రయాగ్ రాజ్ మధ్య ప్రయాణ సమయం 10-11 గంటల నుంచి 56 గంటలకు తగ్గుతుందని తెలిపారు. ముంబైలోని ధారవి మురికివాడల పునరాభివృద్ధి ప్రాజెక్టును కేవలం ఒక ప్రాజెక్టుగా కాకుండా, మానవ పరివర్తనలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత సవాలుతో కూడిన ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. దేశ నిర్మాణంలో భాగంగా తాము చేపడుతున్న ఈ ప్రాజెక్టులన్నీ తమ వంతు వినయపూర్వకమైన సేవలని గౌతమ్ అదానీ పేర్కొన్నారు.

## టెస్లా ఎలాన్‌మస్క్ వేతన ప్యాకేజి
# 15 లక్షలకోట్లు



**న్యూయార్కు, మే 1:** టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని పొందారు. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఆయన ప్యాకేజీని కంపెనీ పేర్కొంది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.15 లక్షల కోట్లు. ఎలాన్ మస్క్ నెలవారీ వేతనంగా ఎలాంటి మొత్తాన్ని పొందడం లేదు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. ఈ క్రమంలో గత సంవత్సరానికి గాను ఆయన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. ఈ మొత్తంతో పోలిస్తే ఆయన పొందే విలువలై చాలా వ్యత్యాసం ఉంటుందని కూడా టెస్లా తన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా ఉంది. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు కూడా టెస్లా బోర్డు ఆమోదిస్తేనే అందుతుంది. ఈ క్రమంలో 2025 సంవత్సరానికిగాను ఆయన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. ప్రకటించిన మొత్తంతో పోలిస్తే ఆయన పొందే విలువకు చాలా వ్యత్యాసం ఉంటుందని కూడా టెస్లా తన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

# ఎటిఎఫ్ ధరల పెరుగుదలతో విమాన సర్వీసులు కుదింపు




**ముంబయి,మే 1:** ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు భారీగా పెరిగిన క్రమంలో ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా ఆర్థిక భారంగా మారిన పలు మార్గాలలో విమాన సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రోజువారీగా 100 సర్వీసులను తగ్గించుకోనుంది. ఏటీఎఫ్‌గా పిలుచుకునే ఈ ఇంధన ధరలు పెరిగినందున కొన్ని మార్గాలకు విమానాలను నడపడం ఆర్థిక భారంగా ఎయిరిండియా భావిస్తోంది. ఎయిరిండియా రోజుకు సగటున 1,100 సర్వీసులను నడుపుతోంది. ఇంధన వినియోగం అధికంగా ఉండి, మార్జిన్లు అంతగా లేని యూరప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి సుదూర అంతర్జాతీయ మార్గాలలోని సర్వీసులకు ప్రధానంగా కోత పెట్టనుంది. అలాగే, ఢిల్లీ, ముంబై నగరాలకు లండన్, ప్యారిస్, న్యూయార్క్, టొరంటో, శాన్‌ఫ్రాన్సిస్కో, సిడ్నీ, మెల్‌బోర్న్ నుంచి రాకపోకలు సాగించే విమానాల సంఖ్య కూడా తగ్గనుంది. అమెరికా, ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధం నేపథ్యంలో వరుసగా రెండో నెల ఏటీఎఫ్ ధరలు పెరిగాయి. అంతర్జాతీయ విమాన సంస్థలకు ఏటీఎఫ్ ధరను 5 శాతం పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. తాజా ప్రకటనతో ఢిల్లీలో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర ఐదు శాతం పెరిగి, 1,511.86 డాలర్లకు చేరుకుంది. ఇంధన ధరలు పెరగడంతో నిర్వహణ వ్యయాలు భారంగా మారుతాయని విమానయాన సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాగే అయితే తాము సర్వీసులు నడపలేమని ఎయిర్‌లైన్స్ ఫెడరేషన్ ఇండియా ఎఫ్ఐఎ కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖకు లేఖలు కూడా రాసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కొన్ని సంస్థలు సర్వీసులు తగ్గించుకోగా మరికొన్ని అదే బాటలో ముందుకు వస్తున్నాయి. ఇపుడు ఎయిర్‌ఇండియా కూడా సర్వీసులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.





## దేశంలో యుపిఐ లావాదేవీలు
# రూ.29.03 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, మే 1:** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యుపిఐ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. గత ఏప్రిల్ నెలలో లావాదేవీల సంఖ్య, విలువల పరంగా రికార్డుస్థాయి వృద్ధి నమోదైంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా 22.35 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25 , విలువలో 21 శాతం వృద్ధి కనిపించింది. మార్చిలో రోజుకు సగటున 730 మిలియన్ల లావాదేవీలు జరగగా, ఏప్రిల్‌లో ఈ సంఖ్య 745 మిలియన్లకు పెరిగింది. అలాగే, రోజువారీ లావాదేవీల సగటు విలువ రూ.95,243 కోట్ల నుంచి రూ.96,766 కోట్లకు చేరింది. ఐఎంపీఎస్ ద్వారా 362 మిలియన్ల లావాదేవీలు జరగ్గా, వాటి విలువ రూ.7.01 లక్షల కోట్లుగా నమోదైంది. యూపీఐ సేవలు కేవలం దేశానికే పరిమితం కాలేదు. ఇప్పటికే యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8కి పైగా దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అంతర్జాతీయ విస్తరణ ద్వారా విదేశాల నుంచి డబ్బు పంపడం సులభతరం అవ్వడమే కాకుండా, ప్రపంచ ఫిన్‌టెక్ రంగంలో భారత్ స్థానం మరింత పటిష్ఠమవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో దాదాపు 12వేల రెట్ల వృద్ధి నమోదైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్ల లావాదేవీలు జరగ్గా, 2025-26 నాటికి ఆ సంఖ్య 24,162 కోట్లకు చేరింది. లావాదేవీల విలువ 0.07లక్షల కోట్ల నుంచి రూ.314 లక్షల కోట్లకు పెరిగి, నాలుగువేల రెట్ల వృద్ధిని నమోదు చేసింది. యూపీఐ పనితీరు, విశ్వసనీయత కారణంగా భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. లావాదేవీల సంఖ్య పరంగా యూపీఐ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ పేమెంట్ సిస్టమని ఐఎంఎఫ్ గుర్తించింది.

## జిఎస్టీ వసూళ్లు రూ2.43 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, మే 1:** భారత జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్‌ణెలలో రికార్డుస్థాయికి పెరిగాయి. స్థూల జిఎస్టీ వసూళ్లు 8.7శాతంపెరిగి ఏప్రిల్‌లో రూ.2.43 లక్షలకోట్లువరకూ వచ్చాయి. శుక్రవారం కేంద్రం విడుదల చేసిన గణాంకాలనున చూస్తే గత ఏడాది ఏప్రిల్‌లో కూడా ఆల్‌టైమ్ గరిష్టానికి వసూళ్లు నమోదయ్యాయి. ఆనాడు వసూళ్లు రూ.2.23లక్షలకోట్లుగా ఉన్న సంగతి తెలిసిందే. దేశీయ లావాదేవీలు కూడా 4.3శాతం పెరిగి రూ.1.85 లక్షలకోట్లు వసూలయ్యాయి. వినియోగ లావాదేవీలు పెరిగినట్లు తెలుస్తోంది. దిగుమతుల రెవెన్యూ కూడా 25.8శాతంపెరిగి రూ.57,580 కోట్లకు చేరాయి. ఈ వసూళ్లు జిఎస్టీ రాబడులకు మరింత ఊతం ఇచ్చాయి. ఇక జీఎస్టీ రీఫండ్‌లు కూడా 19.3శాతంపెరిగి రూ.31,793 కోట్లకు చేరాయి. నికరంగా రీఫండ్‌ల సర్దుబాటు తర్వాత నికర వసూళ్లు రూ.2.11 లక్షలకోట్లకు చేరాయి. 2025 ఏప్రిల్ నెలతో పోలిస్తే రూ.2.11 లక్షలకోట్లకు చేరాయి. దిగుమతులకు సంబంధించి రీఫండ్‌లు 14శాతం తగ్గాయి. 2027 ఆర్థికసంవత్సరానికి కేంద్రం జిఎస్టీ రాబడుల లక్ష్యం రూ.10 2 లక్షలకోట్లుగా నిర్ణయించింది. 2026 సంవత్సర టార్గెట్ 10.46 లక్షలకోట్లకంటే స్వల్పంగా తక్కువ విధించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకారణంగానే ఈ లక్ష్యం తగ్గించిందని తెలుస్తోంది. అయితే రానున్న నెలల్లో జీఎస్టీ రాబడులు మరింతగా ఉంటాయని కూడా చెపుతున్నారు.

## ఒక్కనెలలో రూ.60,847 కోట్లు విత్‌డ్రా



**ముంబయి, మే 1:** విదేశీ ఇన్వెస్టర్లు స్థానిక ఈక్విటీ మార్కెట్లనుంచి ఏప్రిల్‌నెలలో 60,847 కోట్ల రూపాయలు విత్‌డ్రాచేసారు. భౌగోళిక ఉద్రిక్తతలు ఎక్కడా సర్దుబాటు కాకపోవడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో విదేశీ ఇన్వెస్టర్లలో అనిశ్చితి ఏర్పడింది. దీనితో స్టాక్ విత్‌డ్రా ఎక్కువయింది. విదేశ ఈపోర్టుఫోలియో ఇన్వెస్టర్లు గడచిన నాలుగు నెలల్లో 1.92 లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. గత ఏడాది మొత్తం కేలండర్‌సంవత్సరంలో రూ.1.66 లక్షలకోట్లు విత్‌డ్రా చేసిన మొత్తం కంటే ఈఏడాది నాలుగునెలల్లోనే అత్యధిక పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరి మినహా ఇతర అన్నినెలల్లోను ఎఫ్‌పిఐలు విత్‌డ్రాచేసారు. జనవరిలో రూ.35,962కోట్లు, ఫిబ్రవరిలో అయితే 22,165 కోట్లు పెట్టుబడులుపెట్టారు. మళ్లీ మార్చినెలలో రూ.1.17 లక్షలకోట్లు ఏప్రిల్‌లోరూ.60,847 కోట్లు విత్‌డ్రాచేసుకున్నారు. గ్లోబల్ స్థూల ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టంగా మారడంతో ఉద్రిక్తతలు కూడా ఎక్కడా చల్లారకపోవడంతో పెట్టుబడులకు ఈక్విటీలు సురక్షితంకాదని ఎఫ్‌పిఐలు విత్‌డ్రాచేసారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడిచమురుధరలు గరిష్టంగాపెరిగాయి. ఫలితంగా డాలరుతోరూపాయి చెలామణి కూడా క్షీణించింది. ముడిచమురుధరలు 114 డాలర్లకు పెరగడం, రూపాయి మారకం విలువలు 95.35కు చేరుకోవడం వంటివి పెట్టుబడులు విత్‌డ్రాకు ఎక్కువ ఊతం ఇచ్చాయి. ఎంపికచేసిన ఎఫ్‌పిఐలు పెట్టుబడులు ఉన్నప్పటికీ మెజార్టీశాతం విత్‌డ్రా అయ్యాయి. దేశీయ ఇన్వెస్టర్లు కొంతమేర పెట్టుబడులు పెంచడంతో మార్కెట్లలో కొంతమేర స్థిరత్వం వచ్చింది. దీనికితోడు బాండ్ల రాబడులు 4.5శాతం పెరగడం అమెరికా బాండ్లపై అమ్మకాల వత్తిడి కూడా పెరిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.